

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 194

బుధవారం 4-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గ్రామాల స్వావలంబన, రైతన్నల సంక్షేమంతో తెలంగాణ పురోగమిస్తోంది.

ఇదే మన తెలంగాణ



తరతరాల దాహార్తికి శాశ్వత పరిష్కారం

పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు

- 6 కరువు పీడిత జిల్లాలకు ప్రయోజనం
- 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు
- 1,225 గ్రామాలకు రక్షిత మంచినీరు
- 3 టీఎంసీల నీరు పారిశ్రామిక అవసరాలకు
- హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు తాగునీరు



రైతు ఋణ భారాలకి సెలవు

రైతుబంధు

- రూ. 10 వేలు ఏడాదికి ఎకరాకు రైతుకు పెట్టుబడి సాయం
- రూ. 73,815 కోట్లు నేరుగా రైతుల ఖాతాలకు బదిలీ
- 70,54,000 మంది రైతులకు ప్రయోజనం
- ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా రైతు సంక్షేమం
- రైతులకు రూ. 37 వేల కోట్ల పంట ఋణాలు మాఫీ



వర్షం పై ఆధారపడకుండా రైతుకు సాగునీరు

మిషన్ కాకతీయ

- 46,531 చెరువులు, కుంటల పునరుజ్జీవంతో ఏడాది పొడుగునా నీరు
- 15 లక్షల ఎకరాలకు సాగునీరు
- భూగర్భ జలాల లభ్యత పెంపుకు పటిష్ఠ చర్యలు
- కరువుపీడిత ప్రాంతాలు సస్యశ్యామలం





ఒక్క పంటే కష్టంగా పండే నేలలో ఏడాదికి మూడు పంటలు

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్

- ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్
- 45 లక్షల ఎకరాలకు సాగునీరు
- హైదరాబాద్ నగరానికి తాగునీరు
- పారిశ్రామిక అవసరాలకు 15 టీఎంసీల నీరు



ప్రతి రైతు కుటుంబానికి సురక్షితమైన భవిష్యత్తు

రైతు బీమా

- తెలంగాణలోని ప్రతి రైతుకు రూ. 5 లక్షల బీమా
- రైతుకు మరణం సంభవిస్తే కుటుంబానికి ఆర్థిక భరోసా
- ఇప్పటివరకు 1,02,124 రైతు కుటుంబాలకు అందిన పరిహారం



ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు

మిషన్ భగీరథ


- తెలంగాణలో 1.06 కోట్ల గృహాలకు రక్షిత మంచినీరు
- 23,839 గ్రామీణ ఆవాసాలు , 142 నగర స్థానిక సంస్థలకు రక్షిత మంచినీటి సరఫరా
- పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సంస్థలకు నల్లా కనెక్షన్లు



స్వయం సమృద్ధి బాటలో ప్రతి గ్రామం

పల్లె ప్రగతి

- ప్రతిపల్లెకు అవసరమైన ట్రాక్టర్, నీటిట్యాంకర్, నర్సరీ, డంపింగ్ యార్డ్ ట్రాలీ, వైకుంఠ ధామం కేటాయింపు
- పల్లెకు కావాల్సిన వనరులన్నీ పల్లెలోనే లభ్యం
- తెలంగాణ పల్లె ప్రగతికి నిదర్శనంగా 81 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు



అన్ని రంగాలకు నిరంతర విద్యుత్

24X7 నాణ్యమైన కరెంటు

- గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్
- వ్యవసాయ అవసరాలకు 24X7 ఉచిత విద్యుత్
- విద్యుత్ సరఫరాతో పారిశ్రామిక ప్రగతి
- 18,567 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యానికి, 5,347 మెగావాట్ల సౌరవిద్యుత్తు అదనం
- తలసరి విద్యుత్ వినియోగంలో దేశంలోనే తెలంగాణ నెం. 1




సాంప్రదాయ వృత్తులకు చేయూత

సబ్బండ వర్గాల సంక్షేమం

- టెక్స్ టైల్ పార్కుల ఏర్పాటు, చేనేత వృత్తులవారికి 50 శాతం సబ్సిడీతో ముడి సరుకు సరఫరా
- ప్రతి గొర్రెల కాపరికి 20+1 గొర్రెల పంపిణీ
- 10.17 లక్షల మంది మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ

జారీ చేసినవారు : స్పెషల్ కమీషనర్, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 194
బుధవారం 4-10-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'



పసిడి పారుల్... అన్ను బంగారం

ఆసియా క్రీడల్లో పదో రోజు భారత్ ఖాతాలో రెండుస్వర్ణాలు, రెండు రజతాలు, ఐదు కాంస్యాలు. 5000 మీటర్లలో, జావెలిన్ త్రోలో భారత్‌కు తొలిసారి స్వర్ణ పతకాలు అందించిన పారుల్ చౌధరీ, అన్ను రాణి. 69 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతున్న భారత్. - 12లో



ఢిల్లీలో భూప్రకంపనలు

నేపాల్‌లో సంభవించిన భూకంపాల ప్రభావం ఉత్తర భారతాన్ని వణికించింది. ఢిల్లీలో భూప్రకంపనల ధాటికి ప్రజలు బెంబేలెత్తారు. - వివరాలు 6లో



బ్రిటన్ వీసాల ఫీజు పెంపు

బ్రిటన్ ఇటీవల ప్రకటించిన విద్యార్థి, పర్యాటక తదితర అన్ని వీసా ఫీజుల పెంపు నిర్ణయం నేటి నుంచే అమల్లోకి రానుంది. - వివరాలు 6లో



దౌత్యవేత్తల సంఖ్యని తగ్గించండి

భారత్‌లో ఉన్న దౌత్యవేత్తల సంఖ్యని తగ్గించాలని కెనడా హైకమిషనరేట్‌కు భారత్ అల్టిమేటమ్ జారీ చేసింది. - వివరాలు 6లో



థాయ్ మాల్‌లో కాల్పులు

థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని అతి పెద్ద షాపింగ్‌మాల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు మరణించారు. - వివరాలు 6లో

కేసీఆర్ వస్తే.. వద్దన్నాం!

బీఆర్ఎస్ ఎన్డీయేలో చేరతామంటే తిరస్కరించాను.. కేటీఆర్‌ను సీఎంను చేస్తానంటే ఇది రాచరికం కాదని చెప్పా

బీజేపీ నిజామాబాద్ ప్రజాగర్జన సభలో ప్రధానమంత్రి మోదీ సంచలన వ్యాఖ్యలు


రైతులు ఇచ్చిన పసుపు కొమ్ముల దండ, పసుపు మొక్కతో ప్రధాని మోదీ

మోదీ.. మరో పటేల్‌లా వెలుగులు తెస్తాడు

"దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా నిజాం పాలనలోని హైదరాబాద్ స్టేట్‌కు స్వాతంత్ర్యం రాలేదు. నిజాంలను తరిమికొట్టేందుకు అందరూ భయపడ్డారు. కానీ ఓ గుజరాతీ బిడ్డ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ వచ్చాకే హైదరాబాద్‌కు విముక్తి లభించింది. ఇప్పుడు మళ్లీ ఇంకో గుజరాతీ బిడ్డ మోదీ వచ్చాడు. అతడు మీ కోసం మరో పటేల్‌లా అభివృద్ధితో ప్రజల జీవితాల్లోకి వెలుగులు తెస్తాడు.

- తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ కుటుంబం కబ్జా చేసింది
- ఆయన కొడుకు, అల్లుడు కలసి భారీ అవినీతికి పాల్పడుతున్నారు
- వారు లోక్‌తంత్రను లూట్‌తంత్రగా మార్చారు.. ప్రజాస్వామ్యాన్ని కుటుంబస్వామ్యంగా మార్చేశారు
- బీఆర్ఎస్ అవినీతిని ప్రశ్నిస్తే.. ఇష్టం వచ్చినట్టు విమర్శలు చేస్తున్నారు
- కాంగ్రెస్ పెద్ద కిలాడీ పార్టీ.. దానికి బీఆర్ఎస్‌కు మధ్య చీకటి సంబంధం
- బీఆర్ఎస్ తెలంగాణలో దోచుకున్న సొమ్మును కర్ణాటక ఎన్నికల కోసం కాంగ్రెస్‌కు ఇచ్చింది
- మరో ఐదేళ్లు వారికి లూటీ చేసే అధికారం ఇవ్వొద్దు.. బీజేపీని ఆశీర్వదించాలని ప్రధాని విజ్ఞప్తి

నిజామాబాద్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నుంచి 48 మంది కార్పొరేటర్లు గెలిచాక.. ఎన్డీయేలో చేరతామంటూ సీఎం కేసీఆర్ తనను కలసి విజ్ఞప్తి చేశారని.. కానీ బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశానని ప్రధాని మోదీ చెప్పారు. కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్‌ను సీఎం చేద్దామని అనుకుంటున్నా ఆశీర్వదించాలని చెబితే.. కొడుకును సీఎం చేయడానికి ఇదేం రాచరికం కాదని స్పష్టం చేశానని పేర్కొన్నారు. తర్వాతి రోజుల్లో కేసీఆర్ తనపై, బీజేపీపై ఇష్టం వచ్చినట్టు విమర్శలు చేశారన్నారు. మంగళవారం నిజామాబాద్‌లోని గిరిరాజ్ కాలేజీ మైదానంలో జరిగిన బీజేపీ మిగతా 2వ పేజీలో ▶

నువ్వేమైనా రాజువా.. కూర్చోబెట్టడానికి?

ఒకట్రెండు సార్లు కేసీఆర్ నన్ను కలిశారు. తాను తప్పుకోవాలనుకుంటున్నానని, తన కొడుకు కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగించాలనుకుంటున్నానని నాతో చెప్పారు. కేటీఆర్‌ను పంపిస్తా, ఆశీర్వదించాలని కోరారు. అప్పుడు నువ్వేమైనా రాజువా, మహారాజువా? నీ తర్వాత నీ కొడుకు కూర్చోవడానికి? అని ప్రశ్నించాను. ఎవరిని సీఎంగా కూర్చోబెట్టాలో తెలంగాణ ప్రజలు నిర్ణయిస్తారని చెప్పాను. నేను ఇలా చెప్పిన రోజు నుంచి కేసీఆర్ నన్ను కలవలేదు. కనీసం నా కళ్లలోకి చూసే సాహసం కూడా చేయడం లేదు. ఆ తర్వాతి రోజుల్లో నాపై, బీజేపీపై ఇష్టం వచ్చినట్టు విమర్శలు, ఆరోపణలు మొదలుపెట్టారు. మీడియా వాళ్లు కూడా ఈ తేదీలు చెక్ చేసుకోవచ్చు. నా పక్కన అవినీతిపరులకు చాన్స్ లేదు. – మోదీ

కేసీఆర్ సర్కార్ పాలనకు చరమగీతం పాడాలి



- ఇందూరు సభలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

- వివరాలు 2లో

న్యూస్‌రీల్

న్యూస్‌క్లిక్ ఆఫీసులపై ఢిల్లీ పోలీసుల ఆకస్మిక దాడులు



చైనా అనుకూల సమాచారాన్ని భారత్‌లో విస్తృతంగా ప్రచారంచేసేందుకు భారీ స్థాయిలో నగదును స్వీకరించిందన్న ఆరోపణలపై ఆన్‌లైన్ న్యూస్‌పోర్టల్ 'న్యూస్‌క్లిక్'పై ఢిల్లీ పోలీసులు ఆకస్మిక దాడులు చేపట్టారు.
- వివరాలు 6లో

బీఆర్ఎస్ అంటే బీజేపీ రిష్తేదార్ సమితి



బీఆర్ఎస్ అంటే బీజేపీ రిష్తేదార్ సమితి అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. నిజామాబాద్‌లో మంగళవారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ఈ విషయాన్ని అంగీకరించారని రాహుల్ చెప్పారు.
- వివరాలు 2లో

20 మందితో బీఎస్పీ తొలి జాబితా



శాసనసభ ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. తాను ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నట్టు వెల్లడించారు.
- వివరాలు 3లో

జ్వరం.. వణుకుతున్న జనం!



రాష్ట్రవ్యాప్తంగా డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభించి జనం అల్లాడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 5,315 డెంగీ కేసులు నమోదయ్యాయి.
- వివరాలు 14లో

బదిలీలకు ఓకే.. పదోన్నతులకు బ్రేక్

- కోర్టు ఉత్తర్వులతో ఆగిన ఉపాధ్యాయుల ప్రమోషన్లు
- యథావిధిగా కొనసాగనున్న బదిలీల ప్రక్రియ
- ఈ నెల 9వ తేదీలోగా అధికారిక ఆదేశాలు
- ప్రత్యామ్నాయ టీచర్ వస్తేనే రిలీవ్ అయ్యే చాన్స్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల పదోన్నతు లను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. బదిలీలను మాత్రం యథావిధిగా కొనసాగిస్తున్నట్టు తెలిపింది. అయితే గతంలో వెల్లడించిన షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసింది. గత షెడ్యూల్ ప్రకారం ఈ నెల 4వ తేదీన బదిలీ ఉత్తర్వులు టీచర్లకు అందాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఈ నెల 9వ తేదీన అధికారిక ఆదేశాలు ఇవ్వనున్నారు. బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. బదిలీల కోసం టీచర్ల నుంచి అందిన దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులను 4వ తేదీ కల్లా పూర్తి చేయాలని, 5వ తేదీన సీనియారిటీ జాబితాను వెల్లడించాలని తెలిపారు. ఈ నెల 6, 7 తేదీల్లో టీచర్లు బదిలీ కావాల్సిన పాఠశాలల వివరాలతో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని, వీటిల్లో మార్పులుంటే 8వ తేదీ నాటికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన బదిలీ ఉత్తర్వులు సంబంధిత ఉపాధ్యాయులకు అందించాలని స్పష్టం చేశారు.

టెట్ తెచ్చిన తిప్పలు: టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి గత నెల ఒకటవ తేదీన విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా ముందుగా ప్రధానోపాధ్యాయుల ఖాళీలు గుర్తించి, వాటిని స్కూల్ అసిస్టెంట్ల ద్వారా భర్తీ చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ఇదే క్రమంలో స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలను గుర్తించి, ఎస్జీటీల ద్వారా 70 శాతం నింపేందుకు వీలుగా దరఖాస్తుల పరిశీలన వరకూ వెళ్ళింది. ఈ దశలో సీనియారిటీలో హేతుబద్ధత కొరవడిందని కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీంతో మల్టీజోన్-2 పరిధిలోని ప్రమోషన్లు తొలుత నిలిపివేశారు. ఇదే సమయంలో కేంద్ర నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పాసయిన వారికే పదోన్నతులు ఇవ్వాలని మరికొంతమంది కోర్టును ఆశ్రయించారు. వాస్తవానికి 2010లో కేంద్రం ఈ నిబంధనను తెచ్చింది. కానీ రాష్ట్రంలో టెట్ 2011 నుంచి ఏర్పాటు చేశారు. ఈ కారణంగా అంతకుముందు నియమితులైన టీచర్లకు టెట్ అర్హత ఉండే ఆస్కారం లేదనే ఉద్దేశంతో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం దీనికి మినహాయింపు ఇచ్చింది. అయితే ఇది కేవలం సర్వీస్‌లో కొనసాగడానికేనని, పదోన్నతులకు టెట్ ఉండాలన్న వాదనను కోర్టు మిగతా 3వ పేజీలో ▶

కేసీఆర్ ఫైటర్.. చీటర్‌తో కలవరు

మోదీని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

- ప్రధాని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు
- సీఎం అధికారిక భేటీని కూడా నీచ రాజకీయాలకు వాడుతున్నారు
- నన్ను ఆశీర్వదించాలని మోదీని కేసీఆర్ కోరారట..
- నేను సీఎం కావడానికి ఆయన అనుమతి తీసుకోవాలా?
- ఎన్డీయే మునిగిపోతున్న నావ.. అందులో చేరేందుకు మాకేమైనా పిచ్చి కుక్క కరిచిందా?


డబుల్ బెడ్‌రూమ్ ఇంటి పట్టా పంపిణీ సందర్భంగా ఉద్వేగానికి లోనైన మహిళను ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పచ్చి అబద్ధాలకోరు. బీజేపీ జుమ్లా, జూటా పార్టీ ఆఫ్ ఇండియా. ఆ పార్టీ ఒక వాట్సాప్ యూనివర్సిటీ. దానికి చాన్స్‌లర్ ఆయన. కథలు చెప్పడంలో ఆరితేరిన ప్రధాని సినిమా కథలు రాసేందుకు ప్రయత్నించాలి. ఆయన నటనకు తప్పకుండా ఆస్కార్ అవార్డు వస్తుంది. ముఖ్యమంత్రితో జరిగిన అధికారిక సమావేశాలను నీచమైన రాజకీయాలకు వాడుతున్న మోదీ.. ప్రధాని పదవి స్థాయిని దిగజార్చేలా మాట్లాడుతున్నారు. నన్ను ఆశీర్వదించాలని మోదీని కేసీఆర్ కోరారట! నేను సీఎం కావడానికి ఆయన అనుమతి తీసుకోవాలా? మా పార్టీలో ఎవరు ముఖ్యమంత్రి కావాలో నిర్ణయించేది ప్రధాని కాదు.. మా పార్టీ ఎమ్మెల్యేలనే విషయం కూడా ఆయనకు తెలియదు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే మునిగిపోతున్న నావ. మునిగే నావను ఎక్కాలని ఎవరూ అనుకోరు. ఎన్డీయేలో చేరేందుకు మాకేమైనా పిచ్చి కుక్క కరిచిందా? శివసేనతో సహా ఇప్పటికే ఎన్నో పార్టీలు ఎన్డీయే కూటమి నుంచి బయటికి వచ్చాయి. ఆ పార్టీలో ఉన్నవి ప్రస్తుతం ఈడీ, సీబీఐ, ఐటీ మాత్రమే. సీఎం కేసీఆర్ ఒక ఫైటర్. నరేంద్ర మోదీ లాంటి చీటర్‌తో ఆయన కలిసి పనిచేయరు..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు స్పష్టం చేశారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ భవనం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్, బీజేపీలను పాతర పెట్టాలి



- 'పీసీసీ అంటేనే పేమెంట్ కలెక్షన్ సెంటర్. బీజేపీని నమ్ముకుంటే అధోగతే. ఈ రెండు పార్టీలను పాతాళంలో పాతర పెట్టాలి. ఉచిత కరెంటు, మూడు పంటలు, ధాన్యపు రాశులు కావాలంటే కేసీఆర్ వెంటే నడవాలి..' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. - 10లో




పియరీ అగోస్తినీ ఫెరెంక్ క్రౌజ్ అన్నె ఎల్ హుయిలర్

ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్

- అణువులు, పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల డైనమిక్స్‌పై అధ్యయనానికి ప్రతిష్ఠాత్మక బహుమతి
- 'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' ప్రకటన


భౌతిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురు శాస్త్రవేత్తలకు ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి లభించింది. అమెరికాలోని ఒహాయో స్టేట్ యూనివర్సిటీకి చెందిన పియరీ అగోస్తినీ, జర్మనీలోని మాక్స్‌ప్లాంక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్వాంటమ్ ఆప్టిక్స్, లుడ్విగ్ మాక్సిమిలియన్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్‌కు చెందిన ఫెరెంక్ క్రౌజ్, స్వీడన్‌లోని లుండ్ యూనివర్సిటీకి చెందిన అన్నె ఎల్ హుయిలర్‌ను ఈ బహుమతి వరించింది.

ఎలక్ట్రాన్ల ప్రపంచానికి కొత్త 'కాంతి పుంజం' 6లో

సుప్రీంలోనూ దక్కని ఉపశమనం

స్కిల్ కేసులో చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా

- బాబు నేరం చేశారా? లేదా? అనే వాదనల జోలికెళ్లని ఆయన లాయర్లు
- గవర్నరు అనుమతి లేకుండా చంద్రబాబును అరెస్టు చేయకూడదని వ్యాఖ్యలు
- అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం అనుమతి తప్పనిసరి
- కాబట్టి ఈ అరెస్టు చెల్లదు.. కేసును క్వాష్ చేయండంటూ వాదనలు
- బాబు తరపున వాదించిన హరీశ్‌సాల్వే, సిద్ధార్థ లూత్రా, అభిషేక్ సింఘ్వీ
- ఎంతమంది సీనియర్లు బాబు తరపున వాదిస్తారని అడిగిన ధర్మాసనం
- తదుపరి విచారణ 9వ తేదీకి వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నకిలీ ఒప్పందాలు చేసుకుని... షెల్ కంపెనీల్లోకి ప్రభుత్వ ధనాన్ని పంపించారు. వాటిని విత్‌డ్రా చేసుకుని తన జేబులో వేసుకున్నారు. ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని అడుగుతూ ఆదాయ పన్ను విభాగం నోటీసులిచ్చింది. ఆ నోటీసులు ఇచ్చే అధికారం మీకు లేదంటూ జవాబిచ్చారు చంద్రబాబు. ఆ డబ్బుల్ని మనీ లాండరింగ్ చేసిన వారిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు కూడా చేసింది. ఇలా అన్ని వేళ్లూ ముఖ్యమంత్రి హోదాలో ఈ స్కామ్‌కు పాల్పడింది చంద్రబాబు నాయుడేనని చూపించాయి. పక్కా ఆధారాలతో సీఐడీ అరెస్టు చేసింది. ఆధారాలన్నీ చూపించటంతో కోర్టు జైలుకు పంపించింది. చంద్రబాబు కుటుంబీకులేమో... ఆయనకు బోలెడంత డబ్బుందని, ఈ నేరం చెయ్యాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. ఆయన నిజంగా నేరం చెయ్యకపోతే ఆయన లాయర్లు కోర్టులో అదే విషయాన్ని చెప్పొచ్చు కదా? అదే వాదన వినిపించొచ్చు కదా? కానీ ఈ దేశంలోనే అత్యంత ఖరీదైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకూ చంద్రబాబు విషయంలో వాదిస్తున్నదేంటో తెలుసా? ఆయనకు దీంతో సంబంధం లేదనో, ఆయన నేరం చెయ్యలేదనో కాదు. చంద్రబాబు నాయుడు మిగతా 3వ పేజీలో ▶

స్వేచ్ఛాయుత ఎన్నికలకు వీలేది?


సీఈసీ రాజీవ్‌కుమార్

- కేంద్ర ఎన్నికల సంఘం బృందంతో భేటీలో నిలదీసిన విపక్ష పార్టీలు
- 'మునుగోడు'లో రూ. వందల కోట్ల పంపిణీని అధికార యంత్రాంగం అడ్డుకోలేదని ఆరోపణ
- పోలీసు వాహనాలు, అంబులెన్సుల్లో డబ్బు రవాణా చేసినా చేష్టలుడిగి చూసిందని ఆక్షేపణ
- మద్యం షాపుల మూసివేతను పరిశీలించాలి: కాంగ్రెస్
- మతఛాందసవాదులను నియంత్రించాలన్న బీఆర్ఎస్

- వివరాలు 5లో

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ అంటే బీజేపీ రిష్తేదార్ సమితి

ఆ రెండు పార్టీలూ తెలంగాణను నాశనం చేశాయి: రాహుల్‌గాంధీ

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ అంటే బీజేపీ రిష్తేదార్ సమితి అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించా రు. నిజామాబాద్‌లో మంగళవారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ఈ విషయాన్ని అంగీకరించారని రాహుల్ స్పష్టం చేశారు. ప్రధాని వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ స్పందిస్తూ, బీజేపీ-బీఆర్‌ఎస్ భాగస్వామ్యం గత పదేళ్లలో తెలంగాణను నాశనం చేసిందని మండిపడ్డారు. ప్రజలు తెలివైన వారని..వారిద్దరూ కలిసి ఆడుతున్న ఆటను అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈసారి బీఆర్‌ఎస్, బీజేపీను ప్రజలు తిరస్కరిస్తారనీ, 6 హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని రాహుల్ ధీమా వ్యక్తం చేశారు.

మోదీ నోట.. చీకటి మిత్రుడి మాట

బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఫెవికాల్ బంధం: టీపీసీసీ చీఫ్ రేవంత్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య ఉన్నది ఫెవికాల్ బంధమన్న విషయం నిజామాబాద్ సాక్షిగా రుజువైందని, ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే స్పష్టం చేశారని, మోదీ నోట చీకటి మిత్రుడి మాటలు వినిపించాయని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. వారిద్దరూ చీకటి మిత్రులని, ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ చెబుతున్నదే నిజమని ఇప్పుడు మోదీ మాటల ద్వారా సుస్పష్టంగా తేలిందని వెల్లడించా రు. కేసీఆర్ ఎన్డీయే చేరాలనుకున్నది, మోదీ ఆశీస్సులతో కేటీఆర్‌ను సీఎంను చేయాలనుకున్నది, ఇప్పటికీ మోదీ-కేసీఆర్‌లు చీకటి మిత్రులేనన్నది నిజమని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ఆ రెండు పార్టీల చీకటి సంబంధాన్ని గుర్తించాలని కోరారు.

బిహార్ తరహాలో బీసీల కులగణన చేపట్టండి

బిహార్ తరహాలో వెంటనే తెలంగాణలో నూ బీసీల కులగణన చేపట్టాలని మంగళవారం సీఎం కేసీఆర్‌కు రాసిన బహి రంగలేఖలో రేవంత్‌రెడ్డి కోరారు. ప్రభుత్వాలు అరు దైన పక్షి, జంతుజాతుల లెక్కలు తీస్తున్నాయేకానీ, బీసీల జనగణన చేపట్టడంలేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబసర్వే వివరాలను బయట పెట్టాలని లేఖలో కోరారు.

రెండేళ్లుగా మేమూ అదే చెప్తున్నాం

ప్రధాని 'పొత్తు' వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాగూర్



సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీతో కేసీఆర్ పొత్తు పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలు రెండేళ్లుగా చెబుతూనే ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత మాణిక్యం ఠాగూర్ అన్నారు. హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ ఎన్నికల తర్వాత కేసీఆర్ తనను కలిసి ఎన్డీఏలో భాగస్వామ్యం అయ్యేందుకు ఆసక్తి చూపించారని నిజామాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం సాయంత్రం సోషల్ మీడియా వేదికగా మాణిక్యం ఠాగూర్ స్పందించారు. నిజామాబాద్ సభ ద్వారా రెండు అంశాలు నిరూపితమయ్యాయని.. మోదీతో పొత్తు కోసం కేసీఆర్ ప్రయత్నించడం మొదటిది కాగా.. కేటీఆర్‌ను సీఎం చేయాలని కేసీఆర్ అనుకోవడం రెండో అంశమని అని పేర్కొన్నా రు. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు బై బై కేసీఆర్ అనేందుకు సమయం ఆసన్నమైందని మాణిక్యం ఠాగూర్ తెలిపారు.

కేటీఆర్‌కు ఉలికిపాటు ఎందుకు: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ బండారాన్ని ప్రధాని మోదీ బయటపెడితే మంత్రి కేటీఆర్‌కి అంత ఉలికిపాటు ఎందుకని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీ కే అరుణ ప్రశ్నించారు. ప్రధానిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను అరుణ ఖండించారు. తన తండ్రి కేసీఆర్ ఫైటర్ అని చెప్పడానికి కేటీఆర్‌కు సిగ్గులేదా అని నిలదీశారు. కేసీఆర్ అంటే కల్వకుంట్ల చీటర్ రావు అని ఆరోపించారు. ప్రధానిపై నోటికి వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని, త్వరలో బీఆర్‌ఎస్‌ను తెలంగాణలో బొంద పెడతామని అరుణ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. 'దుబాయ్ పేరుతో దొంగ పాస్ పోర్టులు ఇచ్చి ఎంతో మంది అమాయక యువతను మోసం చేసిన ఘనుడు మీ తండ్రి అని'ఆమె మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు.

కేటీఆర్...మోదీని తిట్టాల్సిన అవసరం లేదు : విజయశాంతి

''ప్రధాని మోదీ చెప్పినట్టుగా ఎన్డీయేలో చేరతామని సీఎం కేసీఆర్ అడిగి ఉండొచ్చు. 2009లో కూడా తెలంగాణలో మహాకూటమి పేరిట కమ్యూనిస్టులతో కలిసి పోటీచేసిన కేసీఆర్...కౌంటింగ్ డబ్బాలు తెరవకముందే లుధియానా ఎన్డీఏ ర్యాలీకి హాజరైన వాస్తవం ప్రజలకు ఇంకా జ్ఞాపకముంది. కేటీఆర్ ...ఈ విషయంలో మోదీని తిట్టడం అనవసరం...అసమంజసం కూడా...'అని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యురాలు విజయశాంతి మంగళవారం రాత్రి ఎక్స్ (ట్విట్టర్)లో ట్వీట్ చేశారు.





ప్రజలకు అభివాదం చేస్తూ వేదిక వద్దకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ • 'ఇందూరు ప్రజాగర్జన'కు హాజరైన జనం

కేసీఆర్ వస్తే.. వద్దన్నాం!

▶ మొదటి పేజీ తరువాయి

'ఇందూరు ప్రజాగర్జన' బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. తెలంగాణ ప్రజలకు ఇంతకు ముందెప్పుడూ చెప్పని ఒక రహస్యం చెప్తున్నానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సభలో ప్రధాని మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఇదీ రహస్యమంటూ..

''గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ 48 సీట్లు గెలుస్తుందని వారు ఊహించలేదు. అప్పుడు కేసీఆర్‌కు మా సపోర్ట్ కావాల్సి వచ్చింది. ఆ సమయంలో నేను ఎయిర్‌పోర్ట్‌కు వస్తే పెద్ద పెద్ద కెమెరాలు పట్టుకుని, గజమాలలు తీసుకుని స్వాగతం పలికేందుకు వచ్చేవారు. అవన్నీ గుర్తున్నాయా? కానీ ఇప్పుడు కేసీఆర్ ఎందుకు రావడంలేదో తెలుసా?..

అవినీతిపై ప్రశ్నిస్తే.. దూరం జరిగారు

కేసీఆర్ నన్ను కలిసేందుకు ఢిల్లీకి వచ్చారు.. పెద్ద పెద్ద శాలువాలు తెచ్చారు.. అప్పుడు ఎంతో ప్రేమ చూపించారు. అది కేసీఆర్ క్యారెక్టర్ కాదని నేను అప్పుడే అనుకున్నా.. కేసీఆర్ ఎన్డీయేలో భాగస్వామి అవుతానని నాతో చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తమకు సహకరించాలని కోరారు. మోదీ మీతో జతకట్టబోడని స్పష్టంగా చెప్పాను. హైదరాబాద్‌లో విపక్షంలో కూర్చోవడానికి సిద్ధమే. కూర్చుంటాం.. కేసీఆర్ సర్కార్ మా కార్యకర్తలపై జులుం చేసినా సహిస్తాం. కానీ తెలంగాణ ప్రజలను దగా చేయనివ్వబోమని స్పష్టంగా చెప్పాను. కేసీఆర్ ఎన్డీయేలోకి రావడానికి కూడా నిరాకరించాను. ముఖ్యమంత్రికి మతి పోయింది. నేను బీఆర్‌ఎస్ అవినీతి గురించి ప్రశ్నించాను. అప్పటి నుంచి దూరంగా వెళ్లిపోవడం మొదలుపెట్టారు. రాష్ట్రంలో అవినీతికి పాల్పడటం, ప్రజలను పట్టించుకోకపోవడంతో బీఆర్‌ఎస్ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. అందుకే ఈసారి బీఆర్‌ఎస్ ఓటమి తథ్యం.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ హామీలను నమ్మొద్దు

ప్రజలు బీఆర్‌ఎస్ హామీలను నమ్మొద్దు.. మళ్లీ వచ్చే ఐదేళ్లు లూటీ చేసే అధికారం వారికి ఇవ్వొద్దు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటే. ఎన్నికల కోసం కాంగ్రెస్ హామీలు గుప్పిస్తోంది. ప్రజలు వాటిని నమ్మితే తర్వాత పశ్చాత్తాప పడాల్సిందే. నిరుదోగ భృతి ఇస్తామన్న బీఆర్‌ఎస్ దానిని పూర్తిగా విస్మరించింది. ఉద్యోగాలు ఇవ్వలేదు. ఎన్నికల తర్వాత హామీలు మరిచిపోవడం, తమ జేబు నింపుకోడం, కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడమే వారి పని. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వచ్చాక బీఆర్‌ఎస్ పాపాలను ఒక్కొక్కటిగా బయటికి తీస్తాం.

దక్షిణాదికి అన్యాయం చేసినదే కాంగ్రెస్

దక్షిణ భారతానికి అన్యాయం చేసిందేనదే కాంగ్రెస్ పార్టీ. అలాంటి వారిని దక్షిణాది అక్కున చేర్చుకుంటుందా? దక్షిణ భారతానికి ఏం చేశారో కాంగ్రెస్ నేతలు చెప్పాలి. తమిళనాడు, కేరళ, తెలంగాణలోని కాంగ్రెస్ మిత్రపక్ష పార్టీలు కూడా ఈ విషయంపై తమ వైఖరి స్పష్టం చేయాలి. తమిళనాడు ప్రభుత్వం ఆలయాలను కబ్జా చేసింది. కానీ మైనారిటీల పూజాస్థలాలపై మాత్రం చేయి పెట్టే సాహసం చేయలేదు.

అభ్యున్నతికి కృషి చేస్తాం.. ఆశీర్వదించండి

నిజామాబాద్‌లో మొత్తం రూ.8,021 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించా.. చాలా సంతోషంగా ఉంది. పసుపుబోర్డుతో నిజామాబాద్ రైతులతోపాటు దేశవ్యాప్తంగా రైతాంగానికి ప్రయోజనం చేకూరుతుంది. కమలం పువ్వు ప్రతి ఇంటికి, ప్రతి గుండెకు చేరుకుంటుంది. మీరు, మేం కలసి రాష్ట్ర అభ్యున్నతికి కృషి చేద్దాం. కరోనా వస్తే ప్రపంచానికి వ్యాక్సిన్ పంపిన దేశం మనది. మోదీ ఇచ్చే గ్యారంటీకి అది నిదర్శనం. రాష్ట్రంలో జరగబోయే మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించాలి..'' అని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్.. కాంగ్రెస్‌కు బీ టీమ్!

తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌తో చాలా జాగ్రత్తగా ఉండాలి. అది పెద్ద కిలాడీ పార్టీ. దేశం, దేశ ప్రజల గురించి వారికి పట్టింపులేదు. ఏదైనా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయిందంటే తిరిగి అధికారంలోకి రావడం చాలా కష్టం. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉంది. కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ బీ టీమ్‌గా మారింది. ఈ రెండు పార్టీల్లో బ్యాక్‌డోర్ ఎంట్రీలు జరుగుతున్నాయి. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ మద్దతునిచ్చింది. తెలంగాణ ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అందించింది.

కేంద్ర నిధులను బీఆర్‌ఎస్ లూటీ చేసింది

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఎన్నో నిధులు కేటాయించింది. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం లూటీ చేసింది. లూటీ చేయడమే బీఆర్‌ఎస్ నేతలకు తెలిసిన మంత్రం. బీఆర్‌ఎస్ వాళ్లు ప్రజాతంత్రాన్ని దోపిడీ తంత్రగా మార్చారు. ప్రజాస్వామ్యాన్ని కుటుంబస్వామ్యంగా మార్చారు. లక్షలాది కుటుంబాల ఆకాంక్షలను కేసీఆర్ కుటుంబం కబ్జా చేసింది. ఆ కుటుంబాన్ని ఎవరూ అడిగే పరిస్థితి లేదు. కొడుకు, బిడ్డ, అల్లుడు, మరో కొడుకు, అత్తింటి వారు.. ఇలా అంతా తెలంగాణను లూటీ చేస్తున్నారు. కొడుకు, అల్లుడు కలసి భారీ అవినీతికి పాల్పడుతున్నారు. తెలంగాణలో ఆ ఒక్క కుటుంబమే బాగుపడింది. ఆ ఒక్క కుటుంబానికి కొందరు సేవ చేస్తున్నారు. అలాంటి వారికి పదవులు ఇస్తున్నారు. తెలంగాణ కోసం పోరాడినవారిని, నిరుద్యోగులను మాత్రం పట్టించుకోవడం లేదు. కుటుంబ పాలనతో యువత తీవ్రంగా నష్టపోతోంది. అదే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్యులకు కూడా అన్నింట్లో అవకాశాలు కల్పిస్తోంది. లక్షల మందికి వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ అపాయింట్‌మెంట్ లెటర్లు సైతం అందజేశాం. నీతిఆయోగ్ తాజా నివేదిక చూస్తే.. దేశంలో 13.5 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటకు వచ్చారు. ఇలాంటి విషయంలో మమ్మల్ని ఎవరూ ఆపలేరు. ఇది మోదీ సంకల్పం. ఇతర రాజకీయ పార్టీలు కూడా పేదల అభ్యున్నతికి కృషి చేయాలని కోరుతున్నాను.

పని పూర్తి చేసే సంస్కృతి మాది

- రూ.8 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో మోదీ
- రామగుండం ఎన్టీపీసీలో 800 మెగావాట్ల తొలి యూనిట్ జాతికి అంకితం
- త్వరలోనే రెండో యూనిట్ ప్రారంభిస్తామన్న ప్రధాని
- ఒక కొత్త రైల్వే లైన్, మరోలైన్ విద్యుదీకరణ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మోదీ. చిత్రంలో గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శంకుస్థాపన చేస్తే ఆ పనిని కచ్చితంగా పూర్తి చేయాలనే సంస్కృతిని తమ ప్రభుత్వం పాటిస్తోందని ప్రధాని మోదీ చెప్పారు. మంగళవారం నిజామాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని రూ.8 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే విద్యుత్ కీలకమని.. ఉత్పత్తి, సరఫరా నిరంతరాయంగా ఉంటే పరిశ్రమల వృద్ధికి ఆలంబన అవుతుందని చెప్పారు. రామగుండం ఎన్టీపీసీలో 800 మెగావాట్ల యూనిట్‌ను ప్రస్తుతం ప్రారంభించుకున్నామని, త్వరలో రెండో యూనిట్ సైతం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కేంద్రంలో ఉత్పత్తయ్యే విద్యుత్‌లో అధిక భాగం తెలంగాణ ప్రజలకు దక్కుతుందన్నారు. ధర్మాబాద్- మనోహరాబాద్- మహబూబ్‌నగర్- కర్నూల్ మధ్య రైల్వే విద్యుదీకరణతో రైళ్ల సరాసరి వేగం, రాష్ట్రంలో కనెక్టివిటీ మరింత పెరుగుతాయని చెప్పారు. మనోహరాబాద్- సిద్దిపేట మధ్య కొత్త రైల్వేలైన్‌తో పరిశ్రమలు, వ్యాపారానికి తోడ్పాటు అందుతుందన్నారు. ఇక ప్రతి జిల్లాలో వైద్య సదుపాయాల నాణ్యత కోసం పీఎం ఆయుష్మాన్ భారత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ తీసుకొచ్చామని.. తెలంగాణలోని 20 జిల్లాల్లో క్రిటికల్ కేర్ బ్లాకులు ఏర్పాటు చేస్తున్నామని ప్రధాని వివరించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో తెలంగాణలో 50 పెద్ద ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని, ప్రజల ప్రాణాలను కాపాడటంలో అవి కీలక పాత్ర పోషించాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు బండి సంజయ్, కె.లక్ష్మణ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి పసుపు రైతుల సన్మానం

పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటన నేపథ్యంలో పసుపు రైతులు నిజామాబాద్ సభా వేదికపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానం చేశారు. పసుపు కొమ్ములతో తయారు చేసిన ప్రత్యేక దండ వేసి, పసుపు మొక్కలను అందించారు. మోదీ ఆ మొక్కలను పైకెత్తి ప్రదర్శించారు.

తెలుగులో ప్రారంభించి..

ప్రధాని మోదీ నిజామాబాద్ సభలో తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పలుమార్లు 'నా కుటుంబ సభ్యులారా..'అని ప్రస్తావిస్తూ మాట్లాడారు. ఆయన ప్రసంగిస్తున్నంత సేపు మోదీ.. మోదీ.. అంటూ బీజేపీ కార్యకర్తలు, అభిమానులు నినాదాలు చేస్తూ కనిపించారు. ఓ చిన్నారి భరతమాత వేషధారణలో వచ్చిన విషయాన్ని చూసి.. ''ఓ చిన్ని తల్లి రూపంలో భారతమాత ఇక్కడికి వచ్చింది. ఆ చిన్నారికి నా తరపున అభినందనలు..''అని పేర్కొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ఇవీ..

ప్రధాని మోదీ నిజామాబాద్‌లోని సభా స్థలిలో విడిగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి రూ.8 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన మరో వేదికపై సభను ఉద్దేశిస్తూ రాజకీయ ప్రసంగం చేశారు. తొలి వేదికపై ప్రధాని అభివృద్ధి కార్యక్రమాలివీ..

- రామగుండం ఎన్టీపీసీ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్ జాతికి అంకితం.
- ఆయుష్మాన్ భారత్ కింద రాష్ట్రంలోని 20 జిల్లా ఆస్పత్రుల్లో క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు శంకుస్థాపన.
- మనోహరాబాద్ - సిద్దిపేట మధ్య కొత్త రైల్వే లైన్ ప్రారంభం.. సిద్దిపేట-సికింద్రాబాద్ రైలు సర్వీస్‌కు పచ్చజెండా..
- ధర్మాబాద్ - మనోహరాబాద్ - మహబూబ్ నగర్ - కర్నూల్ మధ్య రైల్వే విద్యుదీకరణ పనుల ప్రారంభం



సభా వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో బూర నర్సయ్య గౌడ్, ఈటల, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కె.లక్ష్మణ్, రవీంద్ర నాయక్, సోయం బాపూరావు, మురళీధర్‌రావు, యెండల లక్ష్మీనారాయణ, ప్రేమేందర్‌రెడ్డి తదితరులు

కేసీఆర్ ఫైటర్.. చీటర్‌తో కలవరు

▶ మొదటి పేజీ తరువాయి

కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్ సభలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

ప్రధానితో సమావేశాలకు కెమెరా పట్టుకెళ్లాలేమో!

'మేము ఢిల్లీకి, గుజరాత్‌కు బానిసలం కాదు. రెండు సార్లు ప్రజాస్వామికంగా గెలిచిన మాపై గుండెలు చించుకుని మాట్లాడినంత మాత్రాన అబద్ధాలు నిజాలైపోవు. ప్రధాని చెప్పిన అబద్ధాలు విన్న తర్వాత ఇప్పటినుంచి ఆయనతో సమావేశానికి కెమెరా పట్టుకు వెళ్లాలేమో అని అనిపిస్తోంది. ఆయన మాటలను రికార్డు చేసుకుంటే మంచిది. ప్రధాని మోదీ జుమ్లాలకు ప్రసిద్ధి. అబద్ధాల ప్రచారకర్త. తనకు అలవాటైన అబద్ధాలతో రాజకీయాలు చేస్తున్నారు. తన విద్యార్హతల విషయంలోనే అబద్ధం చెప్పిన మోదీ మాటలను ఎవరు నమ్ముతారు? ఈ వయసులో కూడా మోదీ పచ్చి అబద్ధాలు మాట్లాడటం సమంజసంగా లేదు. ఇది ఎంతో బాధాకరం ..శోచనీయం..' అని కేటీఆర్ పేర్కొన్నారు.

రాజులు, యువరాజులు అప్పుడెందుకు గుర్తుకు రాలేదు?

'కుటుంబ రాజకీయాల గురించి మాట్లాడుతున్న ప్రధాని బీజేపీ నేతలు జ్యోతిరాదిత్య సింధియా, జైషా, అనురాగ్ ఠాకూర్ ఎవరో చెప్పాలి. సుజనా చౌదరి, సీఎం రమేష్ వంటి వాళ్లపై కేసులు ఏమయ్యాయో చెప్పాలి. మోదీ ఏ రాష్ట్రానికి వెళ్లినా అక్కడి ముఖ్యమంత్రుల గురించి అబద్ధాలు ఆడటం అలవాటుగా మారింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ, ఒడిశాలో నవీన్ పట్నాయక్, మేఘాలయలో సంగ్మాపై అబద్ధాలు ఆడి, ఆ తర్వాత వారితోనే పొత్తులు పెట్టుకుంటారు. రాజులు, రాజ్యాలు మోదీకి ఇప్పుడే గుర్తుకు వస్తాయి. ప్రకాశ్‌సింగ్ బాదల్, ముఫ్తీ మహ్మద్ సయీద్, చంద్రబాబు, ఉద్ధవ్ ఠాక్రే, దేవెగౌడ, కుమారస్వామితో పొత్తు పెట్టుకున్నప్పుడు మాత్రం రాజులు, యువరాజులు గుర్తుకు రారు. చంద్రబాబు ఎన్డీయేలో ఉన్నప్పుడు లోకేశ్ మంత్రిగా ఉంటే అప్పుడు రాజులు, యువరాజులు ఎందుకు గుర్తుకురాలేదు? దేవెగౌడ కొడుకు కుమారస్వామి నిన్న మొన్ననే ఎన్డీయేలో చేరారు. అప్పుడు కుటుంబ రాజకీయాలు గుర్తుకు రాలేదా? ఆయన పార్టీలో ఉంటే ఇవేవీ గుర్తుకు రావు. వారితో పొత్తు పెట్టుకుంటే మంచివాళ్లు. వారి పార్టీలో లేకపోతేనే అన్నీ గుర్తుకు వస్తాయి. కర్ణాటక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ డబ్బులు పంపిణీ చేసిందంటూ అబద్ధాలు చెబుతున్నారు. మేం డబ్బులు పంచుతుంటే మీ ఐటీ ఏం చేస్తోంది? తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టు కోరు. తలెత్తుకొని తిరుగుతారు. మీ బెదిరింపులకు భయపడరు..' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఏం చేశారని ఓట్లడుగుతున్నారు?

'ఈ తొమ్మిదేళ్ళలో తెలంగాణకు ఏమిచ్చారని ఓట్లు అడుగుతున్నారు? ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్ట్ కూడా కేటాయించలేదు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి జరుగుతోందని ప్రధాని అంటున్నారు. ఇది కూడా పచ్చి అబద్ధం. ఈసారి బీజేపీకి ఒక్క ఎంపీ సీటు కూడా రాదు. కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా ఎన్నుకునేందుకు రెడీగా ఉన్న తెలంగాణ ప్రజలు మోదీ అబద్ధాలను పట్టించుకోరు. తెలంగాణలో బీఆర్‌ఎస్ కేసీఆర్ నాయకత్వంలో మరోసారి హ్యాట్రిక్ కొట్టబోతోంది. ఈసారి 110 సీట్లు ఖాయం. 2018 ఎన్నికల్లో బీజేపీ 105 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయింది. ఈసారి 110 స్థానాల్లో డిపాజిట్లు దక్కవు' అని కేటీఆర్ అన్నారు.

ప్రధానినే నీచంగా మాట్లాడతారా?

హద్దు మీరితే ప్రజలే తరిమికొడతారు: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

జగిత్యాల టౌన్: 'మిస్టర్ అజయ్‌రావు.. ప్రధాని మోదీ ఉన్న మాటంటే నీకంత ఉలుకెందుకు.. ప్రధాని స్థాయిని మరిచి నీచంగా మాట్లాడే మిమ్మల్ని ప్రజలే తరిమికొట్టే రోజు దగ్గరలోనే ఉంది..' అని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్.. మంత్రి కేటీఆర్‌పై ఫైర్ అయ్యారు. 'మంత్రి పదవి కోసం ఏకంగా నీ పేరునే మార్చిన నీచ చరిత్ర మీ తండ్రిది కాదా..' అని ప్రశ్నించారు. మంగళవారం రాత్రి జగిత్యాలలో సంజయ్ మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ రూ.20 వేల కోట్లతో తెలంగాణలో అభివృద్ధి పనులు చేస్తుంటే మైండ్‌బ్లాక్ అయిన కేటీఆర్ పిచ్చి కుక్కలాగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ఇప్పుడే ఎందుకు బయటపెట్టారన్న మీడియా ప్రశ్నకు 'శిశుపాలుడిలా నూరు తప్పులు జరిగే వరకూ వేచి చూశారు..' అని సంజయ్ బదులిచ్చారు. కేసీఆర్ కుటుంబ అవినీతిపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు 'ఆ కుటుంబ అవినీతిపై యుద్ధం మొదలైంది..' అని వ్యాఖ్యానించారు.

రేషన్‌లో 'సన్నబియ్యం'

మేనిఫెస్టోలో పెట్టాలని కాంగ్రెస్ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సమావేశమైంది. కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చౌకధరల దుకాణాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రేషన్ డీలర్లు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్న విధంగా కమీషన్‌ను పెంచడంతో పాటు పేదలకు రేషన్‌లో భాగంగా పలు రకాల నిత్యావసరాల వస్తువులు పంపిణీ చేస్తామన్న హామీని మేనిఫెస్టోలో పెట్టాలని ఈ సమా వేశంలో నిర్ణయించారు.

కిషన్‌రెడ్డి, నారాయణస్వామిని బర్తరఫ్ చేయాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

సాక్షి, హైదరాబాద్: ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, నారాయణ స్వామిలను కేంద్ర కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా ప్రకటన చేసినప్పటికీ ఓట్ల కోసం ఎస్సీల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రులుగా కాకుండా ఎమ్మార్పీఎస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న కిషన్‌రెడ్డి.. వర్గీకరణ కోసం ఒత్తిడి తెస్తున్నానంటూ మాయమాటలు చెబుతున్నారని మంగళవారం ఒక ప్రకటనలో చెన్నయ్య మండిపడ్డారు.

కేసీఆర్ సర్కార్ పాలనకు చరమగీతం పాడాలి

- తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేయాలి
- ఇందూరు సభలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- సంజయ్, ఈటల, గుజ్జుల భుజం తట్టిన మోదీ

నిజామాబాద్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించాలని, సీఎం కేసీఆర్ సర్కార్ పాలనకు చరమగీతం పాడాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నిజామాబాద్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అవినీతి, కుటుంబ పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పే అవకాశం ప్రజలకు లభిస్తోందని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేసేలా ప్రజలు ముందుకు రావాలని కోరారు. కల్వకుంట్ల కుటుంబానికి ముందుంది ముసళ్ల పండుగ అని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. అసలైన కథ ఇప్పుడే మొదలైందన్నారు. కేసీఆర్‌ను మించిన అబద్ధాలకోరు రాష్ట్రంలో మరొకరు లేరని బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ విమర్శించారు. పసుపు బోర్డు ఇస్తే అభ్యర్థిని పెట్టబోనని చెప్పిన బీఆర్‌ఎస్ ఏం ముఖం పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేస్తుందో చెప్పాలన్నారు. పసుపు రైతుల దశాబ్దాల కల ప్రధాని మోదీ నెరవేర్చారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. కేసీఆర్ కుటుంబ రాజకీయాలను సమాధి చేయాలని బీజేపీ మధ్య ప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు పిలుపునిచ్చారు. పసుపు బోర్డు వచ్చినందుకు రైతులందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, పార్టీ నేతలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, ఎం.రవీంద్రనాయక్, జి.విజయ రామారావు, రమేశ్ రాథోడ్, గరికపాటి మోహన్‌రావు, బూర నర్సయ్యగౌడ్, డి.ప్రదీప్‌రావు తదితరులు పాల్గొన్నారు. అరుణతార వందన సమర్పణ చేశారు. సభ ముగిశాక వేదికపైనే బండి సంజయ్, ఈటల రాజేందర్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ప్రధాని భుజం తట్టి అభినందించారు. కొన్నేళ్లుగా చెప్పులు కూడా ధరించకుండా పోరాడుతున్న పసుపు బోర్డు ఉద్యమ నాయకుడు మనోహర్‌రెడ్డి గురించి సంజయ్‌ని అడిగి తెలుసుకున్నారు.

బీజేపీలో జోష్

మోదీ బహిరంగసభ విజయవంతం కావడంతో కాషాయదళంలో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. అంచనాలకు మించి భారీగా ప్రజలు, పార్టీ కార్యకర్తలు హాజరుకావడం, ప్రధాని ప్రసంగానికి జనాల్లో బాగా స్పందన కనిపించడంపై పార్టీ నేతలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్, అవినీతి అంశాలను మోదీ ప్రస్తావించినప్పుడల్లా కేకలు, ఈలలు, చప్పట్లతో సభికులు మద్దతు ప్రకటించారు. తెలుగులో నా కుటుంబ సభ్యులారా.. అని అనగానే హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రసంగం మధ్యలో మోదీ మోదీ అంటూ నినాదాలు చేశారు.

హరీశ్, ప్రభాకర్‌రెడ్డిపై ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు

బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాక టౌన్/గజ్వేల్: సిద్దిపేటలో రైలు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీని అవమానించేలా వ్యవహరించిన మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తామని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందనరావు హెచ్చరించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక, గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సిద్దిపేటలో వర్చువల్‌గా ప్రధాని రైలు ప్రారంభించిన సందర్భంలో రైల్వే అధికారులు ప్రధాని కనిపించేలా మానిటర్ డిస్‌ప్లే ఏర్పాటు చేస్తే.. దానిని హరీశ్‌రావు కాలితో తన్నారని ఆరోపించారు. సదరు వీడియోలు తమవద్ద ఉన్నాయన్నారు. మెదక్ ఎంపీ సైతం ప్రధాని ఫ్లెక్సీని చించివేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు సూచించారని ఆరోపించారు. దీనిపై సిద్దిపేట పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ వద్ద ఉన్న వీడియో క్లిప్పింగ్ ఆధారాలతో పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా, గజ్వేల్‌కు రైలు వచ్చిన నేపథ్యంలో రైల్వేస్టేషన్‌లో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నది.

టీడీపీ దుశ్శాసన పార్టీ

- రాజకీయంగా ఎదుర్కోలేకే నాపై దిగజారుడు ఆరోపణలు
- బండారును వదిలిపెట్టను.. న్యాయపోరాటం చేస్తా
- మీడియా సమావేశంలో మంత్రి రోజా కన్నీరు



తిరుపతి రూరల్ : అసత్య ఆరోపణలు, విమర్శలతో మహిళల వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్న టీడీపీ దుశ్శాసన పార్టీ అని ఏపీ యువజన, క్రీడలు, పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేకే తనపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మహిళా లోకాన్నే అవమానించేలా మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి చేసిన వ్యక్తిగత విమర్శలపై ఆమె మండిపడ్డారు. తిరుపతిలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. తాను టీడీపీ నుంచి బయటికి వచ్చినప్పటి నుంచి వేధిస్తున్నారంటూ భావోద్వేగానికి గురయ్యారు. 'బ్లూ ఫిలిమ్స్‌లో నటించింది అంటూ నన్ను టార్చర్ చేస్తున్నారు.. అసెంబ్లీలో సీడీలనూ చూపించారు. కానీ ఎప్పుడూ నిరూపించలేదు. మహిళలు నచ్చినట్లు బతకమని సుప్రీంకోర్టే చెప్పింది. మీరెవరు నా క్యారెక్టర్‌ను జడ్జ్ చేయడానికి? మహిళల్ని టీడీపీ ఆట వస్తువుల్లా చూస్తోంది. దమ్ముంటే సీడీలను ప్రజల్లోకి విడుదల చేయాలి. నాపై బండారు వ్యాఖ్యలను టీడీపీ నేతలు సమర్థించడం సరికాదు. లోకేశ్‌తో పాటు ఇతర టీడీపీ నేతలు సత్యనారాయణ అరెస్టును ఖండించారు. వారి తల్లులు, భార్యలు, కూతుళ్లకు కూడా ఇదే పరిస్థితి ఎదురైతే ఇలాగే చేస్తారా? మహిళపై అభ్యంతరకర ఆరోపణలు చేస్తే బండారు కుటుంబం, టీడీపీ ఖండించకుండా ఆయనకు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు. ఇలాంటి దిగజారుడు విమర్శలతో తన గొంతు నొక్కాలని ప్రయత్నిస్తే ఊరుకోను. బండారును వదిలి పెట్టేది లేదు. అతనిపై పరువునష్టం దావావేసి న్యాయపోరాటం చేస్తా' అని చెప్పారు.

జైల్లో చంద్రబాబు చాలా బాగున్నారు

ఏపీ మాజీ హోం మంత్రి చినరాజప్ప

సాక్షి, రాజమహేంద్రవరం: సెంట్రల్ జైల్లో చంద్రబాబు చాలా బాగున్నారని, ఆయన ఆరోగ్యం కూడా బాగుందని ఏపీ మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. చంద్రబాబు జైల్లో ఉన్నా ఆయన మనసంతా ప్రజాసేవపైనే ఉందని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబును ఆయన సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణితోపాటు మాజీ హోం మంత్రి చినరాజప్ప ములాఖత్ ద్వారా మంగళవారం కలిశారు. వారు 40 నిమిషాలపాటు బాబుతో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యవహారాలపై చర్చించినట్లు తెలిసింది.

'ఓటుకు కోట్లు'లో రేవంత్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు కోట్లు కేసులో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటుకు కోట్లు కేసు ఏసీబీ పరిధిలోకి రాదని, ఈ వ్యవహారంలో ఐదుగురు సాక్షుల్ని ఒకేసారి క్రాస్ ఎగ్జామిన్ చేయాలని రేవంత్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ అంశంలో హైకోర్టు నిర్ణయం తీసుకోవాలని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఈ పిటిషన్ విచారణ అనవసరమని ధర్మాసనం పేర్కొంది. కేసు ముగిస్తున్నట్లు పేర్కొంది. అయితే ఈ కేసు నుంచి తనను తప్పించాలంటూ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను డిసెంబర్ 4తో ప్రారంభమయ్యే వారంలో విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది.

6న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం


సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఉభయ రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ ఈ నెల 6న జలసౌధలో సమావేశం కానుంది. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేసింది. తాగు, సాగునీటి అవసరాలకు 38.73 టీఎంసీలు కావాలని తెలంగాణ ఇండెంట్ సమర్పించగా, ఏపీ 30.09 టీఎంసీలు కావాలని కోరింది. వాస్తవానికి ఆగస్టు 21న త్రిసభ్య కమిటీ సమావేశం జరగగా, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ గైర్హాజరయ్యారు. సమావేశంలో ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డితో చర్చించిన తర్వాత ఏపీకి 25.29 టీఎంసీలు, తెలంగాణకు 6 టీఎంసీల కేటాయింపులను ప్రతిపాదిస్తూ కృష్ణా బోర్డు ముసాయిదా మినిట్స్‌ను తయారు చేసి రెండు రాష్ట్రాలకు పంపింది. దీనిపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అసలు త్రిసభ్య కమిటీ సమావేశం జరిగినట్టు తాము పరిగణనలోకి తీసుకోవడం లేదని, ఆ కేటాయింపులు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 6న మరోసారి సమావేశం నిర్వహించాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది.

మరిన్ని ఏపీ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

10న సీఐడీ ముందుకు లోకేశ్

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో హైకోర్టు ఆదేశాలు

- ఇదే కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు
- మరో నిందితుడు నారాయణ పిటిషన్‌పై నేడు విచారణకు అవకాశం



సాక్షి, అమరావతి : రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో ఈనెల 10వ తేదీన సీఐడీ అధికారుల ఎదుట విచారణకు స్వయంగా హాజరు కావాలని మాజీ మంత్రి నారా లోకేశ్‌ను హైకోర్టు ఆదేశించింది. సీఆర్‌పీసీ సెక్షన్ 41 ఏ కింద నోటీసులకు అనుగుణంగా విచారణకు హాజరు కావాలని లోకేశ్‌కు స్పష్టం చేసింది. ఇదే కేసులో బెయిల్ కోరుతూ మాజీ సీఎం చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద సీఐడీ తనకు జారీ చేసిన నోటీసును రద్దు చేయాలని, లేదంటే ఇంటివద్దే తనను విచారించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారణ జరిపే అవకాశం ఉంది.

కనిపించేంత దూరంలో న్యాయవాది

ఇన్నర్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో నారా లోకేశ్‌ను ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించవచ్చని, మధ్యాహ్నం గంట పాటు భోజన విరామం ఇవ్వాలని హైకోర్టు సూచించింది. విచారణ సమయంలో లోకేష్ కనిపించేంత దూరం వరకు మాత్రమే న్యాయవాదిని అనుమతించాలని నిర్దేశించింది. విచారణకు వచ్చేటప్పుడు నిర్దిష్ట డాక్యుమెంట్లు తీసుకురావాలని లోకేశ్‌ను ఒత్తిడి చేయబోమని సీఐడీ చెప్పిన విషయాన్ని హైకోర్టు పరిగణలోకి తీసుకుంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాలు, దీన్ని అడ్డం పెట్టుకుని సాగించిన భూ దోపిడీ కేసులో నారా లోకేశ్‌ను 14 నిందితుడిగా సీఐడీ చేర్చింది. ఈ కేసు విచారణ నిమిత్తం ఈ నెల 4న తమ ముందు హాజరు కావాలంటూ ఇటీవల సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేసింది. విచారణకు వచ్చే సమయంలో హెరిటేజ్ భూముల కొనుగోలుకు సంబంధించిన డాక్యుమెంట్లను తేవాలని పేర్కొంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లోకేశ్ మంగళవారం అత్యవసరంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లోకేశ్ తరఫున టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ హెరిటేజ్‌లో లోకేష్ ఓ వాటాదారు మాత్రమేనన్నారు. హెరిటేజ్‌కు సంబంధించిన కీలక విషయాలు ఆయనకు తెలిసే అవకాశం లేదన్నారు. ఆ డాక్యుమెంట్లను ఇవ్వలేదన్న కారణంతో లోకేష్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందన్నారు. విచారణ సమయంలో న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సీఐడీ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.దుష్యంత్‌రెడ్డి, స్పెషల్ పీపీ శివ కల్పనారెడ్డి వాదనలు వినిపిస్తూ నిర్దిష్టంగా ఫలానా డాక్యుమెంట్లు తేవాలని ఒత్తిడి చేయబోమన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఇతర నిందితులతో కలిపి లోకేశ్‌ను కూడా విచారించాల్సి ఉందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ నెల 10న సీఐడీ ముందు హాజరు కావాలని లోకేశ్‌ను ఆదేశిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రింగ్ రోడ్డు కేసులో బాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, తదనుగుణంగా సాగిన భూ దోపిడీపై సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ సీఎం చంద్రబాబు దాఖలు చేసిన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన వివరాలన్నీ ఆయా ఫైళ్లలో భద్రంగా ఉన్నాయన్నారు. అందువల్ల సాక్ష్యాలను తారుమారు చేస్తారన్న ప్రశ్నే తలెత్తదన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణమే జరగనప్పుడు అవకతవకలకు ఆస్కారం ఎక్కడ ఉందన్నారు. సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ చంద్రబాబు మరో కేసులో అరెస్టై జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు కాబట్టి ఈ కేసులో కూడా ఆయన అరెస్టయినట్లు (డీమ్డ్) భావించాలన్న పిటిషనర్ తరఫు న్యాయవాదుల వాదన సరికాదన్నారు. బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసే ముందు సరెండ్ పిటిషన్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆ పని చేయకుండా డీమ్డ్ అరెస్ట్ పేరుతో నేరుగా బెయిల్ పిటిషన్ దాఖలు చేయడం సరికాదన్నారు. ఈ వ్యాజ్యానికి అసలు విచారణార్హతే లేదన్నారు. చంద్రబాబు పిటిషన్‌ను కొట్టి వేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

41 ఏ నోటీసును రద్దు చేయండి

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద సీఐడీ తనకు జారీ చేసిన నోటీసును రద్దు చేయాలని కోరుతూ ఈ కేసులో నిందితుడైన మాజీ మంత్రి పొంగూరు నారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ తన వాంగ్మూలాలను నమోదు చేయడం తప్పనిసరి అని దర్యాప్తు అధికారి భావిస్తే తన ఇంటి వద్దనే విచారించేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. విచారణ సమయంలో న్యాయవాదిని సైతం అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తాను వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నానని, పలు మేజర్ సర్జరీలు కూడా జరిగాయని పిటిషన్‌లో నారాయణ పేర్కొన్నారు. డాక్టర్లు తనను ఇంటి వద్దే ఉండాలని సలహా ఇచ్చారన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు బుధవారం విచారణ జరిపే అవకాశం ఉంది.

సుప్రీంలోనూ దక్కని ఉపశమనం

▶ మొదటి పేజీ తరువాయి

మాజీ ముఖ్యమంత్రి కనక ఆయన్ను అరెస్టు చేసే ముందు గవర్నరు అనుమతి తీసుకోవటం తప్పనిసరి అని... అలా తీసుకోలేదు కనక ఈ అరెస్టుతో పాటు ఆయనపై పెట్టిన కేసు కూడా చెల్లదని... కాబట్టి మొత్తం కేసునే కొట్టేయాలని వాదిస్తున్నారు.

మంగళవారం సుప్రీంకోర్టులో సైతం... చంద్రబాబు నేరం చేశారా? లేదా? అనే జోలికి తాము వెళ్లబోవటం లేదని, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ ప్రకారం ఆయన అరెస్టు చెల్లదనే తమ వాదన వినిపిస్తున్నామని స్పష్టంచేశారు. విచిత్రమేంటంటే చంద్రబాబు నాయుడి తరఫున కాకలు తీరిన లాయర్లు సిద్ధార్థ లూథ్రా, అభిషేక్ మను సింఘ్వీ, హరీష్ సాల్వే ముగ్గురూ వాదనలు వినిపించారు. ముగ్గురూ కూడా సెక్షన్ 17ఎ కింద గవర్నర్ అనుమతి తీసుకోలేదు కనక కేసు చెల్లదని, క్వాష్ చేయాలని మాత్రమే వాదించారు. దాదాపు 50 నిమిషాలసేపు జరిగిన విచారణలో... 90% సమయం ఈ చట్టం చంద్రబాబుకు వర్తిస్తుందా? లేదా? అన్న దానిపైనే సాగటం గమనార్హం. అయితే అవినీతి నిరోధక చట్టంలో సెక్షన్ 17ఎ ను 2018లో సవరించడానికన్నా ముందు ఈ నేరం జరిగింది కనక ఆ సవరణ దీనికి ఎలా వర్తిస్తుందని కూడా సుప్రీం ప్రశ్నించింది. చివరకు దీనికి సంబంధించిన పత్రాలన్నీ సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ కేసును వచ్చే సోమవారానికి వాయిదా వేయటంతో... బాబుకు ఆశించిన ఉపశమనమైతే దొరకలేదు.

బాబు తరఫున ఎందరు వాదిస్తారు?

స్కిల్ కుంభకోణానికి సంబంధించి తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన క్రిమినల్ ఎస్సెల్పీని మంగళవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదీతో కూడిన ధర్మాసనం విచారించింది. చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు ప్రారంభిస్తూ... పీసీ యాక్టులోని సెక్షన్ 17ఎ ను హైకోర్టు తప్పుగా అర్థం చేసుకుందన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రతినిధులు అధికార విధులు నిర్వర్తించడంలో చేసే చర్యలకు సంబంధించినదిగా చూడాలన్నారు. "2018 జూలై కన్నా ముందు జరిగిన నేరాలకు ఈ సెక్షన్ వర్తించదని హైకోర్టు న్యాయమూర్తి చెప్పడం సరికాదు. ఎందుకంటే ఈ సెక్షన్ నేరం ఎప్పుడు జరిగిందనే అంశానికి సంబంధించినది కాదు. ఓ ప్రక్రియకు సంబంధించినది, విచారణ తేదీకి సంబంధించినది" అని వాదన వినిపించారు. అందుకోసమే తమ క్లయింట్‌కు ఈ రక్షణ కావాలని కోర్టును కోరుతున్నామని సాల్వే చెప్పారు. కేసు విచారణ 2021, సెప్టెంబరు 7న ప్రారంభమైనట్లుగా అడిషనల్ డీజీపీ రాసిన లేఖ చెబుతోందన్నారు. కాబట్టి ఈ కేసులో సెక్షన్ 17ఎ ప్రకారం గవర్నర్ అనుమతి ఆమోదం లేకుండా విచారణ చేయొచ్చా? అని సందేహం వ్యక్తంచేశారు. ఈ దశలో జస్టిస్ అనిరుద్ధ బోస్ జోక్యం చేసుకొని 'అంటే విచారణ ప్రారంభ తేదీని పరిగణించాలన్నది మీ ఉద్దేశమా?' అని సాల్వేను ప్రశ్నించారు. చట్టం తెచ్చిన వాళ్లు చెప్పిందదేనని సాల్వే బదులిచ్చారు. "బాబును అరెస్టు చేసిన విధానం సరికాదని హైకోర్టుకు కూడా తెలిపాం. కానీ మా వాదన అంగీకరించలేదు. గవర్నర్ అనుమతి లేకుండా అరెస్టు చేయడం సరికాదు. మంత్రి మండలి అనుమతితోనే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఆనాడు చంద్రబాబు సూచనలతోనే ఎక్స్ అఫీషియో నియామకాలు జరిగాయని అభియోగాలు మోపారు" అని సాల్వే పేర్కొన్నారు.

చంద్రబాబు తరఫు మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. యశ్వంత్ సిన్హా వర్సెస్ సీబీఐ కేసు ప్రస్తావించారు. సెక్షన్ 17ఎ ప్రకారం దర్యాప్తునకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని జస్టిస్ కేఎం జోసెఫ్ తీర్పులో ఉందన్నారు. దీన్ని బట్టి చూస్తే 2018 చట్టసవరణ కన్నా ముందువాటికి కూడా సెక్షన్ 17ఎ వర్తిస్తుందన్నారు. ఇంతలో చంద్రబాబు తరఫున మరో న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా లేచి... యశ్వంత్ సిన్హా కేసును ఉటంకిస్తూ 'రఫేల్ డీల్ 2015–16 నాటిది. ఇది 2018 నాటి చట్టసవరణ కన్నా ముందుదే" అని చెప్పారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ... చంద్రబాబు తరఫున ఎంత మంది సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తారని చమత్కరించింది. నలుగురం వాదిస్తున్నామని, సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తున్నారని హరీశ్ సాల్వే చెప్పారు. ఈ దశలో ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుంటూ... వాళ్లే ఒకరి తర్వాత ఒకరు వాదనలు వినిపిస్తున్నారని తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, పిటిషనర్ తరఫున ఎవరో ఒకరే వాదనలు చేయాలని పేర్కొన్నారు. అయితే కింది కోర్టుల్లో ఒక సీనియర్ మించి వాదించే అవకాశం లేదు కానీ సుప్రీంకోర్టు ఆ ప్రత్యేక హక్కు కల్పించిందని జస్టిస్ బేలా ఎం త్రివేది పేర్కొన్నారు.

కేసు మెరిట్స్ జోలికి వెళ్లం: సుప్రీం

రిమాండ్ రిపోర్టు ప్రకారం లావాదేవీలు 2015–19 నాటివని, అంటే 2018 చట్ట సవరణ తర్వాతకూడా ఓ ఏడాది ఉంది కాబట్టి నిందితుడికి చట్టప్రకారం రక్షణ తప్పనిసరి అని సింఘ్వీ పేర్కొన్నారు. చట్ట సవరణ చేసింది నిర్దిష్ట రక్షణ కోసమేనని తెలిపారు. కేబినెట్ నిర్ణయం అని హైకోర్టు జడ్జి పేర్కొన్నారంటే ఇది అధికారిక విధులకు సంబంధించినదే కదా? అన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకొని.. ఈ దశలో కేసు మెరిట్స్ జోలికి వెళ్లే ఉద్దేశం లేదని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఐఆర్ తర్వాత ఎఫ్ఐఆర్‌తో ఇబ్బందిపెడుతోందని, ఇది రాజకీయ కక్షసాధింపేనని లూథ్రా పేర్కొన్నారు. "అసలు ప్రశ్న ఏంటంటే సెక్షన్ 17ఎ పీసీ యాక్టుకే వర్తిస్తుందా లేక ఐపీసీకి కూడా వర్తిస్తుందా?" అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించారు. దీంతో పీసీ యాక్టు సెక్షన్ 17ఎ ను సింఘ్వీ చదువుతూ 'ఎనీ అఫెన్స్' అని ఉంది కనక పీసీ యాక్టుకు, ఐపీసీ నేరాలకు తేడా ఏమీ ఉండదని ధర్మాసనానికి చెప్పారు. సీఆర్‌పీసీ కోడ్ ప్రకారం సెక్షన్ 17ఎ సవరణ పాటించాలని లేదు కదా? అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించారు. పీసీ యాక్టు చూడాలని మళ్లీ సింఘ్వీ పేర్కొనగా ఎఫ్ఐఆర్‌లో పీసీతోపాటు ఐపీసీ కూడా ఉందిగా? అని జస్టిస్ త్రివేదీ తిరిగి ప్రశ్నించారు. 'సెక్షన్ 17ఎ కేవలం పీసీ చట్టానికే వర్తిస్తుంది. మరి ఐపీసీ కింద నమోదైన కేసుల పరిస్థితి ఏంటి?" అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించగా.. ఏ కేసుకైనా వర్తిస్తుందని సాల్వే పేర్కొన్నారు. చట్ట ప్రకారం సదరు వ్యక్తికి ఉన్న స్థాయిని మాత్రమే పరిగణిస్తున్నామని జస్టిస్ అనిరుద్ధ బోస్ పేర్కొన్నారు. ఈ కేసులో కోర్టు పరిశీలించాల్సింది ఒకే ఒక అంశమని, ఐపీసీ కింద నమోదైన కేసులకు 17 ఎ సవరణ వర్తిస్తుందా లేదా అనేది మాత్రమే అని జస్టిస్ బేలా ఎం త్రివేది వ్యాఖ్యానించారు.

దీనికి సెక్షన్ 17ఏ వర్తించదు: రోహత్గీ

ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ... స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసుకి పీసీ చట్టం సెక్షన్ 17ఏ వర్తించదని స్పష్టం చేశారు. జులై 2018లో చట్ట సవరణతో సెక్షన్ 17ఏ చేర్చారని, ఎఫ్ఐఆర్ 2021 నాటిదైనా దర్యాప్తు చట్ట సవరణ కన్నా ముందుగానే ప్రారంభమైందని ధర్మాసనానికి తెలియజేశారు. 2018 కన్నా ముందుగా విచారణ ప్రారంభించినట్లు సంబంధిత పత్రాలు ఏమైనా ఉన్నాయా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ఆయా పత్రాలు సమర్పిస్తామని రోహత్గీ ధర్మాసనానికి తెలిపారు. కేసు దర్యాప్తు చట్ట సవరణ కన్నా ముందుగానే ప్రారంభమైందని, కేంద్ర దర్యాప్తు సంస్థ ఈ కేసును పరిశీలించిందని తెలిపారు. ఇలాంటప్పుడు రాజకీయ కక్ష అని ఎలా ఆరోపిస్తారని ప్రశ్నించారు. "నేరం జరిగింది 2015–16లో. దర్యాప్తు కూడా ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు కాకముందే మొదలైంది. అలాంటపుడు రాజకీయ కక్ష అనడం సబబు కాదు కదా?" అని దని రోహత్గీ చెప్పారు. హైకోర్టుకు డాక్యుమెంట్లు అన్నీ సమర్పించారా లేదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉందని, ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. దర్యాప్తునకు సంబంధించిన అన్ని పత్రాలు సమర్పిస్తామని రోహత్గి ధర్మాసనానికి తెలిపారు. తదుపరి విచారణకు సంబంధించి పరిశీలించాల్సిన అంశాలు ఉన్నాయని, విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. అప్పుడే ఈ పిటిషన్ విచారణకు తీసుకోవాలా వద్దా అనేది నిర్ణయిస్తామని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని, విచారణకు సీఐడీ కస్టడీ కోరుతున్నారని అదే కష్టంగా ఉందని లూథ్రా కోర్టుకు తెలిపారు. పదిహేను రోజుల గడిచిన తర్వాత కూడా కస్టడీ కోరటం సరికాదని సిద్ధార్థ లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. బెయిలుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించిన ధర్మాసనం... విచారణ సోమవారం చేపడతామని స్పష్టం చేసింది.

బదిలీలకు ఓకే.. పదోన్నతులకు బ్రేక్

▶ మొదటి పేజీ తరువాయి

సమర్థించింది. ప్రమోషన్లపై స్టే ఇచ్చింది. న్యాయపరంగా ఈ అంశాన్ని పరిష్కరించడం ఇప్పట్లో సాధ్యమయ్యే పనికాదని భావించిన అధికారులు, ప్రమోషన్ల అంశాన్ని పక్కనబెట్టేశారు.

రిలీవర్ వస్తేనే స్థాన చలనం

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 78 వేల మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తప్పనిసరిగా బదిలీ అయ్యే వారి సంఖ్య 40 వేలకుపైనే ఉంటుంది. సీనియారిటీ ప్రకారం చూస్తే 58 వేల మందికి బదిలీకి ఆస్కారం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక ఉపాధ్యాయుడికి బదిలీ అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడు ఉంటేనే రిలీవ్ చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. అంటే రిలీవ్ అయ్యే టీచర్ బోధించే సబ్జెక్టుకు సంబంధించిన మరో టీచర్ బదిలీపై వస్తేనే ప్రస్తుతం ఉన్న టీచర్‌ను రిలీవ్ చేయాలని ఆదేశించారు. దీంతో 58 వేల మంది టీచర్ల బదిలీకి ఆస్కారమున్నా, 25 వేల మందికి మించి స్థాన చలనం ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. పాఠశాల విద్య డైరెక్టర్ మార్గదర్శకాల ప్రకారం.. టీచర్ 8 ఏళ్ళు, హెచ్‌ఎం 5 ఏళ్ళు ఒకేచోట ఉంటే తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంటుంది. ఒకేచోట కనీసం రెండేళ్ళుగా పనిచేస్తున్న టీచర్లు బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

20 మందితో బీఎస్పీ తొలి జాబితా

- అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం: ఆర్‌ఎస్ ప్రవీణ్
- తాను సిర్పూర్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నట్టు వెల్లడి
- సూర్యాపేటలో వట్టే జానయ్య యాదవ్‌కు బీఎస్పీ టికెట్



సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. తాను ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నట్టు వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ కో–ఆర్డినేటర్, ఎంపీ రాంజీ గౌతమ్‌తో కలసి పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితాను ప్రవీణ్‌కుమార్ విడుదల చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ కన్నా ముందే 20 మంది అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటిస్తున్నామని, త్వరలో మరి కొందరు అభ్యర్థులను వెల్లడిస్తామని చెప్పారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే మోదీ ప్రకటనలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే ప్రధాని మోదీ పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ ప్రకటనలు చేశారని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఆచరణలో అమలుకాని హామీలతో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మేనిఫెస్టోలు ఉంటున్నాయని విమర్శించారు. అధికారాన్ని అట్టిపెట్టుకోవాలనే ఉద్దేశంతోనే సమగ్ర కుటుంబ సర్వేను కేసీఆర్ బయటపెట్టడం లేదని ఆరోపించారు. ప్రజల సొమ్ముతో చేసిన సర్వేను రహస్యంగా ఉంచడం ఎందుకని నిలదీశారు. బీఎస్పీ ప్రజాబలం ఉన్న పార్టీ అని, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ధనబలమే తప్ప ప్రజాబలం లేదని వ్యాఖ్యానించారు.

బీఎస్పీ తొలి జాబితా ఇదీ..

సిర్పూర్ – ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, జహీరాబాద్ – జంగం గోపి, పెద్దపల్లి – దాసరి ఉష, తాండూరు – చంద్రశేఖర్ ముదిరాజ్, దేవరకొండ – ముడావత్ వెంకటేశ్ చౌహాన్, చొప్పదండి – కొంకటి శేఖర్, పాలేరు – అల్లిక వెంకటేశ్వర్‌రావు, నకిరేకల్ – మేడి ప్రియదర్శిని, వైరా – బానోత్ రాంబాబు నాయక్, ధర్మపురి – నక్క విజయ్ కుమార్, వనపర్తి – నాగ మోని చెన్నరాములు, మానకొండూరు – నిషాని రామచందర్, కోదాడ – పిల్లుట్ల శ్రీనివాస్, నాగర్ కర్నూల్ – కొత్తపల్లి కుమార్, ఖానాపూర్ – బన్సీలా ల్ రాథోడ్, ఆందోల్ – ముప్పారపు ప్రకాశ్, సూర్యా పేట – వట్టే జానయ్య యాదవ్, వికారాబాద్ – గో ర్లకాడి క్రాంతికుమార్, కొత్తగూడెం– ఎర్ర కామేశ్, జుక్కల్– ప్రద్యుమ్న కుమార్ మాధవరావు ఏకాంబర్.

21న యూకేలో బతుకమ్మ సంబురాలు

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: భారత్ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 21న యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిగే బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ఆవిష్కరించారు. భారత్ జాగృతి ఆధ్వర్యంలో ఏటా వివిధ దేశాల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తుండగా, యూకే విభాగం కూడా మెగా బతుకమ్మ పేరిట వేడుకలకు సిద్ధమవుతోంది. ఈ నెల 21న నిర్వహించే వేడుకలకు ప్రవాస తెలంగాణవాసులతోపాటు ప్రవాస భారతీయులు కూడా పాల్గొంటారు. బతుకమ్మకు అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చేందుకు విదేశాల్లో ఉన్న భారత్ జాగృతి కార్యకర్తలు కృషి చేశారని కవిత వ్యాఖ్యానించారు.

ఉద్యోగుల అనుకూల ప్రభుత్వమంటే ఇదేనా?

20 శాతం ఐఆర్ ప్రకటించాలి: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5 శాతం ఐఆర్ ప్రకటించడం దారుణమని, వెంటనే 20 శాతం ప్రకటించాలని కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. 'ఉద్యోగుల అనుకూల ప్రభుత్వమంటే ఇదేనా? ఇదేనా ఉద్యోగులను కడుపులో పెట్టుకుని చూసుకునే విధానం? దేశంలోనే ధనిక రాష్ట్రంలో ఇదేం దారుణం?' అని మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) నియమించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే గడువు ముగియడానికి 6 నెలల ముందే పీఆర్సీ నివేదిక తీసుకోవాల్సి ఉండగా, గడువు ముగిసిన మూడు నెలల తర్వాత కమిషన్‌ను నియమించడం ఉద్యోగులపట్ల రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే ఇంతటి దారుణమైన ఐఆర్‌ను ఉద్యోగులు చూడలేదని, రాష్ట్రంలోని 2.75 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు, 2 లక్షల మంది పెన్షనర్లు ఆశ్చర్యానికి గురయ్యారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏల్లో రెండింటిని వెంటనే క్లియర్ చేయాలని, ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ బిల్లులను మంజూరు చేయాలని ఆ ప్రకటనలో భట్టి డిమాండ్ చేశారు.

15-20% ఐఆర్ ప్రకటించాలి: ఎంపీ కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: పీఆర్సీ సమయం మూడు నెలల క్రితమే ముగిసినా ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పీఆర్సీని నియమించడం సిగ్గుచేటని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. మూడు నెలల క్రితమే ప్రకటించాల్సిన ఐఆర్‌ను కూడా కేవలం 5 శాతమే ప్రకటించడం ఉద్యోగులను అవమానపర్చడమేనంటూ ఆయన మంగళవారం బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 8, 22 శాతం, కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 27 శాతం ఐఆర్‌ను ఉద్యోగులకు ప్రకటించామని, కేసీఆర్ మాత్రం 2018లో 0, 2023లో 5 శాతాన్ని ప్రకటించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వెంటనే ఉద్యోగులకు 15–20 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు కూడా గుండె మీద చేయి వేసుకుని ఆలోచించాలని, ఉద్యోగులకు అండగా ఉండే కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని, ఉద్యోగ వ్యతిరేక ప్రభుత్వంపై ఉద్యోగ సంఘాల నేతలు తిరుగుబాటు చేయాలని ఆ లేఖలో కోమటిరెడ్డి పిలుపునిచ్చారు.

దేశమంతా ఆశ్చర్యపోయే 'పే స్కేల్' ఇదేనా?

5% ఐఆర్ దిమ్మతిరిగేదా? కేసీఆర్‌పై బండి సంజయ్ విమర్శలు



సాక్షి, హైదరాబాద్: దేశమే ఆశ్చర్యపోయేలా, దిమ్మదిరిగేలా ఉద్యోగులకు పేస్కేల్ ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం కేసీఆర్.. చివరకు ఐదు శాతమే మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేశారని బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ధ్వజమెత్తారు. మరోసారి కేసీఆర్ అధికారంలోకి వస్తే పీఆర్సీ అటుంచి కనీసం వేతనాలు కూడా చెల్లించరని ఆరోపించారు. ఉమ్మడి ఏపీలో 27 శాతం ఐఆర్ ఇచ్చిన సంగతిని కేసీఆర్ గుర్తుంచుకోవాలన్నారు.

స్వరాష్ట్రంలోనే స్థానికేతరులుగా..

కేసీఆర్ పాలనా పుణ్యమా అని 317 జీవో పేరుతో స్వరాష్ట్రంలోనే ఉద్యోగులు స్థానికేతరులుగా మారి చెట్టుకొకరు పుట్టకొకరుగా జీవనం సాగిస్తున్నారని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీలు, ప్రమోషన్లు లేక అల్లాడుతున్నారని, ఏటా ఖాళీ అవుతున్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో పనిభారం ఎక్కువై ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి భజన చేసే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలని సంజయ్ కోరారు.

'ఐఆర్‌ను 10 శాతానికి పెంచాలి'

సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని, మధ్యంతర భృతిపై పునరాలోచించి 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలని తెలంగాణ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మమత, సత్యనారాయణ కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ వెంటనే అమలు చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐఆర్ 11 శాతం ఇవ్వాలి: పీఆర్టీయూటీఎస్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండవ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పీఆర్టీయూటీఎస్ కృతజ్ఞతలు తెలిపింది. అయితే ఉద్యోగులకు ప్రకటించిన మధ్యంతర భృతి 5 శాతం కాకుండా 11 శాతం ఇవ్వాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యాయపరమైన వివాదాన్ని పరిష్కరించి పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని కోరారు.



నాశనం గావించే, నయం చేయగలిగే శక్తి మాటలకు ఉంది. ఎప్పుడు మాటలు సత్యవంతం, దయాపూరితం అవుతాయో అవి ప్రపంచాన్ని మార్చగలవు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 4 అక్టోబర్ 2023

ఇన్నేళ్ళకు న్యాయం!

మూడు దశాబ్దాల పైచిలుకు క్రితం కేసులో బాధితులకు ఎట్టకేలకు కాసింత ఊరట దక్కింది. పోలీసుల దమనకాండకు ప్రతిరూపమైన తమిళనాడు వాచాత్తి ఘటనలో సెప్టెంబర్ 29న మద్రాస్ హైకోర్ట్ ఇచ్చిన తీర్పు ఆ రకంగా చిరకాలం గుర్తుండిపోతుంది. మారుమూల గ్రామంలోని గిరిజనులపై దాడి చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన దారుణమైన కేసు అది. అటవీ, పోలీసు అధికారులతో సహా మొత్తం 269 మంది దోషులంటూ కింది కోర్టు ఏనాడో తీర్పు ఇచ్చింది. దోషులు హైకోర్టును ఆశ్రయించి, జాగు చేశారు. తాజాగా మద్రాస్ హైకోర్ట్ ఆ అప్పీళ్ళను కొట్టివేసింది. కింది కోర్ట్ తీర్పును హైకోర్ట్ సమర్థించడమే కాక, 215 మందినీ దోషులుగా తీర్మానిస్తూ, ఒక్కొక్కరికీ 1 నుంచి 10 ఏళ్ళ పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. బాధితులకు ఇన్నాళ్ళకైనా న్యాయం దక్కిందనే భావన కలుగుతోంది. ప్రజాస్వామ్యం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల నమ్మకం మిగులుతోంది.

నిజానికి, తమిళనాట ధర్మపురి జిల్లాలో తూర్పు కనుమల్లో నెలకొన్న గిరిజన గ్రామం వాచాత్తి గురించి ముప్పయ్యేళ్ళ క్రితం ఎవరూ విననైనా విని ఉండరు. కేవలం 655 మంది, అందులోనూ 643 మంది మలయాళీ షెడ్యూల్డ్ తెగల వారున్న 200 గడపల గ్రామం అది. కానీ, ఆ రోజు జరిగిన ఆ దారుణ ఘటనతో ఒక్కసారిగా ఆ గ్రామం వార్తల్లో నిలిచింది. గంధపుచెక్కల స్మగ్లర్ వీరప్పన్ అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ, పోలీసులు, అటవీ అధికారులు గ్రామంపై దాడి చేశారు. అక్కడ గిరిజనులపై సాగించిన అమానుషం, బడికెళ్ళే ఓ చిన్నారి సహా 18 మంది మహిళలపై సామూహిక అత్యాచారం, తాగునీటిలో విషం కలిపిన తీరు, పశువుల్ని ఊచకోత కోసి ఊరి బావిలో పడేసిన వైనం... ఆ గ్రామం రూపురేఖల్నే మార్చేశాయి. 'గంధపు చెక్కల స్మగ్లింగ్ గ్రామం' అని ముద్రవేస్తూ అమాయకులపై అధికారులు సాగించిన ఆ దమనకాండ ఓ మాయని మచ్చ. కేంద్ర నేర దర్యాప్తు సంస్థ (సీబీఐ) లోతుగా విచారించి అధికారుల తప్పు తేల్చినా, ఏళ్ళ తరబడి వాయిదా పడుతూ వచ్చిన న్యాయం ఇన్నాళ్ళకు దక్కింది. బాధితులకు కాస్తయినా ఊరట దక్కింది.

1992 జూన్ 20 నుంచి మూడు రోజులు సాగిన అమానుష ఘటనలో మొత్తం 269 మంది నిందితులు కాగా, వారిలో 54 మంది న్యాయ విచారణ కాలంలోనే కన్నుమూశారు. మిగిలినవారికి ఇప్పుడు శిక్ష పడింది. ఈ కథ ఇక్కడి దాకా రావడం వెనుక న్యాయం కోసం సుదీర్ఘంగా సాగిన పోరాటం ఉంది. అప్పట్లో అధికారులపై కేసులు నమోదు కాకపోగా, గిరిజనులపైనే స్థానిక పోలీసులు ఎదురు కేసులు పెట్టిన పరిస్థితి. గిరిజనులు తమ ఇళ్ళను తామే ధ్వంసం చేసుకున్నారని అధికారులు బుకాయించారు. హైకోర్ట్ ఆదేశిస్తే గానీ చివరకు సీబీఐ దర్యాప్తు జరగలేదు. అంతరాయాలతో విచారణ సుదీర్ఘంగా 19 ఏళ్ళు సాగి, చివరకు 2011లో ధర్మపురి సెషన్స్ కోర్ట్ అధికారులను దోషులుగా తేల్చి, శిక్ష వేసింది. దోషులు మద్రాస్ హైకోర్ట్‌ను ఆశ్రయించడంతో మరో 11 ఏళ్ళ సుదీర్ఘ కాలం గడిచిపోయింది. ఈ కేసు విచారణ సత్వరమే పూర్తి చేయాలని హైకోర్ట్ న్యాయమూర్తి ఒకరు ఈ ఏడాది మొదట్లో పట్టుబట్టడంతో ఇప్పటికైనా కథ ఓ కొలిక్కి వచ్చింది.

చిత్రం ఏమిటంటే – వాచాత్తి దమన కాండపై అప్పట్లోనే ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైతే, ప్రభుత్వంలో ఉన్నత హోదాల్లో ఉన్నవారు అలాంటి నేరాలకు పాల్పడరంటూ జడ్జి దాన్ని కొట్టేయడం! జయలలిత సారథ్యంలోని అప్పటి అన్నాడీఎంకె పాలకులు, స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు ఈ ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. ఆ తరువాత అధికారంలో ఉన్న డీఎంకె, అన్నాడీఎంకె సర్కార్లూ తమ బ్యూరోక్రాట్లకు కాపు కాసేందుకే ప్రయత్నించాయి. కొందరు ఉద్యమకారులు, లాయర్లు, నిజాయతీపరులైన అధికారులు, జడ్జీల వల్ల చివరకు న్యాయం జరిగింది. అత్యాచార బాధితులు పట్టువిడవకుండా పోరాడడంతో ఇప్పటికైనా సత్యం గెలిచింది. కళ్ళకు గంతలు కట్టుకున్న న్యాయదేవత సాక్షిగా ధర్మం నిలిచింది. కేవలం 655 మంది ఆదివాసీలు బలమైన రాజ్యవ్యవస్థతో తలపడి, విజయం సాధించడం చరిత్రాత్మకం. ఆ రకంగా ఇది బలవంతులపై బలహీనుల గెలుపు. ఆదివాసీల హక్కుల గెలుపు. న్యాయవ్యవస్థ స్వతంత్రమనీ, పాలకుల తప్పులను సైతం సహించదనీ రుజువైంది. ఎస్సీ– ఎస్టీ చట్టం ఇప్పటికీ బలంగానే ఉందని తేలింది.

అయితే, నేటికీ కొనసాగుతున్న అనేక దమనకాండ కేసుల్లో ఇంత సుదీర్ఘ పోరాటం, సత్యాన్ని వెలికితీసి దోషులకు శిక్షపడేలా బృహత్ యత్నం సాధ్యమేనా? న్యాయం దక్కడంలో ఆలస్యమైతే, న్యాయం చేయనట్టే! వాచాత్తి ఘటనలో అపరిమిత ఆలస్యమైంది. దోషుల్లో పలువురు బెయిల్‌పై బయట గడిపి, ఉద్యోగ ప్రయోజనాలన్నీ పొంది, హాయిగా రిటైరయ్యారు. ఇప్పటికైనా దోషులను శిక్షించడమే కాక, బాధితులకు తగిన న్యాయం చేయాలి. నష్టపరిహారాలిస్తే సరిపోదు. నలుగురిలో గౌరవంగా బతికేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. వలసవాద బ్రిటీషు పాలన లక్షణాలను పోలీసులు, అధికారులు ఇప్పటికైనా వదిలించుకొంటే మేలు.

తమిళనాట గిరిజనులపై అమానుషాల నుంచి మిజోరమ్‌లో గ్రామాల దహనం, కశ్మీర్‌లో నిరసనకారులపై కాల్పుల దాకా దశాబ్దాలుగా చూస్తున్నవే. బ్రిటీషు దౌర్జన్యానికి మన భారతీయ పోలీసులు వారసులుగా మారిన వైనానికి ఇవి ప్రతీకలు. పదే పదే సాగుతున్న మానవహక్కుల ఉల్లంఘనకు సాక్ష్యాలు. అందుకే, ''దాడుల పేరిట చట్టవ్యతిరేక చర్యలకు'' పోలీసులు బరి తెగించడం దుస్సహమని కోర్ట్ అన్న మాట కీలకం. నిన్నటికి నిన్న కూడా వార్తల్లో కనిపిస్తున్న ఇళ్ళపై దుర్మార్గ దాడుల ధోరణిని వ్యవస్థ సత్వరమే వదిలించుకోవాలి. వాచాత్తి కేసు గుర్తుచేస్తున్న పాఠం అదే!


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** బ.పంచమి ఉ.8.55 వరకు
తదుపరి షష్ఠి, **నక్షత్రం:** రోహిణి రా.10.42 వరకు, తదుపరి మృగశిర,
వర్జ్యం: తె.4.28 నుండి 6.07 వరకు (తెల్లవారితే గురువారం).
దుర్ముహూర్తం: ప.11.26 నుండి 12.14 వరకు,
అమృత ఘడియలు: రా.7.24 నుండి 9.02 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.46
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇంటింటా ఇంగ్లిష్ వసంతం

విశ్లేషణ



కంచ ఐలయ్య షెపర్డ్

ఈ 2023 అక్టోబర్ 5... 206వ భారతీయ ఇంగ్లిష్ దినోత్సవం. భారతదేశంలో పరిపాలనా భాషగా మనుగడ సాగించిన ఈ 206 సంవత్సరాల్లో ఇంగ్లిష్ అతి సంపన్నుల ఆస్తిగా మిగిలిపోయింది. దేశంలో అతి ధనవంతులు లేక స్థిరమైన వేతనం పొందేవారు మాత్రమే తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్యను చెప్పించగలిగారు. కానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత నాలుగేళ్ల కాలంలో భారతదేశంలోని విద్యా నమూనానే మార్చివేశారు. ఈ నమూనాలో వ్యవసాయ కార్మికుల పిల్లలు, ఆదివాసీలు, చేతివృత్తుల వారితోపాటు, పేదల్లోకెల్లా నిరుపేదలు కూడా కేవలం ఇంగ్లిష్ మాధ్యమం విద్యనే కాదు, పూర్తిగా భిన్నమైన విద్యను పొందుతున్నారు.

మన దేశంలో అతి ధనవంతులు లేక సక్రమంగా ఉద్యోగం చేస్తూ స్థిరమైన వేతనం పొందేవారు మాత్రమే తమ పిల్లలకు పరిమితమైన స్థాయి నుండి ఉన్నత తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యను చెప్పించగలిగారు. దేశంలోని అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులందరూ తమ పిల్లలను ఇంగ్లిషు మీడియంలో చదివించేవారు. నాగాలాండ్ వంటి చిన్న ఈశాన్య రాష్ట్రాలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలందరికీ ఏదో ఒక రకమైన ఇంగ్లిష్ మాధ్యమ విద్యను అందిస్తున్నాయి.

రాజధాని ఢిల్లీ నుంచి దేశాన్ని అత్యధిక కాలం పాలించిన భారత జాతీయ కాంగ్రెస్, 15 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన బీజేపీ వంటి జాతీయ పార్టీలు ఇప్పుడు ఇంగ్లిష్ భాషా విద్యను ధనవంతులకు సొంతం చేశాయి. ఈ పార్టీల అభివృద్ధి నమూనాలో పాఠశాల విద్యకు అతితక్కువ ప్రాధాన్యత మాత్రమే లభించింది.

వెనుకబడిన నైజాం రాష్ట్రంలో సరైన తెలుగు మీడియం పాఠశాల కూడా లేని ఒక కుగ్రామంలో పుట్టి, ఇంగ్లిష్ నేర్చుకోవడంలో దుర్భరమైన కష్టాన్ని అనుభవించిన వ్యక్తిగా బతికిన నేను, జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్నట్టుగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పాఠశాల విద్యపై ఇంత శ్రద్ధ చూపుతారని ఎన్నడూ ఊహించలేదు. నా 71 ఏళ్ల సుదీర్ఘ జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, విడిపోయిన ఏపీ, తెలంగాణలలో అనేక మంది ముఖ్యమంత్రులను చూశాను. నేను అనేక రాష్ట్రాల్లో పర్యటించాను. ముఖ్యమంత్రుల, ప్రధాన మంత్రుల పరిపాలనా పద్ధతుల గురించి చదివాను. అయితే పాఠశాల విద్యా కార్యక్రమాలకు ఏపీ ముఖ్యమంత్రి వెచ్చిస్తున్నంత సమయాన్ని ఏ ముఖ్యమంత్రి కానీ, ప్రధాన మంత్రి కానీ వెచ్చించలేదు.

గతంలో సిద్ధరామయ్య కర్ణాటకకు మొదటి దఫా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, పినరయి విజయన్ రెండు పర్యాయాలు కేరళ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను వారితో మాట్లాడి ఆ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని అభ్యర్థించాను. అయితే అగ్రవర్ణ మేధాజీవులకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడానికి ఆ ఇద్దరూ భయపడ్డారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో పేదల్లోకెల్లా నిరుపేదలకు ఈ రోజువరకూ ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడం లేదు. దీన్ని అలా పక్కన పెడితే రాష్ట్ర విద్యావ్యవస్థ పనితీరును సమీక్షించడానికి ఏ ముఖ్యమంత్రీ జగన్‌లా పాఠశాల విద్యపై ఇంత డబ్బు, సమయం, శక్తి వెచ్చించలేదు. 'నా రాష్ట్ర పిల్లలకు ఉత్తమమైన విద్యను అందించాలని కోరుకుంటున్నాను, అదే వారి భవిష్యత్ ఆస్తి' అని జగన్‌మోహన్ రెడ్డి పదేపదే చెప్పారు. పాఠశాల, కళాశాల పిల్లల తల్లుల ఖాతాల్లో ఏడాదికి సుమారు 35 వేల రూపాయలు జమ అవుతున్నాయి. ఆ డబ్బును వారు తమ విద్యా అవసరాలకు ఖర్చు చేస్తారు. పిల్లల బూట్లు, బ్యాగుల నాణ్యత, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల సౌకర్యాలు



వంటివాటిపై ఏపీ ముఖ్యమంత్రి నిత్యం సమీక్షిస్తున్నారు.

దేశంలోని ఏ భాగానికి చెందిన పాఠశాల మౌలిక సదుపాయాలు కూడా భారతదేశ చరిత్రలో ఏపీలోని పిల్లలకు ఉన్న నాణ్యతతో ఎన్నడూ లేవు. ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణాన్ని రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి అని ఎప్పుడూ నిర్వచించలేదు. బడా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి వారిని బలిపించడం నుంచి చిన్న కాంట్రాక్టర్ల దిశగా అభివృద్ధి ఆలోచనలను జగన్‌మోహన్ రెడ్డి మార్చివేశారు. ఇలాంటి చిన్న కాంట్రాక్టర్లు ఇప్పుడు గ్రామ, పట్టణ మార్కెట్లలో డబ్బు ఖర్చు చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో వేతనాలు పొందే కార్మికులు గ్రామాలు, పట్టణాలలో విస్తరించారు. ఈ నమూనాలో అభివృద్ధి పెద్ద నగరాల్లో మాత్రమే కేంద్రీకృతం కాదు. గ్రామ మార్కెట్లు ఎంతగానో పుంజుకుంటాయి.

అదే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి ఐదేళ్ల చంద్రబాబు పాలనను, తెలంగాణలో చంద్రశేఖర్ రావు పదేళ్ల పాలనను చూశాను. వారు తమ తమ రాష్ట్రాల్లోని పాఠశాల విద్యా నిర్మాణాలను ఎప్పుడూ సమీక్షించలేదు. ముఖ్యమంత్రి కార్యాలయం ఎప్పుడూ రాష్ట్ర పేద పిల్లల జీవితం, అభివృద్ధి గురించి చర్చించే స్థలంగా ఉండలేదు. పాఠశాల, కళాశాల విద్యను కార్పొరేట్ వ్యాపార సంస్థలకు అప్ప జెప్పడంలో వీరు పేరొందారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ పాఠశాలలకు వైఫై, స్మార్ట్ టీవీలు ఇవ్వడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ వినూత్న విద్యా పద్ధతులను సమీక్షిస్తూ, గ్రామీణ పాఠశాలలకు వాటిని జోడిస్తూనే ఉన్నారు. జాతీయ, ప్రాంతీయ పార్టీల ఆధ్వర్యంలో నడిచే దేశం, రాష్ట్రాలు ఈ ఏడాది భారతీయ ఇంగ్లిష్ దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన నేపథ్యం ఇది.

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసిన తర్వాత ఆయన కుమారుడు లోకేష్, కోడలు బ్రాహ్మణి మాట్లాడటం నేను టీవీ ఛానళ్లలో చూశాను. తెలుగు కంటే వారి ఇంగ్లిష్ చాలా బాగుంది.

ఎందుకు? వారు అగ్రశ్రేణి ఇంగ్లిష్ మాధ్యమ పాఠశాలల్లోనూ, అమెరికాలో కూడా చదువుకున్నారు. కానీ ఆ కుటుంబం, ఆయన పార్టీ 2019లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టడానికి జగన్ కోర్టు పోరాటాలు, మీడియా పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఏపీకి చెందిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమణ ఆ విధానాన్ని వ్యతిరేకించారు. అయినా ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం చదువుతున్న నిరుపేదలకు, తల్లులకు ఆర్థిక సాయంతో జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారు. అలాంటి కార్మిక పిల్లలు ఇంగ్లిష్ మాట్లాడే సుసంపన్న దేశమైన అమెరికాకు వెళ్లి ఐక్యరాజ్యసమితి విద్యా సమావేశాలలో, వైట్ హౌస్‌లో ధైర్యంగానూ, విశ్వాసంతోనూ మాట్లాడారు. ఎక్కడికి వెళ్లినా ప్రేక్షకుల నుంచి చప్పట్లు స్వీకరించారు. ఇది కచ్చితంగా భారతదేశ భవిష్యత్ పాఠశాల విద్యా వ్యవస్థకు ప్రేరణాత్మక ఉదాహరణ.

ఈ రోజు పేదలు, గ్రామ పిల్లలు ఇంగ్లిష్ నేర్చుకోవడంపై సంబరాలు జరుపుకోవాల్సిన అవసరం ఉంది. 1817లో మన జాతీయ జీవనంలోకి వచ్చిన ఇంగ్లిష్ విద్య కొత్త మార్గాన్ని సుగమం చేసింది. కొత్త ఆశను సృష్టించింది. మన విద్యావ్యవస్థలో ఇద్దరు సంస్కర్తలు విలియం కేరీ, రాజా రామ్మోహన్ రాయ్ 206 సంవత్సరాల క్రితం అక్టోబర్ 5న మొదటి పాఠశాలను ప్రారంభించారు. అయితే ఆ భాషా ఫలాలు వ్యవసాయాధారిత ప్రజానీకానికి, పట్టణ పేదల పిల్లలకు ఇప్పటికీ చేరలేదు. ఉన్నత స్థాయి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్య నుండి వచ్చిన ఏ విద్యావేత్త కూడా సమాన విద్యా మాధ్యమం కోసం పోరాడలేదు.

మన దేశంలో ప్రాంతీయ భాషల వేడుకలను ఎవరూ వ్యతిరేకించరు. కానీ అదే సమయంలో భారతీయ ఇంగ్లిష్‌ను సెలబ్రేట్ చేసుకోవడం, ఆ ప్రపంచ భాషని మన గ్రామాల్లోకి విస్తరించడం అనేది మన సొంత రూపాంతరంలో ఇంగ్లిష్‌ని తీర్చిదిద్దుతుంది. 206 సంవత్సరాల పాటు ఇంగ్లిష్ అగ్రవర్ణ ధనవంతులు భద్రపరుచుకున్నదిగా ఉండిపోయింది. ఇంగ్లిష్ భాషను ధనవంతుల ఇళ్లకు, ఉన్నత కార్యాలయాలకు, మాల్ మార్కెట్‌లకు, విమానాశ్రయాలకు పరిమితం చేయడం నేరం. ఇది గ్రామ మార్కెట్లు, గ్రామ బస్టాప్‌లతోపాటు వ్యవసాయ క్షేత్రాలకు చేరుకోవాలి. అక్కడే అది మరింతగా భారతీయతను సంతరించుకుంటుంది. ఏ భాషనూ ఒక వర్గ ప్రజల ఆస్తిగా పరిగణించకూడదు.

జగన్ ప్రభుత్వం ఆ తొలి అడుగు వేసింది. ఇక నుంచి ప్రతి సంవత్సరం ఇండియన్ ఇంగ్లిష్‌ను వేడుకగా జరుపుకొని, ఆ రోజున మన పిల్లలను, యువతను ఒక పుస్తకాన్ని చదివేలా చేద్దాం.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొత్త ఎత్తుగడ



'పాకిస్తాన్ వెళ్లిపోండి' అని ఇప్పుడు ఎవరూ చెప్పడం లేదు. 'చైనీస్ ఏజెంట్' అనేది 2023 ఇండియాకు సంబంధించిన మెకార్థీయిజం (విపక్షాన్ని అణిచేందుకు వాడే రాజకీయ ఆచరణ).
– శివమ్ విజ్, వ్యాఖ్యాత

కొత్త స్నేహం



యూఏఈ అరబ్బులు హసిడిక్ (జుడాయిజం, యూదులకు చెందిన) పాటలు పాడుతున్నారు (వీడియో షేర్ చేశారు). ఇలాంటిది జరగగలదని కొన్నేళ్ల క్రితం ఎవరు ఊహించారు! ఇజ్రాయిల్, యూఏఈ సంబంధాలు బలపడుతున్నాయి.
– బెమెర్ బహార్, లౌకికవాది

చెత్త తిండి



ప్రపంచంలోనే చెత్త ప్యాకేజ్డ్ ఫుడ్ ఇండియాదని నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నాలుగు లక్షల ఉత్పత్తులను పరిశీలించిన 'జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్' అధ్యయనం ప్రకారం, ఇండియా ఉత్పత్తుల్లో చక్కెర, ఉప్పు, శాచురేటెడ్ ఫ్యాట్, కేలరీలు అధికం. ఈ తక్కువ నాణ్యత ఆహారాన్నే చాలామంది ఇళ్లలో తింటున్నారు. కాబట్టి ఇంట్లో తినడం, ఇంటి వంట తినడం రెండూ వేరని గుర్తుంచుకోండి.
– హేమంత్ హిమత్‌సింగ్కా, యాక్టివిస్ట్

ఆరోగ్యమే ఉత్సవం



క్యాన్సర్‌కు చికిత్స తీసుకున్న రెండేళ్ల తర్వాత, నేను ఈ మధ్యే నా మొదటి హెయిర్ కట్ చేయించుకున్నాను. ఆరోగ్యమైన మనిషిగా నేను అప్పుడప్పుడూ పెద్ద మైలురాళ్లను దాటుతున్నాను. మీరు ఒక పోరాటం గెలిస్తే, ఆ మైలురాళ్లను ఆస్వాదించడం మానవద్దు.
– దేవికా చోప్రా, జర్నలిస్ట్

ఎర్ర సంబంధం



ఎక్కడైనా జర్నలిస్టుల మీద పోలీస్ దాడులు జరగడాన్ని నేను ఇష్టపడను. కానీ ఈ ఢిల్లీకి చెందిన 'న్యూస్ క్లిక్'కు చైనీస్ ప్రాపగాండాను ముందుకుతోసే మనిషితో సంబంధాలున్నాయన్న ఆరోపణలున్నాయి. ఆయన భాగస్వామి సిరియాకు అనుకూలం, రష్యాకు అనుకూలం.
– ఇయాన్ హాల్, హానరరీ ఫెలో

థ్యాంక్యూ!



ఇరవై ఏళ్ల క్రితం, స్కాలర్‌షిప్ మీద ఆక్స్‌ఫర్డ్ (విశ్వ విద్యాలయం)లో చేరేందుకు భుజాన బ్యాగు, సూట్‌కేసుతో మొదటిసారి హీత్రూ విమానాశ్రయం(లండన్)లో దిగాను. విదేశంలో ఒకటో, రెండో ఏళ్లు ఉంటాననుకున్నాను. కానీ జీవితం చిత్రమైన మలుపులు తీసుకుంది. వలసజీవులకు ఇంత సానుకూలంగా, సొంతింటిలా ఉన్నందుకు బ్రిటన్‌కు ధన్యవాదాలు.
– దేవీ శ్రీధర్, ప్రొఫెసర్

ఇదీ విభజన




బిహార్ కులగణన నివేదిక ఆధారంగా బిహార్ ముస్లింలకు సంబంధించిన నా ప్రాథమిక అంచనా ఇదీ: రాష్ట్రంలో మొత్తం ముస్లింల జనాభా: 17.4 శాతం. ఇందులో ఉన్నత వర్గ ముస్లింలు (సయ్యద్, షేక్, పఠాన్ (ఖాన్)లు): 4.8 శాతం. బీసీ+ ఈబీసీ (పాస్మందా) ముస్లింలు: 12.6 శాతం. (నాలుగు వెనుకబడిన కులాలు: 2.03 శాతం. అత్యంత వెనుకబడిన 31 కులాలు: 10.58 శాతం).
– ఖాలిద్ అనీస్ అన్సారీ, సోషియాలజీ ప్రొఫెసర్

ఇన్ బాక్స్

అభినవాంధ్ర భోజుడు!

ఆధునిక ఆంధ్రదేశపు సంస్కరణకూ, విద్యాభివృద్ధికీ ఎనలేని కృషి చేసినవారు పిఠాపురం మహారాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహదూర్ (1885–1964). రఘుపతి వెంకటరత్నం నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సంఘసంస్కర్తలకు వీరు అండదండలు అందించారు.

సూర్యారావు రసజ్ఞత కలిగిన కవి, రచయిత, తత్వవేత్త, నిరంతర పాఠకుడు, సద్విమర్శకుడు. వివిధ రంగాల్లో సూర్యారావు చేపట్టిన కార్యక్రమాలు ఎన్న దగినవి. దక్షిణాఫ్రికాలోని భారతీయుల కోసం గాంధీజీ పిలుపునందుకుని పాతిక వేలు అందించి, ఆనాటి జమీందార్లలో దేశభక్తికి స్ఫూర్తిగా నిలిచారు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ స్థాపించిన 'శాంతినికేతన్' అభ్యున్నతి కోసం, కలకత్తాలోని సిటీ కాలేజి అభివృద్ధికీ, రాజమండ్రిలోని ఆస్తిక కళాశాల, టౌన్ హాలు నిర్మాణానికీ ఆర్థికంగా సాయం చేశారు. కాకినాడలోని పి.ఆర్. కళాశాల స్వయంగా ఏర్పాటు చేశారు. సంఘ సంస్కరణోద్యమానికి ఆదర్శంగా నిలిచిన 'బ్రహ్మసమాజ' ఉద్యమానికి ప్రాచుర్యం కలిగించి, దక్షిణ భారతదేశంలో ఈ ఉద్యమానికి ఎనలేని సేవ చేశారు. మత సామరస్యం కొరకు పరిశ్రమిస్తూ 'నాల్గవ అంతర్జాతీయ సర్వమత సమ్మేళనా'నికి అధ్యక్షుడిగా పనిచేశారు. అసంఖ్యాక విశిష్ట గ్రంథాలను ప్రచురించారు. 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు'ను మద్రాసులో స్థాపించి, దానికి శాశ్వత నిధిని ఏర్పాటు చేశారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ లాంటి పరిపూర్ణమైన నిఘంటువు తెలుగులో అవసరమనే ఆలోచనతో 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' నిర్మాణాన్ని ఒక యజ్ఞంలా చేపట్టి తెలుగుజాతికి అందించారు.



పిఠాపురం రాజా వారు

దక్షిణ భారతదేశం లోనే మొట్టమొదటి అనాథ ఆశ్రమంగా 'కరుణాలయం' స్థాపించారు. దళిత వర్గాలలోని వ్యక్తుల పేరు చివర గాడు అని చేర్చి, పిలవడాన్ని నిషేధించాలనే బిల్లును మద్రాస్ శాసనసభలో ప్రవేశపెట్టి విజయం సాధించారు. అక్టోబర్ 5న ఈ చిరస్మరణీయుని జయంతి!

– ర్యాలి ప్రసాద్, చారిత్రక పరిశోధకులు

భూసంస్కరణలతోనే సామాజిక న్యాయం

స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచి అమృత ఉత్సవాలు జరుపుకున్నప్పటికీ దేశంలో అత్యధిక మంది ప్రజానీకానికి కనీసం సెంటు భూమి లేదు. వ్యవసాయ రంగ అభివృద్ధి పునాదులే ఇతర రంగాల అభివృద్ధికి మూలమని ప్రముఖ ఆర్థికవేత్త గున్నార్ మిర్డాల్ చెప్పారు. వ్యవసాయ ఉత్పాదకత పెరగాలంటే దున్నే వానికే భూమి ఉండాలని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ లాంటి ఆర్థికవేత్తలు సైతం అభిప్రాయ పడ్డారు. కానీ ఇప్పటికీ సేద్యపు భూమిలో అత్యధికం భూస్వాముల చేతుల్లోనే ఉండిపోయింది.

1952లో ప్రారంభించిన 'కమాండ్ ఏరియా డెవలప్మెంట్ పథకం'తో వ్యవసాయ రంగంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టి 1965 నాటికి దానిని హరిత విప్లవంగా మార్చారు. ఉత్పాదకతను పెంచడానికి, సామాజిక న్యాయ సాధనకు హరిత విప్లవం ఒక్కటే సరిపోదని వ్యవస్థాగత మార్పులు ఆవశ్యమని, భూ సంస్కరణలను ప్రారంభించి రెండు దశలలో అమలు పరిచారు.

భూ సంస్కరణల చట్టాలను 1948–53 మధ్య కాలంలో దాదాపు అన్ని రాష్ట్రాలు అమలు జరిపాయి. కానీ చట్టంలో లొసుగులు, పాలకుల చిత్తశుద్ధి లోపం, తదితర అనేక కారణాల వల్ల భూ సంస్కరణల అమలులో రాష్ట్రాల మధ్య తీవ్ర అంతరాలు ఏర్పడి అవి విఫలమైనాయి. గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన అశాంతి, 1969లో వచ్చిన నక్సల్‌బరీ ఉద్యమం కారణంగా భూ సంస్కరణల రెండో దశ చట్టాలు 1970లో అమలు జరిపారు. అయితే ఇప్పటివరకు పంచింది ఈ దేశంలో 65.5 లక్షల ఎకరాలు మాత్రమే.

భారీ పరిశ్రమల వ్యూహం కారణంగా రుణభారం పెరిగి 1990 కల్లా అప్పులు పుట్టని స్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో 'సంస్థాగత సర్దుబాటు పద్దు' క్రింద ఐఎమ్ఎఫ్ నుండి అప్పు తేవడంతో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ కాస్త ప్రైవేటీకరణ వైపు మళ్ళింది. ప్రపంచీకరణలో భాగస్వాములం అయ్యాం. దీంతో మన దేశంలో వినియోగదారి తత్వం, కెరీరిజం పెరిగిపోయాయి. ఈ రెండింటికీ డబ్బు అవసరం పెరిగిపోయింది. ప్రతి రంగములో ధరలు పెరిగాయి. దీనితో జీవన వ్యయాలు పెరిగి మధ్య తరగతి వర్గాలు మొత్తం ప్రభుత్వ పథకాల



పైననే ఆధారపడే స్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు 'అభివృద్ధి – సంక్షేమం' అనే విధానాన్ని ముందుకు తెచ్చాయి. అభివృద్ధిలో వ్యవసాయం కీలకమని ఏడు దశాబ్దాల తరువాత గ్రహించారు. ఫలితంగా 'పీఎమ్ కిసాన్ యోజన', 'రైతు బంధు', 'రైతు బీమా', 'నదుల అనుసంధానం', 'లిఫ్ట్ ఇరిగేషన్', 'వాటర్ షెడ్స్' పథకాలను ముందుకు తెచ్చారు. కొంత సంతోషమే!

అనేక చట్టాల మూలంగా 2013 నాటికి 57.3 లక్షల మందికి 65.5 లక్షల ఎకరాల భూమిని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేశాయి. అయితే మిగులు భూమి విషయంలో 1969 నాటికి పీసీ మహలనోబిస్ 6 కోట్ల 80 లక్షల ఎకరాల మిగులు భూమి ఈ దేశంలో ఉందని అంచనా వేయగా, 2013 నాటికి ప్రభుత్వాలు ప్రకటించిన మిగులు భూమి 92.5 లక్షల ఎకరాలు మాత్రమే. ప్రకటించిన మిగులు భూమిలో కూడా ప్రభుత్వాలు పంచి పెట్టింది కేవలం 64 శాతం మాత్రమే. కమ్యూనిస్టుల పాలనలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లోనే అత్యధిక భూ పంపిణీ జరగడం గమనార్హం.

ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలుగా భావించే శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, మీడియా స్వతంత్ర ప్రతిపత్తితో ఉండాలి. రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌లో పొందుపరిచిన భూ పంపిణీ చట్టాలను అమలు జరపటానికి ఈ నాలుగు వ్యవస్థలూ పూనుకుంటే చైనాలో మాదిరిగా 17 రోజులలో భూ సంస్కరణలు ఎందుకు అమలు కావు? దక్షిణ కొరియా లాంటి దేశాల్లో సైతం భూ గరిష్ఠ పరిమితిని 7.5 ఎకరాలే ఉన్నది. దీనిని మన ప్రజా ప్రతినిధులు ఆలోచించాలి.

ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలలో భూ పంపిణీ చట్టాలపై హామీ ఇవ్వాలి. సామాజిక న్యాయ సాధనకు సమరశీల పోరాటాలే ఏకైక మార్గమని చైతన్యవంతులైన ప్రజలు గ్రహించాలి.

– పొందూరు ప్రభాకర్ రావు, అర్థశాస్త్ర అధ్యాపకుడు

గురువే కీలకం

చీకట్లో గుంతలు, వాగులు, వంకలు ఎగుడు దిగుళ్ళు కనిపించని అయోమయంలో నడుస్తున్నవారి సమయం వృథా! అజ్ఞానంలో కూరుకుని, జీవితానికి అర్థం, పరమార్థం లేకుండా ఉండడం అవిద్య వల్లనే! అందుకే 'మొక్కలు, సాగు చేస్తే ఎదుగుతాయి, మనిషి విద్యా వ్యాసంగం, అధ్యయన పరిజ్ఞానంతో వర్ధిల్లుతాడు' అన్నాడు జాన్ లాక్. ప్రఖ్యాత భారతీయ తత్త్వవేత్త, రాష్ట్రపతి పదవిని అలంకరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజైన సెప్టెంబర్ 5న మనం 'జాతీయ ఉపాధ్యాయ దినోత్సవా'న్ని జరుపుకొంటున్నాం. ఐక్యరాజ్య సమితి అంగమైన యునెస్కో అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరపాలని 1966లో నిర్ణయించినప్పటి నుంచీ ప్రపంచవ్యాప్తంగా గురువుల ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకొంటూ ఉత్సవాలను జరుపుకొంటున్నారు. ఒక దేశం కానీ, సమాజం కానీ అభివృద్ధి చెందడంలో విద్య పాత్రా, విద్యను బోధించే ఉపాధ్యాయుల పాత్రా ముఖ్యమైనవి. అందుకే ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొనేది.

'పేదరికాన్ని విద్య మూలంగా తొలగించగలం!' అన్న నినాదం అక్షరసత్యం. అయితే ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఎందరో బాలలు అక్షరానికి దూరంగా బతుకుతున్నారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా 25 మిలియన్ల మంది టీచర్ల కొరత ఉందనేది ఒక అంచనా. అంటే చదువుకోవలసిన పిల్లలు చదువుకు దూరంగా ఉంటే... చదువు చెప్పవలసిన గురువుల సంఖ్య తగినంతగా లేకపోవడం ఇప్పటి ప్రపంచ విద్యారంగ ముఖచిత్ర మన్నమాట. ఇంతటి సూపర్ సోనిక్ స్పీడ్‌తో శాస్త్ర సాంకేతికత పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా విద్యారంగంలో ప్రపంచం ఇంత వెనుకబడి ఉండటం నిజంగా శోచనీయం. ప్రపంచ దేశాల ప్రభుత్వాలు ఇకనైనా మేల్కోవాలి. మనకందరికీ తెలుసు అన్ని వృత్తులవారి విజయాల వెనుక గురువులే మార్గదర్శకులని! నిన్నమొన్నటి మన చంద్రయాన్ విజయబావుటా గగన వీధుల్లో ఎగిరింది అంటే ఆ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన టీచర్ల ఘనతా ఇందుకు కారణమే!

– పరిమి శ్యామలా రాధాకృష్ణ, విశ్రాంత ప్రిన్సిపాల్, మదనపల్లి
(అక్టోబర్ 5న ప్రపంచ గురు దినోత్సవం సందర్భంగా)


సీఈసీతో సమావేశం అనంతరం మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న బి.వినోద్ కుమార్. చిత్రంలో భరత్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి. చిత్రంలో శ్రీధర్‌బాబు, ఫిరోజ్‌ఖాన్, జూపల్లి కృష్ణారావు


మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ నేత ఓమ్ పాఠక్. చిత్రంలో మర్రి శశిధర్‌రెడ్డి

స్వేచ్ఛాయుత ఎన్నికలకు వీలేది?

కేంద్ర ఎన్నికల సంఘం బృందంతో భేటీలో నిలదీసిన విపక్ష పార్టీలు

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: రాష్ట్రంలో గతేడాది జరిగిన ఒక్క ఉపఎన్నికనే (మునుగోడు అసెంబ్లీ సీటుకు) సవ్యంగా నిర్వహించలేకపోయిన అధికార యంత్రాంగం.. శాసన సభ సాధారణ ఎన్నికలను ఏ మేరకు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించగలుగుతుందని విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ సహా సీపీఎం, బీఎస్పీ, ఆప్, టీడీపీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని నిలదీశాయి. మునుగోడు ఉపఎన్నికలో రూ. వందల కోట్లను అధికార బీఆర్ఎస్ బహిరంగంగా పంచిపెట్టి ఓటర్లను ప్రలోభపెట్టినా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండిపోయిందని ఆరోపించాయి. ఏకంగా పోలీసు వాహనాలు, అంబులెన్సుల్లో అధికార బీఆర్ఎస్ డబ్బు సరఫరా చేసిందని దుయ్యబట్టాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు వచ్చిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ నేతృత్వంలోని కేంద్ర ఎన్నికల సంఘం బృందం మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయి లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో విడివిడిగా సమావేశమై అభిప్రాయ సేకరణ చేపట్టింది. దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ తీవ్రంగా ఉన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల బృందం హామీ ఇచ్చిందని విపక్షాలు తెలిపాయి.

కేంద్ర బలగాలను దింపాలి: బీజేపీ

మునుగోడు ఉపఎన్నికతోపాటు గత శాసన సభ ఎన్నికల అనుభవాల దృష్ట్యా ఈసారి అసెంబ్లీ ఎన్నికల కోసం పెద్ద సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించాలని బీజేపీ జాతీయ నేత ఓమ్ పాఠక్ నేతృత్వంలో ఆ పార్టీ నేతలు మర్రి శశిధర్‌రెడ్డి, ఆంథోనీరెడ్డి ఈసీ బృందాన్ని కలిసి విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల సీనియర్ అధికారులను భారీ స్థాయిలో ఎన్నికల పరిశీలకులుగా పంపాలని కోరారు. బీఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తప్పుడు పనులు చేయాలని అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ ఓటర్ల జాబితాలో తీవ్ర లోపాలున్నాయని, వాటన్నింటినీ సరిచేసి పకడ్బందీగా తుది జాబితాను ప్రకటించాలని కోరారు.

మద్యం షాపులు మూసేయిస్తే...

మద్యం పంపిణీని నియంత్రించడానికి ఎన్నికల సమయంలో వైన్ షాపులను మూసే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ సూచించింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు తమకు అనుకూలంగా వ్యవహరించే అధికారులను జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ప్రధానపోస్టుల్లో రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిందని కాంగ్రెస్ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి. శ్రీధర్‌బాబు, ఫిరోజ్‌ఖాన్, జూపల్లి కృష్ణారావు ఫిర్యాదు చేశారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన అధికారుల బదిలీలను మళ్లీ జరపాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ కోసం వచ్చిన వేలసంఖ్యలోని దరఖాస్తులను ఇంకా పరిష్కరించలేదని, ఈ నేపథ్యంలో తుది ఓటర్ల జాబితా ప్రచురణ గడువును అక్టోబర్ 4 నుంచి మరో తేదీకి పొడిగించాలన్నారు.

ప్రజల మధ్య విభజనకు మతఛాందసవాదుల కుట్ర: బీఆర్ఎస్

ఎన్నికల వేళ హైదరాబాద్ సహా రాష్ట్రంలో ప్రజల మధ్య విభజన తీసుకురావడానికి మతఛాందసవాదులు కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక శాంతిభద్రతల నిర్వహణ కేంద్ర ఎన్నికల సంఘం చేతిలోకి వెళ్లనున్న నేపథ్యంలో మతఛాందసవాదులను నియంత్రించాలని సీఈసీని కోరింది. పార్టీ నేతలు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ ఈసీ బృందానికి కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ఎన్నికల గుర్తు అయిన కారును పోలి ఉన్న రోడ్డురోలర్ గుర్తును ఓ పార్టీకి కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ గుర్తును ఫ్రీ సింబల్స్ జాబితా నుంచి తొలగించాలని కోరారు. కాగా, ఈ భేటీలో టీడీపీ నేతలు శ్రీపతి సతీష్‌కుమార్, కాసాని సతీష్, రాఘవేంద్ర ప్రతాప్, సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి, డీజీ నరసింహారావు, జ్యోతి, బీఎస్పీ నేతలు విజయార్య క్షత్రియ, రాజరత్నం, సురేష్‌కుమార్, ఆప్ నేతలు దిడ్డి సుధాకర్, రాములు గౌడ్, హేమ ఈసీ బృందానికి తమ సూచనలు తెలియజేశారు. అంతకుముందు ఢిల్లీ నుంచి మంగళవారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఈసీ బృందానికి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, పోలీసు అధికారులు స్వాగతం పలికారు.

దర్యాప్తు సంస్థలపై ఈసీ సీరియస్!

- డబ్బు, మద్యం పంపిణీని అరికట్టకపోతే స్వేచ్ఛగా ఎన్నికలు జరపలేమని వ్యాఖ్య
- 27 కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో సమావేశంలో అసహనం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల వైఫల్యంతోనే మునుగోడు ఉపఎన్నికలో భారీగా డబ్బు, మద్యం పంపిణీ జరిగిందని కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయినట్టు తెలిసింది. ఇలా అయితే రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాలకు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు ఎలా నిర్వహించాలని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిందని సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో దర్యాప్తు సంస్థలన్నీ సమన్వయంతో వ్యవహరిస్తేనే ఎన్నికల్లో అక్రమాలను నిర్మూలించగలమని స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌తోపాటు ఎన్నికల కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో కూడిన బృందం మంగళవారం హైదరాబాద్‌లో 27 కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఈ భేటీలో రాష్ట్ర పోలీసు, ఆబ్కారీ శాఖలపై ఈసీ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. గత ఎన్నికల్లో ఆబ్కారీ శాఖ పట్టుకున్న మద్యాన్నే పోలీసు శాఖ పట్టుకున్నట్టు చూపడంపట్ల అభ్యంతరం తెలిపింది. మద్యం, గంజాయి అక్రమ రవాణా నియంత్రణలో ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించింది.

ఇకపై గట్టి నిఘా పెట్టాలి: ఎన్నికల్లో డబ్బు పంపిణీ, ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ కట్టడికి గట్టి నిఘా పెట్టాలని ఐటీ శాఖ, స్టేట్ జీఎస్టీ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తదితర విభాగాలకు ఈసీ బృందం సూచించింది. డిజిటల్ లావాదేవీలను ఐటీ పరిధిలోకి తేవాలని...ఈ-వే బిల్లుల ఆధారంగా సరుకు రవాణాపై నిఘా పెట్టి కానుకల పంపిణీని అడ్డుకోవాలని, కాలం చెల్లిన వాహనాలు సీజ్ చేయాలని కోరింది. ఈ భేటీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌తోపాటు రాష్ట్ర పోలీసు శాఖ, కేంద్ర సాయుధ బలగాల నోడల్ అధికారి, ఆబ్కారీ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ, ఆర్బీఐ, కస్టమ్స్, ఎస్జీఎస్టీ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఎన్సీబీ, ఈడీ తదితర సంస్థల అధికారులు పాల్గొన్నారు.

మాదిగలకు 20 సీట్లను కేటాయించాలి: వంగపల్లి

జనగామ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు 20 సీట్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీట్ల కేటాయింపు విషయంలో సీఎం కేసీఆర్ మాదిగలకు ప్రాధాన్యతనిస్తూ పునరాలోచించాలని కోరారు. ఈనెల 5న తమ కార్యాచరణ ప్రకటించబోతున్నట్లు ప్రకటించారు. మాదిగల విషయంలో అన్ని పార్టీలు మోసపూరిత ధోరణి అవలంబిస్తున్నాయన్నారు. ప్రతి రాజకీయ పార్టీ మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలన్నారు.

ఉద్యమకారులకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

- వాళ్ల త్యాగాల ఫలితంగానే కేసీఆర్ కుటుంబీకులకు ఇప్పుడు పదవులు
- ఉద్యమ కారుల సంఘం మహాధర్నాలో వక్తల డిమాండ్


ఉద్యమకారుల మహాధర్నాలో మల్లురవి, ప్రవీణ్‌కుమార్, కోదండరామ్, జాజుల

ముషీరాబాద్: సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న పదవులు 1969 తొలి, మలి దశ ఉద్యమ కారుల త్యాగాల ఫలితంగానే వచ్చాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. 1969 తెలంగాణ ఉద్యమ కారులను తెలంగాణ సమర యోధులుగా గుర్తించి వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులను ఇచ్చి పెన్షన్ అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్ కోదండరాం, కాంగ్రెస్ నేత మల్లు రవి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బాలమల్లేశ్ హాజరై మద్దతు తెలిపారు. ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర సాధన కోసం అనేక మంది ప్రాణ త్యాగాలు చేస్తే కేసీఆర్ కుటుంబమే ఆ ఫలాలను అనుభవిస్తోందని, తెలంగాణ వస్తే ఉద్యమకారులకు సముచిత న్యాయం దక్కుతుందని ఆశిస్తే రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ప్రతి ఏడాదీ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ పెరుగుతూ వస్తోందని, బడ్జెట్ లో అదనంగా రూ.50కోట్ల నుంచి రూ.100 కోట్లు కేటాయిస్తే ఉద్యమకారులందరికీ పెన్షన్ ఇవ్వొచ్చన్నారు.

కేసీఆర్ గద్దె దిగాలి

ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజాస్వామిక పాలన రావాలంటే సీఎం కేసీఆర్ గద్దె దిగాలని, ఆ దిశగా ఉద్యమకారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని వ్యక్తులు మంత్రులుగా పదవులు అనుభవిస్తుంటే తెలంగాణ సాధన కోసం ఉద్యమాలు చేసిన వ్యక్తులు రోడ్లపైకి వచ్చి హక్కుల సాధన కోసం ధర్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే తెలంగాణ తొలిమలిదశ ఉద్యమకారులను గుర్తించి సముచిత న్యాయం కల్పిస్తామన్నారు.

8న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ

పంజగుట్ట (హైదరాబాద్): ముదిరాజ్ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 8న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు 'మన ముదిరాజ్ మహాసభ' అధ్యక్షుడు చొప్పరి శంకర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను ఉపాధ్యక్షుడు రాస వెంకట్, పిట్ల నగేశ్, ప్రధానకార్యదర్శి బి.కరుణాకర్, యువజన విభాగం అధ్యక్షుడు బి.రాజులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ముదిరాజ్ కులస్తులకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా ఇప్పటికే నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేశారని, చాలా గ్రామాల్లో బీఆర్ఎస్‌కు ఓటువేయకూడదని తీర్మానం చేశారని గుర్తుచేశారు. 2014, 18లో ముదిరాజ్ కులస్తుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ తమ కులాన్ని అణచివేస్తోందని ఆరోపించారు. సభకు ఈటల రాజేందర్, కాసాని జ్ఞానేశ్వర్, బండ ప్రకాశ్ ముదిరాజ్‌తో పాటు అన్ని పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్‌లు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మర్రెల సంతోశ్, ఆంజనేయులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ భవనం పైనుంచి దూకిన విద్యార్థిని

ఆస్పత్రికి తరలింపు..పరిస్థితి విషమం
సిద్దిపేట జిల్లాలో ఘటన


రక్షిత

మిరుదొడ్డి(దుబ్బాక): కేజీబీవీ విద్యాలయం భవనం పైనుంచి ఓ విద్యార్థిని దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా నిజాంపేట మండలం తిప్పన గుల్లకు చెందిన శ్యామల సహదేవ్ దంపతుల కూతురు రక్షిత మిరుదొడ్డి కస్తూర్బా బాలికల విద్యాలయంలో 8వ తరగతి చదువుతోంది. పండుగ సెలవుల తర్వాత ఇటీవల రక్షితను కేజీబీవీలో తల్లిదండ్రులు అప్పగించి వెళ్లారు. మంగళవారం తరగతి గదిలో తోటి విద్యార్థినిలతో చదువుకుంటున్న రక్షిత నోట్ బుక్స్ తెచ్చుకుంటానని క్లాస్ రూం నుంచి బయటకు వెళ్లింది. విద్యాలయం భవనం పైకి ఎక్కి అక్కడ్నుంచి దూకేసింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన టీచర్లు సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు సిద్దిపేట పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

లండన్‌లో హైదరాబాదీ దారుణ హత్య

- రయీసుద్దీన్, ఆయన స్నేహితుడిని కత్తితో పొడిచి దోచుకున్న దుండగులు
- ఘటనాస్థలిలోనే స్నేహితుడి దుర్మరణం.. చికిత్స పొందుతూ రయీసుద్దీన్ మృతి
- వారిని కాపాడేందుకు వెళ్లిన మరో భారతీయుడినీ హతమార్చిన దుండగులు
- రెండ్రోజుల్లో జరగనున్న కుమార్తె పెళ్లికి స్వదేశం రావాలనుకుంటుండగా ఘటన


రయీసుద్దీన్

సాక్షి, హైదరాబాద్: నగరంలోని మాసబ్‌ట్యాంక్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాజా రయీసుద్దీన్ (65) లండన్‌లో హత్యకు గురయ్యారు. అక్కడి వెస్ట్ యార్క్‌షైర్‌లోని హిల్‌టాప్ మౌంట్ లీడ్స్ వద్ద శనివారం చోటుచేసుకున్న ఈ దారుణం మంగళవారం వెలుగులోకి వచ్చింది. గురువారం (అక్టోబర్ 5) నగరంలో జరగనున్న తన కుమార్తె వివాహం కోసం రయీసుద్దీన్ స్వదేశం వచ్చే ప్రయత్నాల్లో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అఫ్గానిస్తాన్‌కు చెందిన స్నేహితుడితో కలసి రయీసుద్దీన్ షాపింగ్‌కు వెళ్లగా వారిని అడ్డగించిన కొందరు ఉగాండా జాతీయులు డబ్బివ్వాలని డిమాండ్ చేశారు. రయీసుద్దీన్, ఆయన స్నేహితుడు ప్రతిఘటించడంతో దుండగులు వారిపై కత్తితో దాడి చేసి సొత్తు, సొమ్ము దోచుకుపోయారు. ఈ దాడిలో రయీసుద్దీన్ తీవ్రంగా గాయపడగా ఆయన స్నేహితుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వారిని కాపాడేందుకు వచ్చిన మరో భారతీయుడు సైతం ఉగాండా జాతీయుల చేతిలో హతమైనట్లు సమాచారం. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రయీసుద్దీన్‌ను హెలికాప్టర్‌లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. 2011 నుంచి లండన్‌లో ఉంటున్న రయీసుద్దీన్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ కేసులో ఇద్దరు ఉగాండా జాతీయులను అరెస్టు చేశారు. రయీసుద్దీన్ మృతదేహాన్ని నగరానికి తీసుకురావాలని ఆయన కుటుంబీకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పదివేల మంది మహిళలతో 'జంగ్‌సైరన్'

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఓబీసీ మహిళా సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈనెల రెండో వారంలో పదివేల మంది మహిళలతో 'జంగ్‌సైరన్' పేరిట సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎన్సీపీ అధినేత కుమార్తె, ఎంపీ సుప్రియా సూలేను మంగళవారం నాగ్‌పూర్‌లోని ఆమె నివాసంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు కలిసి ఆహ్వానించారు. ఈ సదస్సుకు తప్పకుండా వస్తానని సుప్రియా సూలే హామీ ఇచ్చినట్లు జాజుల తెలిపారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ఎంపీలను, అఖిలపక్ష పార్టీలను, ఓబీసీ మహిళా బిల్లుకు మద్దతు తెలిపే జాతీయ నేతలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు సబ్ కోటా సాధించే దిశగా కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- అణువులు, పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల డైనమిక్స్‌పై అధ్యయనానికి ప్రతిష్టాత్మక బహుమతి
- 'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' ప్రకటన

స్టాక్‌హోమ్: భౌతిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురు శాస్త్రవేత్తలకు ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి లభించింది. 'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' మంగళవారం ఫిజిక్స్‌లో నోబెల్ ప్రైజ్ విజేతలను ప్రకటించింది. అమెరికాలోని ఒహాయో స్టేట్ యూనివర్సిటీకి చెందిన పియరీ అగోస్తినీ, జర్మనీలోని మాక్స్‌ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్వాంటమ్ ఆప్టిక్స్, లుడ్విగ్ మాక్సిమిలియన్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్‌కు చెందిన ఫెరెంక్ క్రౌజ్, స్వీడన్‌లోని లుండ్ యూనివర్సిటీకి చెందిన అన్నె ఎల్ హుయిలర్‌ను ఈ బహుమతి వరించింది. అణువులు, పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల డైనమిక్స్‌ను అధ్యయనం చేయడంతోపాటు కాంతికి సంబంధించిన అట్టోసెకను పల్స్‌లను గుర్తించే విధానాలను అభివృద్ధి చేసినందుకు వీరికి ఈ నోబెల్ ప్రైజ్ అందజేస్తున్నట్లు ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. వీరి పరిశోధనల ఫలితంగా అణువులు, పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల కదలికలను అధ్యయనం చేయడానికి మానవళికి కొత్త ఉపకరణాలు అందాయని తెలియజేసింది. ఇదిలా ఉండగా, భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గెలుచుకున్న ఐదో మహిళగా ఎల్ హుయిలర్ రికార్డు సృష్టించారు. తనకు నోబెల్ ప్రైజ్‌ను ప్రకటించడాన్ని ఇంకా నమ్మలేకపోతున్నానని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. 2022లో కూడా భౌతిక శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు ఉమ్మడిగా నోబెల్ బహుమతి లభించింది. రసాయన శాస్త్రంలో నోబెల్ విజేతను బుధవారం ప్రకటించనున్నారు.

ఎలక్ట్రాన్ల ప్రపంచానికి కొత్త 'కాంతి పుంజం'

24 ఫ్రేమ్స్ గురించి మీరు వినే ఉంటారు. సెకనుకు ఇరవై నాలుగు ఫ్రేమ్‌ల చొప్పున రీలు తిరిగితే తెరపై బొమ్మ, ఆట, పాట, మాట అన్నీ సవ్యంగా కనిపిస్తాయి! సినిమాకైతే ఇలా ఓకే కానీ పరమాణువుల్లోని ఎలక్ట్రాన్లను చూడాలనుకోండి లేదా వాటి కదలికలను అర్థం చేసుకోవాలనుకోండి. అస్సలు సాధ్యం కాదు! ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేయడంలో కీలకపాత్ర పోషించారు కాబట్టే పియరీ అగోస్తినీ, ఫెరెంక్ క్రౌజ్, అనే ఎల్ హుయిలర్ చేసిన ప్రయోగాలకు ఈ ఏటి భౌతికశాస్త్ర నోబెల్ బహుమతి లభించింది. ఇంతకీ ఏమిటీ ప్రయోగాలు? వాటి ప్రయోజనాలేమిటి?

అట్టోసెకను ఫిజిక్స్

ఒక సెకను కాలంలో కాంతి ఎంత దూరం ప్రయాణిస్తుందో మీకు తెలుసా? మూడు లక్షల కిలోమీటర్లకు పిసరంత తక్కువ. మరి అట్టోసెకను కాలంలో? సెకను.. అర సెకను.. పావు సెకను తెలుసు కానీ ఈ అట్టోసెకను ఏమిటి? 3,711 కోట్ల సంవత్సరాల కాలంలో ఒక సెకను ఎంతో సెకనులో అట్టోసెకను అంతన్నమాట! ఇంకోలా చెప్పాలంటే.. టెన్ టు ద పవర్ ఆఫ్ మైనస్ 18. గందరగోళం లేకుండా ఉండాలని అనుకుంటే.. సూక్ష్మాతి సూక్ష్మమైన కాలావధి అని అనుకుందాం. ఇంత తక్కువ సమయంలోనూ కాంతి 0.3 మైక్రోమీటర్లు లేదా ఒక వైరస్ పొడవు అంత దూరం ప్రయాణించగలదు. ఈ సంవత్సరం భౌతికశాస్త్ర నోబెల్ ప్రైజ్ గ్రహీతలు ఇంత సూక్ష్మస్థాయిలో కాంతి పుంజాలను విడుదల చేయగల టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించారు. ముందుగా చెప్పుకున్నట్లు ఎలక్ట్రాన్ల కదలికలు, కాంతికి, పదార్థానికి మధ్య ఉన్న సంబంధాలను అర్థం చేసుకునేందుకు ఈ అట్టోసెకను ఫిజిక్స్ చాలా ఉపయోగపడుతుంది. అంతేకాదు.. వీరి ప్రయోగాల పుణ్యమా అని అణువులు, పరమాణువుల లోపలి కణాలను మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకునేందుకు ఆస్కారం ఏర్పడింది.


భర్త, కుమారునితో కలిసి సంబరాలు చేసుకుంటున్న శాస్త్రవేత్త హుయిలర్

1987లో శ్రీకారం

అట్టోసెకను కాలపు కాంతి పుంజాలతో ఫొటోలు తీస్తే అణువులు, పరమాణువుల్లో జరిగే కార్యకలాపాలేమిటన్నది స్పష్టంగా తెలుస్తాయి. ఈ అట్టోసెకను కాంతి పుంజాల తయారీకి 1987లో స్వీడన్‌కు చెందిన ఎల్ హుయిలర్ శ్రీకారం చుట్టారని చెప్పాలి. అప్పట్లో ఈ శాస్త్రవేత్త జడ వాయువు గుండా పరారుణ కాంతిని ప్రసారం చేసినప్పుడు వేర్వేరు ఛాయలున్న రంగులు బయటకొస్తున్నట్లు గుర్తించారు. ఒక్కో ఛాయ పరారుణ కాంతి జడ వాయువులోని పరమాణువులతో జరిపిన పరస్పర చర్యల ఫలితం. కొన్ని ఎలక్ట్రాన్లు ఈ లేజర్ కిరణాల ద్వారా అదనపు శక్తి పొంది దాన్ని విడుదల చేస్తూంటాయి అన్నమాట. ఈ అంశంపై ఎల్ హుయిలర్ తన ప్రయోగాలు కొనసాగించగా ఆ తరువాతి కాలంలో అనేక కీలకమైన ఫలితాలు లభించాయి.

కాంతి పుంజాల విశ్లేషణ

2001లో అమెరికాకు చెందిన పియరీ అగోస్తినీ ఈ అట్టోసెకను కాంతి పుంజాలను ఉత్పత్తి చేయడం మాత్రమే కాకుండా సుమారు 250 అట్టోసెకన్ల కాలం ఉండే కాంతి పుంజాలను విశ్లేషించడంలోనూ విజయం సాధించారు. ఈ కాలంలోనే జర్మనీకి చెందిన ఫెరెంక్ క్రౌజ్ కూడా ఈ అట్టోసెకను కాంతి పుంజాలపై పరిశోధనలు చేస్తూండేవారు. కాకపోతే ఈయన 650 అట్టోసెకన్ల కాలపు కాంతి పుంజాన్ని వేరు చేయడంలో విజయవంతం కావడం గమనార్హం. ఒకప్పుడు అసాధ్యం అని అనుకున్న ప్రాసెస్‌లను కూడా గమనించడం ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగాల వల్ల ఇప్పుడు వీలైంది. ''ఎలక్ట్రాన్ల ప్రపంచానికి ఈ ప్రయోగాలు తలుపులు తెరిచాయి. అట్టోసెకన్ ఫిజిక్స్ ద్వారా ఎలక్ట్రాన్లలో జరుగుతున్న కార్యకలాపాలను గమనించడం వీలైంది. ఇకపై ఈ విషయాలను వాడుకోవడం ఎలా? అన్నది మొదలవుతుంది'' అని నోబెల్ అవార్డు భౌతిక శాస్త్ర కమిటీ అధ్యక్షులు ఎవా ఓల్సన్ వ్యాఖ్యానించడం విశేషం.

వ్యాధుల నిర్ధారణలోనూ ఉపయోగకరం

ఈ అట్టోసెకను ఫిజిక్స్‌ను ఎలక్ట్రానిక్స్‌లో సమర్థంగా ఉపయోగించుకునేందుకు అవకాశముంది. ఎలక్ట్రాన్లు ఏ రకమైన పదార్థంతో ఎలా ప్రవర్తిస్తుందో తెలుసుకోగలిగితే.. అతితక్కువ విద్యుత్తును ఉపయోగించుకుని మరింత సమర్థంగా పనిచేయగల ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేయడం వీలవుతుంది. ఎలక్ట్రాన్ల ప్రవాహాన్నే మనం విద్యుత్తు అంటామన్నది తెలిసిందే. వేర్వేరు మూలకాలను గుర్తించేందుకు అట్టోసెకను కాంతి పుంజాలు ఉపయోగపడతాయి కాబట్టి.. భవిష్యత్తులో వ్యాధుల నిర్ధారణకు కూడా వీటిని వాడుకోవడం వీలవుతుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

మ్యూనిచ్‌లో ఓ సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఫెరెంక్ క్రౌజ్



మీడియాతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త పియరీ అగోస్తినీ



సెకను కంటే తక్కువ సమయాన్ని ఇలా సూచిస్తారు

- సెకనులో వెయ్యో వంతు... ఒక మిల్లీ సెకను
- మిల్లీ సెకనులో వెయ్యో వంతు.. ఒక మైక్రో సెకను
- ఒక మైక్రో సెకనులో వెయ్యో వంతు... ఒక నానో సెకను
- ఒక నానో సెకనులో వెయ్యో వంతు.. ఒక పికో సెకను
- ఒక పికో సెకనులో వెయ్యో వంతు.. ఒక ఫెమ్టో సెకను (లాసిక్ కంటి శస్త్రచికిత్సల్లో ఈ స్థాయి లేజర్ కిరణాలను వాడతారు)
- ఒక ఫెమ్టో సెకనులో వెయ్యో వంతు.. ఒక అట్టో సెకను

మెక్సికోలో కూలిన చర్చి పైకప్పు.. 11 మంది మృతి

మెక్సికో: మెక్సికోలోని సియూడడ్ మాడెరో పట్టణంలో శాంతాక్రజ్ చర్చిలో పైకప్పు కూలిపోయిన దుర్ఘటనలో 11 మంది మరణించారు. పట్టణానికి చెందిన మోనికా సెగురా మేనల్లుడు ఏడాది వయసున్న పిల్లాడికి బాప్టిజం కార్యక్రమం నిర్వహించడానికి వచ్చినప్పుడు ఈ ఘటన జరిగింది. మోనికా కుటుంబసభ్యులు, బంధువులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. హఠాత్తుగా పైకప్పు కూలి కింద పడడంతో ఆమె కుటుంబానికి చెందినవారే 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన వారు కిటికీ అద్దాలు బద్దలు కొట్టుకొని ప్రాణాలతో బయటపడ్డారు. నిర్మాణంలో లోపాల కారణంగానే చర్చి పైకప్పు కూలినట్టుగా రాష్ట్ర భద్రతా కార్యాలయం తెలిపింది. పైకప్పు కూలిపోయిన సమయంలో సామూహిక బాప్టిజం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టుగా చర్చి ఫాదర్ ఏంజెల్ వర్గాస్ చెప్పారు. దీంతో అక్కడే చాలా మంది ఉండడంతో అందరిపైన సిమెంట్ పెళ్లలు విరిగిపడ్డాయని వివరించారు.

రామ సేతు 'జాతీయ స్మారకం' పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: తమిళనాడు తీరప్రాంతం, వాయవ్య శ్రీలంకలోని మన్నార్ ద్వీపం మధ్య ఉన్న పురాతన సున్నపురాళ్ల 'రామసేతు'ను జాతీయ స్మారకంగా ప్రకటించాలంటూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను కోర్టు మంగళవారం తిరస్కరించింది. ' ఇది పరిపాలనా వ్యవహారం. ఇందులో కోర్టు ఏమీ చేయలేదు' అంటూ జస్టిస్ సంజయ్ కౌల్, జస్టిస్ సుధాంషు ధులియాల ధర్మాసనం పిల్‌ను తిరస్కరించింది. హిందూ పర్సనల్ లా బోర్డ్ తరపున సంస్థ అధ్యక్షుడు అశోక్ పాండే ఈ పిటిషన్ వేశారు. జాతీయ వారసత్వ స్మారకంగా ప్రకటించాలంటూ బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి వేసిన పిటిషన్‌తో తన పిటిషన్‌ను జత చేయాలని పాండే విజ్ఞప్తి చేశారు. ' సుబ్రహ్మణ్య స్వామి వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉంటే ఉండనివ్వండి. అది అలాగే ఉంటుంది' అంటూ పాండే పిటిషన్‌ను ధర్మాసనం కొట్టేసింది.


పాదరక్షలు భద్రపరిచే గదిలో సేవ చేస్తున్న రాహుల్ గాంధీ

స్వర్ణదేవాలయంలో రాహుల్ సేవలు

అమృత్‌సర్: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయాన్ని వరసగా రెండో రోజు మంగళవారం సందర్శించారు. లంగర్‌లో అందరితో కలిసి సామాన్యుడిలా కింద కూర్చొని ముచ్చట్లు చెబుతూ కూరలు తరిగారు. ఆ తర్వాత గిన్నెలు కూడా తోమారు. తలకి నీలిరంగు తలపాగా చుట్టుకున్న రాహుల్ గాంధీ ఆలయానికి వచ్చిన భక్తులకి అన్నప్రసాదాన్ని కూడా వడ్డించారు. తర్వాత తాను కూడా నేల మీద కూర్చొని భోజనం చేశారు. కమ్యూనిటీ కిచెన్‌లోనే రాహుల్ గాంధీ ఎక్కువ సేపు ఉన్నారు. కీర్తనలు వింటూ కాసేపు కాలం గడిపారు.

హిందువులను విభజించే కుట్ర

- కాంగ్రెస్ కుల గణన డిమాండ్‌పై మోదీ నిప్పులు
- ఆ పార్టీ విదేశాలతో చేతులు కలిపిందంటూ ఆరోపణ
- ముస్లింల హక్కులను తగ్గించాలనుకుంటోందా అని ప్రశ్న

జగ్దల్‌పూర్: జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. ఆ వంకతో హిందువులను విభజించేందుకు, తద్వారా దేశాన్ని నాశనం చేసేందుకు ఆ పార్టీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. 'కుల గణన చేపట్టి జనాభా ఆధారంగా వనరులను పంచాలనడంలో కాంగ్రెస్ ఉద్దేశం ఏమిటి తద్వారా ముస్లింలు, మైనారిటీల హక్కులను తగ్గించాలనుకుంటోందా? దేశంలో ఎవరి జనాభా ఎక్కువగా ఉంది? అత్యధిక జనాభాగా ఉన్న హిందువులే ముందుకొచ్చి హక్కులన్నీ తమకే కావాలని డిమాండ్ చేయాలా? కాంగ్రెస్ ఆశిస్తున్నదేమిటి?' అని మండిపడ్డారు. 'పేదలే నా తొలి ప్రాథమ్యం. కుల మతాలతో నిమిత్తం లేకుండా వనరులపై తొలి హక్కు వారికే చెందాలన్నది నా అభిమతం. కానీ కాంగ్రెస్ మాత్రం కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం కులం, మతం ఆధారంగా సమాజాన్ని విడదీయాలని చూస్తోంది' అని దుయ్యబట్టారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం జగ్దల్‌పూర్‌లో పరివర్తన్ మహా సంకల్ప ర్యాలీలో మోదీ మాట్లాడారు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ తాజాగా కుల గణన వివరాలు వెల్లడించడం, దాన్ని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అభినందించడం తెలిసిందే. అంతేగాక ప్రజలకు జనాభాలో వారి శాతానికి అనుగుణమైన నిష్పత్తిలో హక్కులు కల్పించేందుకు వీలుగా దేశమంతా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

కాంగ్రెస్‌తో జాగ్రత్త

కాంగ్రెస్ పార్టీ ఒక విదేశంతో రహస్య ఒప్పందం కుదుర్చుకుందని ఈ సందర్భంగా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేయడంలో చాలా ఆనందం పొందుతోందన్నారు. 'దేశంలోకెల్లా అతి పురాతన పార్టీ అయిన కాంగ్రెస్‌ను దాని నాయకులు కాకుండా, దేశ



వ్యతిరేక గ్రూపులతో చేతులు కలిపిన తెర వెనక శక్తులు నడుపుతున్నాయి. అందుకే ఆ పార్టీతో జాగ్రత్తగా ఉండాలి' అని ప్రజలను హెచ్చరించారు. దేశానికి కాంగ్రెస్ కేవలం పేదరికం మాత్రమే ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కుటుంబ స్వామ్యంగా, అవినీతికి మార్గంగా మార్చిన ఘనత ఆ పార్టీదేనన్నారు. 2014కు ముందు కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ పాలనలో ఎంతెంత పెద్ద కుంభకోణాలు జరిగాయో తెలుసుకోవాలని కొత్త ఓటర్లకు సూచించారు. అవినీతిలో, నేరాల్లో కాంగ్రెస్ పాలిత రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ పోటీ పడుతున్నాయని ఎద్దేవా చేశారు.

కింది స్థాయి నుంచి ప్రగతి...

భారత్ అభివృద్ధి చెందాలన్న అందరి స్వప్నం సాకారం కావాలంటే గ్రామాలు, జిల్లాలు, రాష్ట్రాలు పూర్తిగా ప్రగతి సాధించినప్పుడే సాధ్యమని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. దేశం అభివృద్ధి చెందాలంటే భౌతిక, డిజిటల్, సామాజిక తదితర మౌలిక వనరులన్నీ భావి అవసరాలకు అనుగుణంగా రూపొందాల్సి ఉందన్నారు. అందుకే మౌలిక సదుపాయాలకు కేటాయింపులను తాజా బడ్జెట్‌లో బాగా పెంచి ఏకంగా రూ.10 లక్షల కోట్లకు చేర్చామన్నారు. ఉక్కు ఉత్పత్తిలో దేశాన్ని ఆత్మ నిర్భర్‌గా మార్చేందుకు గత తొమ్మిదేళ్లలో పలు చర్యలు తీసుకున్నట్టు వివరించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో రూ.27,000 కోట్ల పైచిలుకు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. జగ్దల్‌పూర్ లో ఎన్ఎండీసీ ప్లాంటును జాతికి అంకితం చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ఈ ప్లాంటు పరిసర జిల్లాల్లో కనీసం 50 వేల మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాలను మరింత మెరుగు పరచాలన్నదే తన ఉద్దేశమన్నారు. అందుకు కేంద్రం ఎన్నో చర్యలు చేపడుతోందని చెప్పారు.

'న్యూస్‌క్లిక్'లో పోలీసుల సోదాలు

- 100 ప్రాంతాల్లో 500 మంది ఢిల్లీ పోలీసుల తనిఖీలు
- సంస్థ సిబ్బంది, జర్నలిస్టుల ఇళ్లలోనూ.. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, ఇతర ఉపకరణాల స్వాధీనం
- న్యూస్‌క్లిక్ ఎడిటర్–ఇన్–చీఫ్ అరెస్ట్

న్యూఢిల్లీ: చైనా అనుకూల సమాచారాన్ని భారత్‌లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు భారీ స్థాయిలో నగదును స్వీకరించిందన్న ఆరోపణలపై ఆన్‌లైన్ న్యూస్‌పోర్టల్ 'న్యూస్‌క్లిక్'పై ఢిల్లీ పోలీసులు ఆకస్మిక సోదాలు చేపట్టారు. సంస్థకు సంబంధించిన ఆఫీసులతోపాటు అందులో పనిచేసే జర్నలిస్టులు, సిబ్బందికి సంబంధించిన ఇళ్లలోనూ పోలీసులు విస్తృతస్థాయిలో తనిఖీలు చేపట్టారు. న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకులు, ఎడిటర్–ఇన్–చీఫ్ ప్రబీర్ పుర్‌కాయస్థా, హెచ్ఆర్ చీఫ్ అమిత్ చక్రవర్తిని మొదట ప్రశ్నించిన పోలీసులు ఆ తర్వాత ఇద్దరినీ అరెస్ట్‌చేశారు. 100 ప్రాంతాల్లో ఏకంగా 500 మంది ఢిల్లీ పోలీసులు ఒకేసమయంలో దాడిచేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్, ముంబైలలో ఈ సోదాలు జరిగాయి. సోదాలు చేయాల్సిన వ్యక్తులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. ఏ కేటగిరీలో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు వార్తలొచ్చాయి. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి చెందిన ఢిల్లీలోని నివాసంలోనూ సోదాలు జరిగాయి. ఆయనకు సహాయకునిగా ఉండే శ్రీనారాయణ్ కుమారుడు సుమిత్ ఇదే న్యూస్‌క్లిక్‌లో పనిచేస్తుండటంతో ఏచూరీ ఇంట్లోనూ పోలీసు తనిఖీలు కొనసాగాయి. దీంతో ఏచూరి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీలోని సంస్థ ముఖ్య కార్యాలయంలోని వారిని ప్రశ్నించాక ఆ ఆఫీస్‌కు పోలీసులు సీలువేశారు. విదేశీ ప్రయాణాలు, పౌరసత్వ(సవరణ) చట్టంపై షాహీన్‌బాగ్ వద్ద చెలరేగిన ఆందోళనలు, రైతుల ఉద్యమాలు తదితరాలపై జర్నలిస్టులను 25 అంశాలపై ప్రశ్నించామని పోలీసులు వెల్లడించారు. న్యూస్‌క్లిక్‌కు నిధులు ఎలా వస్తున్నాయనే కోణంలో గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ న్యూస్‌క్లిక్ కార్యాలయాల్లో సోదాలు చేయడం తెల్సిందే. ఈ విషయంలో ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు అందించిన సమాచారంతోనే మంగళవారం ఢిల్లీ పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం, నేరమయ కుట్ర సెక్షన్ల కింద కొత్తగా కేసు నమోదుచేసి దాడులు చేశారు. ఈ సందర్భంగా పలువురి నుంచి ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, హార్డ్ డిస్క్‌లు, ఫ్లాష్ డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆగస్ట్ 17న అత్యంత కఠిన ఉగ్రవ్యతిరేక చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక)చట్టం కింద నమోదైన కేసు ఆధారంగానే కొత్తను నమోదుచేసి దర్యాప్తు వేగవంతం చేశారు. చైనాతో సంబంధం ఉన్న కొన్ని సంస్థల నుంచి గత మూడేళ్లకాలంలో రూ.38.05 కోట్ల నగదు న్యూస్‌క్లిక్ పోర్టల్‌కు ముట్టిందని ఈడీ ఆరోపిస్తోంది. ఈ నగదులో కొంత మొత్తం పాత్రికేయులు గౌతమ్ నవ్‌లఖా, తీస్తా సీతల్వాడ్‌లకు చేరినట్లు ఆరోపిస్తోంది.


పుర్‌కాయస్థను ఢిల్లీ పోలీస్ ఆఫీస్‌కు తీసుకొస్తున్న దృశ్యం

విపక్షాల తీవ్ర విమర్శలు

మీడియా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతున్నారంటూ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, సమాజ్‌వాదీ సహా పలు విపక్ష పార్టీలు ప్రభుత్వ తీరును తూర్పారబట్టాయి. ఎడిటర్స్ గిల్డ్, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాసహా పలు మీడియా సంఘాలు పోలీసు దాడులను ఖండించాయి. మోదీ సర్కార్‌ను విమర్శించే పాత్రికేయులపై ప్రభుత్వం కత్తిగట్టిందని ఆక్షేపించాయి.

10లోగా దౌత్యవేత్తల సంఖ్యను తగ్గించండి

కెనడాకు భారత్ అల్టిమేటమ్

న్యూఢిల్లీ: భారత్, కెనడాల మధ్య ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ నిజ్జర్ హత్య చిచ్చు ఇంకా రగులుతోంది. భారత్‌లో ఉన్న దౌత్యవేత్తల సంఖ్యను తగ్గించాలని కెనడా హైకమిషనరేట్‌కు భారత్ అల్టిమేటమ్ జారీ చేసింది. భారత్‌లో ఉన్న 41 మంది దౌత్యవేత్తల్ని వెనక్కి తీసుకువెళ్లాలని వార్నింగ్ ఇచ్చిన భారత్ ఈ నెల 10 వరకు గడువు విధించినట్టు విశ్వసనీయమైన వర్గాల సమాచారం. దౌత్య సిబ్బంది సంఖ్య విషయంలో సమానత్వం ఉండాలని భారత్ ఎప్పట్నుంచో వాదిస్తోంది. నిజ్జర్ హత్య వెనుక భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం భారత్‌లో కెనడాకు చెందిన 62 మంది దౌత్యవేత్తలు ఉన్నారు. అందులో 41 మందిని తగ్గించాలంటూ కెనడా రాయబార కార్యాలయానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసినట్టుగా జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఒకవేళ గడువులోగా దౌత్యవేత్తల్ని వెనక్కి పిలవకపోతే వారికి రక్షణ కల్పించలేమని కూడా ప్రభుత్వం తెగేసి చెప్పినట్టుగా సమాచారం.

విక్రమ్ ల్యాండర్ మళ్లీ గెంతింది



న్యూఢిల్లీ: చంద్రుడి ఉపరితలంపై 14 రోజులపాటు గడ్డకట్టే చలిలో గడిపిన విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు ఇక శాశ్వత నిద్రలోకి జారుకుంటున్నాయని భావిస్తున్న వేళ ఇస్రో తాజాగా మరో ప్రయోగం విజయవంతంగా చేపట్టింది. విక్రమ్ ల్యాండర్‌లోని ఇంజన్లను మండించి కాస్తంత ఎత్తుకు ఎగిరేలా చేసి పక్కన దిగేలా చేశారు. భవిష్యత్తులో చంద్రుడిపై సేకరించే మట్టి, ఇతరత్రా శాంపిళ్లను తిరిగి భూమి మీదకు తేవడానికి అక్కడి నుంచి వ్యోమనౌక టేకాఫ్ కావడం ముఖ్యం. అందులోభాగంగా సంబంధిత ప్రయోగాన్ని విక్రమ్ ల్యాండర్‌తో చేశారు. ప్రస్తుతం అది ఉన్న శివశక్తి పాయింట్ నుంచి 40 సెంటీమీటర్లు ఎత్తుకు ఎగిరి తర్వాత 30 సెంటీమీటర్ల పక్కకు జరిగి సురక్షితంగా ల్యాండ్ అయింది. 'ఈ హాప్ ప్రక్రియ ముందుగా మా ప్లాన్‌లో లేదు. షెడ్యూల్‌లో లేకపోయినా ప్రయోగాత్మకంగా చేసి చూశాం. విజయం సాధించాం' అని చంద్రయాన్-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వీరముత్తువేల్ మీడియాకు వెల్లడించారు. చంద్రుడి దక్షిణ ధ్రువంలో పూర్తిగా చిమ్మచీకటి, మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే 14 రోజుల చంద్ర రాత్రి(లూనార్ నైట్) నుంచి మేలుకుని మళ్లీ కీలక ప్రయోగాలకు విక్రమ్, ప్రజ్ఞాన్‌లు సిద్ధం కాబోవనే సూచనలు కనిపిస్తున్నాయి. లూనార్ నైట్ ముగిసి సూర్యకాంతి ప్రసరించి ఇన్ని రోజులైనా ల్యాండర్, రోవర్ నుంచి ప్రతిస్పందనలు లేవు.

అంతరిక్షంలో చెత్త వదిలినందుకు రూ.1.24 కోట్ల జరిమానా

వాషింగ్టన్: అంతరిక్షంలో చెత్తను వదిలేసినందుకు డిష్ నెట్‌వర్క్ కంపెనీకి అమెరికా ప్రభుత్వానికి చెందిన ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్(ఎఫ్‌సీసీ) 1,50,000 డాలర్ల(రూ.1.24 కోట్లు) జరిమానా విధించింది. అంతరిక్షంలో ప్రమాదకరమైన చెత్త వదిలినందుకు ఇలా జరిమానా విధించడం అమెరికాలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. డిష్ నెట్‌వర్క్ కంపెనీ 2002లో ఎకోస్టార్-7 అనే ఉపగ్రహాన్ని ప్రయోగించింది. భూమి నుంచి 36,000 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలోకి చేరుకున్న ఈ ఉపగ్రహం కాలపరిమితి 2022లో ముగిసింది. నిరుపయోగంగా మారిన ఉపగ్రహాన్ని కక్ష్య నుంచి 299 కిలోమీటర్ల దూరం పంపించాల్సి ఉంది. 122 కిలోమీటర్లు వెళ్లాక ఇంధనం నిండుకోవడంతో అక్కడే ఆగిపోయింది. ప్రస్తుతం భూమిచుట్టూ పరిభ్రమిస్తోంది. ఇతర ఉపగ్రహాలకు ప్రమాదకరంగా మారింది. అంతరిక్షంలో కాలం చెల్లిన ఉపగ్రహాలను చెత్తగానే పరిగణిస్తారు. 1957 నుంచి ఇప్పటిదాకా 10 వేలకుపైగా శాటిలైట్లను అంతరిక్షంలోకి ప్రయోగించారు. వీటిలో సగం శాటిలైట్లు పనిచేయడం లేదు.

బ్రిటన్ వీసాల ఫీజు పెంపు నేటి నుంచే..



లండన్: బ్రిటన్ ఇటీవల ప్రకటించిన విద్యార్థి, పర్యాటక తదితర అన్ని వీసా ఫీజుల పెంపు నిర్ణయం బుధవారం నుంచే అమల్లోకి రానుంది. ఇక విద్యార్థి వీసా ఫీజు మరో 127 పౌండ్లు, ఆర్నెల్ల లోపు పర్యాటక వీసా మరో 15 పౌండ్ల చొప్పున పెరగనున్నాయి. పెంపుతో బ్రిటనేతరుల విద్యార్థి వీసా ఫీజు 490 పౌండ్లకు, పర్యాటక వీసా ఫీజు 115 పౌండ్లకు చేరాయి. కీలకమైన ప్రజా సేవలు తదితరాలకు నిధుల సేకరణ కోసం వీసా ఫీజులు పెంచాల్సి వచ్చిందని హోంశాఖ తెలిపింది. ఇది సరైన నిర్ణయమేనని పేర్కొంది.

ఢిల్లీలో భూప్రకంపనలు

న్యూఢిల్లీ: నేపాల్‌లో వరసగా నాలుగుసార్లు సంభవించిన భూకంపాల ప్రభావం ఉత్తర భారతాన్ని వణికించింది. ఢిల్లీలో భూ ప్రకంపనల ధాటికి ప్రజలు బెంబేలెత్తిపోయారు. ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకి పరుగులు తీశారు. నేపాల్‌లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.19 గంటల మధ్య నాలుగు సార్లు భూకంపం వచ్చింది. రిక్టర్ స్కేలుపై 6.2 వరకు తీవ్రత నమోదైంది. ఈ భూకంపం ధాటికి పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఉత్తరాఖండ్‌లో జోషి మఠ్ నుంచి 206 కి.మీ. దూరంలో నేపాల్‌లో సంభవించిన భూకంపం ప్రభావం ఢిల్లీతో సహా ఉత్తర భారతంపై పడింది. భూ ప్రకంపనల ధాటికి ఇళ్లు ఊగడంతో ప్రజలు ప్రాణభయంతో బయటకి పరుగులు తీశారు. ఎత్తైన భవనాల్లో ఉన్న వారు భయాందోళనలకు లోనుకాకుండా వెంటనే బయటకు రావాలని ఢిల్లీ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. చండీగఢ్, జైపూర్, ఉత్తర భారతంలో కొన్ని ప్రాంతాల్లో కూడా భూ ప్రకంపనలు ప్రజల్ని భయపెట్టాయి.

వివేక్ రామస్వామి పిల్లలకు ఆయా కావాలి

26 వారాలకు వేతనం రూ.80 లక్షల పైమాటే..



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్న రిపబ్లికన్ పార్టీ నేత, భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి ఒక మంచి ఆయా(నానీ) కోసం చూస్తున్నారు. ఆయనకు భార్య అపూర్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు చిన్నపిల్లలు. దగ్గరుండి వారి ఆలనాపాలనా చూసుకోవడానికి ఆయాను నియమించుకోవడానికి వివేక్ రామస్వామి ప్రయత్నిస్తున్నారు. రిక్రూట్‌మెంట్ స్టాఫింగ్ వెబ్‌సైట్ 'ఎస్టేట్‌జాబ్స్.కామ్'లో ఈ మేరకు ఒక ప్రకటన ఇచ్చారు. ఆయాకు 26 వారాల పనికి లక్ష డాలర్ల (రూ.80 లక్షలకుపైగానే) వేతనం ఆఫర్ చేశారు. ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తామని తెలిపారు. వివేక్ రామస్వామి పిల్లల సంరక్షణ కోసం వారానికి 84 నుంచి 96 గంటలపాటు పనిచేయాల్సి ఉంటుంది. వారాంతపు సెలవు తీసుకోవచ్చు. అంతా అనుకున్నట్లుగా జరిగితే అమెరికా ఎన్నికల ప్రచారంలో వివేక్ రామస్వామి బిజీగా మారబోతున్నారు. పిల్లల కోసం ఎక్కువ సమయం కేటాయించలేకపోవచ్చు. అందుకే ఆయాను నియమించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

శాఖాహారం వద్దు అన్నందుకు రూ.10 వేల శిక్ష

ముంబై: ఈ ఆరు టేబుళ్లపై శాఖాహారమే ఉంటుంది అంటూ మెస్ కౌన్సిల్ చేసిన ప్రతిపాదనను వ్యతిరేకించిన ఒక విద్యార్థికి రూ.10వేల అపరాధ రుసుం శిక్ష పడింది. ఘటన తాలూకు పూర్వాపరాలు ఓ సారి చూద్దాం. కేవలం శాఖాహారం తినే తమ విద్యార్థుల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బాంబే(ఐఐటీ బాంబే) మెస్ కౌన్సిల్ వారు 12, 13, 14వ నంబర్ హాస్టళ్లలో విడిగా టేబుల్స్ వేశారు. ఆరు టేబుళ్లు వేసి 'ఈ ఆరు టేబుళ్లు వెజిటేరియన్లకు మాత్రమే' అని బోర్డు పెట్టారు. దీనిని కొందరు మాంసాహార ప్రియులు వ్యతిరేకించారు. శాంతియుత నిరసన కార్యక్రమం అంటూ అవే టేబుళ్లపై మాంసాహారం భుజించి నానా రభస చేశారు. ఉద్దేశపూర్వకంగా కొందరు ఇలా ఇన్‌స్టిట్యూట్‌లో ప్రశాంత వాతావరణాన్ని ఉద్రిక్తంగా మార్చారని మెస్ కౌన్సిల్ అంతర్గత పరిశీలనలో బయటపడింది. ఇందుకు బాధ్యుల్లో ఒకరికి రూ.10వేల శిక్ష వేసింది. మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉంది.

థాయ్ మాల్‌లో కాల్పులు.. ఇద్దరు మృతి

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో అతి పెద్ద షాపింగ్‌మాల్‌లో కాల్పులు అందరినీ ఉలిక్కిపడేలా చేశాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించారు. బ్యాంకాక్‌లో సియామ్ పారగాన్ షాపింగ్ మాల్‌లో ఒక మైనర్ బాలుడు తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ఇద్దరు పర్యాటకులు మరణించారు. చైనా నుంచి వచ్చిన ఒక పర్యాటకుడు, మయన్మార్ నుంచి వచ్చిన మరొకరు ప్రాణాలు కోల్పోయినట్టుగా పోలీసు చీఫ్ తొర్సాక్ సుక్విమాల్ వెల్లడించారు. మాల్‌లో కాల్పుల శబ్దం వినిపించగానే మాల్ నిర్వాహకులు అలారం మోగించడంతో షాపింగ్ చేయడానికి వచ్చిన వారంతా బయటకు పరుగులు తీయడం, ఆ మాల్ లోపల అల్మారాల వెనుక దాక్కోవడం చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కాల్పులు జరిపినది 14 ఏళ్ల టీనేజర్ అని తేల్చారు. పొడవైన జుట్టుతో, కళ్లద్దాలు పెట్టుకొని, తలపై పెట్టుకున్న టోపీకి అమెరికా జాతీయ పతాకం పెట్టుకొని ఉన్నాడు. ఈ ఘటన జరిగిన గంటలోగా ఆ టీనేజర్‌ని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు పోలీసు చీఫ్ వెల్లడించారు.

సాక్షి హైదరాబాద్
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



ఏసీబీ వలలో రెవెన్యూ అధికారులు

అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఇద్దరు రెవెన్యూ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. -8లో



25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించిన డీఎస్సీ వేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని పలువురు నేతలు విమర్శించారు. -8లో

అప్పుడే రైళ్లన్నీ ఫుల్



మరో నాలుగు నెలల వరకు రెగ్యులర్ రైళ్లలో ప్రయాణం చేయడం దాదాపు అసాధ్యంగా మారింది. దసరా, సంక్రాంతి పండుగల దృష్ట్యా ఇప్పటికే అన్ని ప్రధాన మార్గాల్లో రిజర్వేషన్లు భర్తీ అయ్యాయి. -8లో

న్యూస్‌రీల్

ఎయిర్‌పోర్టుకు అరుదైన గుర్తింపు

శంషాబాద్: జీఎమ్మార్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి కర్బన ఉద్గారాల తగ్గింపులో మరోసారి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కౌన్సిల్ 4 ప్లస్ ట్రాన్సిషన్ అక్రిడేషన్‌ను అందజేసినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. కర్బన ఉద్గారాల నిర్వహణ, తగ్గింపును ఆరు స్థాయిల్లో అంచనా వేసి గుర్తింపు అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణిక్కర్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులకు అనుగుణంగా అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా బహుళ మార్గాల్లో కర్బన ఉద్గారాల నిర్వహణలో ఎయిర్‌పోర్టులో సమర్థ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎయిర్‌పోర్టుకు గుర్తింపు రావడం హర్షణీయమన్నారు.

హాస్టళ్లలో ఇక స్మార్ట్ మీటర్లు

- విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకే..

సాక్షి, సిటీబ్యూరో: పోలారిస్ స్మార్ట్ మీటరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నగరంలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల విస్తరణ కోసం ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మంగళవారం మాదాపూర్‌లో జరిగిన ఎంఓయూ సంతకాల కార్యక్రమంలో ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాసం అమర్‌నాథ్ రెడ్డి, పోలారిస్ స్మార్ట్ మీటరింగ్ వ్యవస్థాపకులు యశ్‌రాజ్ ఖైతాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొలారిస్ స్మార్ట్ మీటరింగ్ సీఈఓ యశ్‌రాజ్ ఖైతాన్ మాట్లాడుతూ.. ఒప్పందంలో భాగంగా స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను వ్యవస్థాపించడం, తద్వారా శక్తి నష్టాలను అరికట్టడంతో పాటు పీజీ/హాస్టల్ ఆపరేటర్ల కోసం ఆదాయ సేకరణ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ప్రయత్నం విద్యుత్ చౌర్యం, మీటర్ ట్యాంపరింగ్‌ను అడ్డుకోవడమే కాకుండా విద్యుత్ సామర్థ్యాన్ని కూడా అభివృద్ధి చేస్తుందని ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాసం అమర్‌నాథ్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 2 లక్షల స్మార్ట్ మీటర్ల అవసరం ఉందన్నారు.

'డబుల్ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు'

లక్డీకాపూల్: పేదలకు సొంతింటి కల నెరవేర్చే క్రమంలో అవకతవకలు జరుగుతున్నాయని బాధితులు తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లు అర్హులకు దక్కడం లేదని ఆందోళనకు దిగారు. మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. నగర వ్యాప్తంగా పలువురు పేదలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ ఆందోళన కార్యక్రమంలో భాగంగా సిటీ ఆర్టీసీ బస్సులను అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పేదలకు చెందాల్సిన డబుల్ బెడ్రూం ఇళ్లను అనర్హులకు ఇస్తున్నారని ఆరోపించారు.

ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఘనంగా వీడ్కోలు



కాచిగూడ: ఆర్టీసీ చైర్మన్‌గా బాజిరెడ్డి గోవర్ధన్ పదవీ కాలం ముగియడంతో మంగళవారం ఆయనకు ఆర్టీసీ బర్కత్‌పుర డిపో కార్మిక నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆర్టీసీ కార్మిక నేతలు పి.లక్ష్మయ్య, జి.ముత్యాలు, కె.మైబూస్, కె.మహేష్, బీఆర్ఎస్ మహిళా నేత దేవిరెడ్డి విజితారెడ్డి బస్‌భవన్‌లో బాజిరెడ్డిని కలిసి ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి బాజిరెడ్డి గోవర్ధన్ ఎంతో కృషి చేశారని కొనియాడారు.

ఉప్పల్‌లో కోలాహలం



హైదరాబాద్ క్రికెట్ ఫ్యాన్స్‌కు ఆటపై ఉన్న అభిమానం ఎలాంటిదో ఉప్పల్ స్టేడియంలో కనిపించింది. భారత జట్టు లేకపోతేనేమి, వామప్ మ్యాచ్ మాత్రమే అయితేనేమి.. క్రికెట్ అభిమానులంతా మైదానానికి చేరి సందడి చేశారు. మంగళవారం రాజీవ్‌గాంధీ స్టేడియంలో పాకిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌కు అభిమానులు చెప్పుకోదగ్గ సంఖ్యలో హాజరయ్యారు. ఉప్పల్‌ను తన సొంతగడ్డలా భావించే డేవిడ్ వార్నర్ ఎప్పటిలాగే తనదైన శైలిలో 'పుష్ప' మేనరిజమ్స్, బుట్టబొమ్మా పాటలకు డ్యాన్స్‌లతో వినోదం పంచాడు.







వార్నర్ నృత్యం




మ్యాచ్‌ను తిలకిస్తున్న సినీనటులు వెంకటేశ్, సాయికుమార్, ఆది

ఇంటిపై కన్నేసి.. ఎన్నారైని చంపేసి!

జీఆర్ కన్వెన్షన్ యజమాని రాజేష్ దురాగతం

- సహకరించిన డ్రైవర్‌తో పాటు ఇద్దరు బిహారీలు
- హతుడు అంజిరెడ్డి గతంలో సినీ నిర్మాత
- తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- ఎట్టకేలకు హత్యగా గుర్తించిన నార్త్‌జోన్ పోలీసులు
- అయిదుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు





హతుడు అంజిరెడ్డి (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఉన్న స్థిరాస్తుల క్రయవిక్రయం పేరుతో ఓ ఎన్నారైకి చేరువయ్యాడు. ఆయన ఇంటిపై కన్నేసి సొంతం చేసుకోవాలనుకున్నాడు.. దాన్ని ఖరీదు చేసేందుకు నగదు రూపంలో చెల్లింపులు చేసినట్లు డ్రాఫ్ట్ సిద్ధం చేసుకున్నాడు.. తన పథకాన్ని అమలు చేస్తూ అతడిని దారుణంగా చంపేశాడు.. గోపాలపురంలో ఉన్న సరోజినీదేవి రోడ్‌లోని జీఆర్ కన్వెన్షన్ యజమాని రాజేష్ వ్యవహారమిది. ఈ దారుణంలో పాలు పంచుకున్న అతడి భార్య, డ్రైవర్, ఇద్దరు బిహారీలతో పాటు రాజేష్‌ను గోపాలపురం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

పౌరసత్వం రావడంతో విక్రయాలు...

పద్మారావునగర్‌కు చెందిన జి.అంజిరెడ్డి (71) గతంలో సినీ నిర్మాతగా పనిచేశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఓ కుమారుడు మోకిలాలో ఉంటుండగా.. మరో కుమారుడు, కుమార్తె విదేశాల్లో ఉంటున్నారు. ఇటీవలే అంజిరెడ్డితో పాటు ఆయన భార్యకు అమెరికా పౌరసత్వాలు వచ్చాయి. దీంతో అక్కడే స్థిరపడాలని భావించిన ఆయన నగరంలోని తన స్థిరాస్తులు విక్రయించాలని నిర్ణయించారు. అంజిరెడ్డి నిర్మాతగా ఉండగా సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా పని చేసిన రవి కాట్రగడ్డతో ఇప్పటికీ స్నేహం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే అంజిరెడ్డి తన ఆస్తుల విక్రయం విషయం ఆయనకు ఎనిమిది నెలల క్రితం చెప్పి అమెరికా వెళ్లారు. రవి ఈ అంశాన్ని రియల్టర్లతో కూడిన వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశారు. నెల రోజుల క్రితం భార్యతో తిరిగి వచ్చిన అంజిరెడ్డి వద్దకు రవి తన వెంట జీఆర్ కన్వెన్షన్ యజమాని రాజేష్‌ను తీసుకువచ్చారు.

ఇంటిపై మక్కువను గుర్తించి..

అంజిరెడ్డికి అలా పరిచయమైన రాజేష్ నమ్మకంగా, సన్నిహితంగా మెలిగాడు. పద్మారావునగర్‌లోని ఇల్లు తనకు నచ్చిందని, తాను ఖరీదు చేస్తానని అంజిరెడ్డితో పాటు ఆయన భార్యతోనూ నమ్మబలికాడు. 1986లో కట్టిన ఆ ఇంటిపై భార్యాభర్తలకు ఉన్న మక్కువను గుర్తించిన రాజేష్.. వారిని బుట్టలో వేసుకునేలా మాట్లాడాడు. ఆ ఇంటిని పడగొట్టనని, మరింత అందంగా తీర్చిదిద్దుతానని తరచూ చెబుతుండేవాడు. సైదాబాద్‌లో ఉన్న మరో ఆస్తిని విక్రయించాలని అంజిరెడ్డి భావించారు. ఈ విషయం తెలుసుకున్న రాజేష్.. దాన్ని ఖరీదు చేయడానికి ఓ పార్టీ సిద్ధంగా ఉందని చెప్పాడు. తమ ఆస్తుల్ని విక్రయించిన ఇద్దరు మహిళలు ఇది ఖరీదు చేయడానికి అంగీకరించారంటూ అంజిరెడ్డితో చెప్పుకొచ్చాడు. వాస్తవానికి అంజిరెడ్డి, ఆయన భార్య గత నెల 22న ఆస్ట్రేలియా వెళ్లాల్సి ఉంది. అయితే 29న రెండు ఆస్తుల లావాదేవీలు పూర్తవుతాయని రాజేష్ వారితో చెప్పాడు. దీంతో భార్య వెళ్లగా.. అంజిరెడ్డి ఇక్కడే ఉండిపోయారు.

పథకం ప్రకారం డ్రాఫ్ట్ సిద్ధం చేసి..

ఎలాంటి నగదు చెల్లించకుండా అంజిరెడ్డికి పద్మారావునగర్‌లో ఇంటిని సొంతం చేసుకోవాలని రాజేష్ భావించాడు. దీనికోసం రెండు విడతల్లో ఆయనకు రూ.2.1 కోట్లు నగదు రూపంలో చెల్లించినట్లు, వయోవృద్ధుడు కావడంతో ఆయనకు ఏమైనా అయితే మరో రూ.50 లక్షలు ఆయన భార్యకు ఇచ్చి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకునేలా నమూనా డ్రాఫ్ట్ సిద్ధం చేశాడు. అంజిరెడ్డి మేడ్చల్‌లోని అద్వైత్ గేటెడ్ కమ్యూనిటీలో విల్లా ఖరీదు చేయాలని భావించారు. గత నెల 29 ఉదయం పద్మారావునగర్‌కు వెళ్లిన రాజేష్... అంజిరెడ్డిని తీసుకుని మేడ్చల్ వెళ్లారు. అక్కడ ఉండగా ఆస్ట్రేలియా నుంచి ఫోన్ చేసిన భార్యతో అంజిరెడ్డి అదే విషయం చెప్పారు. ఆ తర్వాత మోకిలాలో ఉండే కుమారుడు శ్రీచరణ్‌రెడ్డి ఎన్నిసార్లు ప్రయత్నించినా అంజిరెడ్డి ఫోన్ కలవలేదు.

అంతా కలిసి హత్య చేశారు..

అంజిరెడ్డి, రాజేష్ గత నెల 29 సాయంత్రం 5.30 గంటలకు వేర్వేరు కార్లలో జీఆర్ కన్వెన్షన్ ఉన్న డీమార్ట్ బిల్డింగ్‌లోకి ప్రవేశించారు. బేస్‌మెంట్- 3లో అంజిరెడ్డి కారు పార్క్ చేసిన తర్వాత రాజేష్, అతడి భార్య, డ్రైవర్, కన్వెన్షన్‌లో పని చేసే ఇద్దరు బిహారీలు అంజిరెడ్డిని దారుణంగా హత్య చేశారని పోలీసులు గుర్తించారు. ఆపై మృతదేహాన్ని బేస్‌మెంట్-3లోని ఆయన కారు వద్దకు తీసుకువచ్చి పడేశారని అనుమానిస్తున్నారు. ఆ రోజు రాత్రి 9.15 గంటలకు చరణ్‌కు ఫోన్ చేసిన రవి కాట్రగడ్డ అంజిరెడ్డికి యాక్సిడెంట్ అయిందని చెప్పారు. హుటాహుటిన వచ్చిన ఆయన బేస్‌మెంట్-3లో కారు పార్క్ చేసి ఉండటం, దాని పక్కనే అంజిరెడ్డి మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించారు. గోపాలపురం పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలతో హత్యగా తేల్చారు. రాజేష్ సహా అయిదుగురినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

నీవు లేని లోకంలో నేనుండలేను

- మూడురోజుల క్రితం ప్రియుడి ఆత్మహత్య
- తట్టుకోలేక తనువు చాలించిన యువతి
- గచ్చిబౌలి పీఎస్ పరిధిలో విషాద ఘటన



నేహ (ఫైల్)

గచ్చిబౌలి: ఇద్దరు ఒకే బేకరీలో పని చేసేవారు.. వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. వీరి పెళ్లికి ప్రియుడి కుటుంబం నిరాకరించడంతో అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన ప్రేమికురాలు ఉరి వేసుకొని తనువు చాలించిన విషాద ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. సీఐ జేమ్స్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్‌కు చెందిన నేహ (19) ఎనిమిది నెలల క్రితం నగరానికి వచ్చి గౌలిదొడ్డిలోని జర్నలిస్ట్ కాలనీలో వైష్ణవి పీజీ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. నానక్‌రాంగూడలోని గోల్ఫ్ ఎడ్జ్‌లోని ఓ బేకరీలో సేల్స్ గర్ల్‌గా చేరింది. బాలాపూర్ పీఎస్ పరిధిలో వెంకటాపురంలో నివసించే సల్మాన్ ఆరు నెలల క్రితం సదరు బేకరీలో చేరాడు. వీరిరువురు మధ్య స్నేహం ప్రేమగా మారింది. విషయం తెలియడంతో సల్మాన్‌ను బేకరీ నుంచి తొలగించారు. సల్మాన్ ప్రేమ విషయం ఇంట్లో చెప్పడంతో తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సల్మాన్ ఈ నెల 1న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రియుడు చనిపోయిన విషయం తెలియడంతో నేహ తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది. మంగళవారం ఉదయం 9.30 గంటలకు రూమ్ మేట్స్ డ్యూటీకి వెళ్లగానే తలుపు గడియ పెట్టుకుంది. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హాస్టల్ నిర్వాహకులు వెంటనే గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. ప్రియుడు సల్మాన్ ఆత్మహత్యను జీర్ణించుకోలేక తనువు చాలించిందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

సమర తనయ!

- కంటోన్మెంట్‌లో వారసురాళ్ల కదన కుతూహలం
- బీఆర్ఎస్ అభ్యర్థిగా ఇప్పటికే సాయన్న కుమార్తె ఖరారు
- కాంగ్రెస్ జాబితాలో గద్దర్ కూతురు వెన్నెల
- బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న శంకర్‌రావు కుమార్తె



లాస్య నందిత



సుష్మిత

కంటోన్మెంట్: కంటోన్మెంట్ శాసనసభా నియోజకవర్గంలో వారసురాళ్లు కదన భేరికి సంసిద్ధులవుతున్నారు. మూడు ప్రధాన పార్టీల నుంచి మహిళా అభ్యర్థులు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే సాయన్న హఠాన్మరణంతో అధికార బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా ఆయన కుమార్తె లాస్యను ప్రకటించింది. దీంతో ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీలు సైతం మహిళా అభ్యర్థుల వైపే మొగ్గు చూపే పరిస్థితులు ఎదురయ్యాయి. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టి, ఆ వర్గం ఓటర్లపై దృష్టిపెట్టిన బీజేపీ.. ఈ ఎన్నికల్లోనే అధిక సంఖ్యలో అతివలకు టికెట్ ఇవ్వనుందనే ప్రచారం జరుగుతోంది.

- ఇక కాంగ్రెస్ సైతం తమ పార్టీ తరఫున మహిళనే రంగంలోకి దింపే సూచనలు కనిపిస్తున్నాయి. బీజేపీ నుంచి ఇద్దరు మహిళా అభ్యర్థులు సుష్మిత శంకర్‌రావు, రజని ప్రధానంగా పోటీ పడుతుండగా, అధిష్టానం సుష్మితకే టికెట్ కేటాయించే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెలను కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా దాదాపు ఖరారు చేసిందని తెలుస్తోంది. దీంతో కంటోన్మెంట్‌లో వారసురాళ్ల పోటీ అనివార్యం కానుంది. సుష్మిత తండ్రి శంకర్‌రావు 2009–14 మధ్య కాలంలో కంటోన్మెంట్‌లో ఎమ్మెల్యేగా పనిచేశారు. సాయన్న 1994 నుంచి 2009లో ఒక్కసారి మినహా అయిదుసార్లు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. గద్దర్ కుటుంబం కంటోన్మెంట్‌ను ఆనుకుని ఉండే అల్వాల్‌లో నివాసముంటోంది.

బీజేపీ నుంచి సుష్మిత..

బీజేపీ నుంచి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉద్యోగి పరశురామ్, ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్న కపిల్ బరాబరి టికెట్ కోసం తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే శంకర్‌రావు కుమార్తె సుష్మితకు టికెట్ ఇప్పించడంలో ఆమె మామ వివేక్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అధిష్టానం తీరుపై అసహనంతో ఉన్న వివేక్‌ను ఒప్పించే క్రమంలో బీజేపీ పెద్దలు ఆయన మేనకోడలు సుష్మితకు టికెట్ ఖరారు చేయొచ్చనే అంచనాలున్నాయి.

కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్..

కాంగ్రెస్ నుంచి స్థానిక నేతలు డీబీ దేవేందర్, నర్సింహతో పాటు పొంగులేటి అనుచరుడు పిడమర్తి, అల్వాల్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ జీవక పోటీ పడుతున్నారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ సైతం తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలంటూ కాంగ్రెస్ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు సమర్పణకు వెళ్తూ అట్టహాసంగా ర్యాలీ నిర్వహించిన సర్వే ఆ తర్వాత సైలెంటయ్యారు. తాజా సమీకరణాల నేపథ్యంలో పార్టీ అధిష్టానం గద్దర్ కుమార్తె వెన్నెల వైపు మొగ్గు చూపినట్లు సంకేతాలు అందుతున్నాయి.

తొలి మహిళా ఎమ్మెల్యే మంకమ్మ

1957లో ఏర్పడిన కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా బీవీ గురుమూర్తి ఎమ్మెల్యేగా గెలిచారు. 1967లో ఈ స్థానం ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో వి. రామారావు ఎమ్మెల్యేగా గెలిచారు. ఏడాదిలోనే ఈయన మరణించడంతో ఉపఎన్నికల్లో ఆయన సతీమణి మంకమ్మ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. తిరిగి 1962లో జరిగిన సాధారణ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలిచారు. కంటోన్మెంట్ తొలి, ఏకైక మహిళా ఎమ్మెల్యేగా రికార్డు ఆమె పేరిటే ఉంది.

గృహమస్తు!



హైదరాబాద్‌లో గృహాల సప్లయ్, విక్రయాలు

(హెచ్–1: జనవరి–జూన్, హెచ్–2: జులై–డిసెంబర్)

సంవత్సరం	సరఫరా	అమ్మకాలు
2018 హెచ్1	3,706	8,313
హెచ్2	1,698	7,278
2019 హెచ్1	5,430	8,334
హెచ్2	8,065	7,933
2020 హెచ్1	4,422	4,782
హెచ్2	8,404	5,260
2021 హెచ్1	16,712	11,973
హెచ్2	19,024	12,344
2022 హెచ్1	21,356	14,693
హెచ్2	22,491	16,353
2023 హెచ్1	22,851	15,355

గత రెండేళ్లలో నగరంలో లక్షకు పైగా గృహాలు..

- కరోనా అనంతరం సప్లయ్, విక్రయాలు మూడింతలు
- ఐటీ ఉద్యోగులతో పశ్చిమ హైదరాబాద్‌లో డిమాండ్
- ధర రూ.కోటి దాటిన ప్రీమియం ఇళ్లకు పెరిగిన గిరాకీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగర స్థిరాస్తి రంగానికి కరోనా బాగా కలిసొచ్చింది. కోవిడ్ కంటే ముందు నగరంలో కొత్త గృహాల సరఫరా కంటే విక్రయాలు దాదాపు రెండింతలు జరిగేవి. కానీ.. మహమ్మారి అనంతరం రివర్స్ పరిస్థితులు కనిపిస్తున్నాయి. కరోనా కంటే ముందుతో పోలిస్తే హైదరాబాద్‌లో ఇళ్ల సరఫరా, విక్రయాలు మూడు రెట్లు పెరిగాయి. 2021 నుంచి ఇప్పటివరకు నగరంలో కొత్తగా 1,02,434 గృహాల సరఫరా జరగగా.. 70,718 ఇళ్లు అమ్ముడుపోయాయి. అదే కరోనా కంటే ముందు 2018 నుంచి 2020 వరకు నగరంలో 31,725 యూనిట్లు సప్లయ్ కాగా.. 41,900 నివాసాలు విక్రయమయ్యాయి.

ఇంటి అవసరం పెరిగింది..

కరోనాతో ఇంటి అవసరం పెరిగింది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో నివాసం ఉండే ఇళ్లు కూడా పర్యావరణహితంగా ఉండాలని కొనుగోలుదారులు భావిస్తున్నారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా విస్తారమైన ఇళ్లు, ఆధునిక వసతులను డెవలపర్లు కల్పిస్తున్నారు. ఔట్ డోర్ జిమ్, ఐసోలేషన్ గది, వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాసుల కోసం 24/7 ఇంటర్నెట్, ఇండిపెండెంట్ వసతుల ఏర్పాట్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉండే ప్రీమియం ఇళ్లకు గిరాకీ పెరిగింది.

పశ్చిమ హైదరాబాద్‌లో గిరాకీ..

చాలా మంది కొనుగోలుదారులు కొత్త ప్రాపర్టీలే కాకుండా సెకండ్ హ్యాండ్ ఇళ్లను కొనుగోలు చేశారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఐటీ రంగంలో మూడింట ఒక వంతు ఉద్యోగులు ప్రాపర్టీ కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో పశ్చిమ హైదరాబాద్‌లో ఇళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ప్రధానంగా గచ్చిబౌలి, మాదాపూర్, శేరిలింగంపల్లి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నల్లగండ్ల, తెల్లాపూర్, పుప్పాలగూడ వంటి ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లలో కొనుగోళ్లు పెరిగాయి. ఇదే సమయంలో హైదరాబాద్‌కు వలసలు పెరగడంతో ఇక్కడి ప్రాపర్టీలకు గిరాకీ కొంత మేర పెరిగింది.

ఆఫీసు స్పేస్‌లో టాప్..

దేశంలోని ఏడు ప్రధాన నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఈ ఏడాది మూడో త్రైమాసికం (క్యూ3)లో అత్యధికంగా ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. 2023 క్యూ3లో 27 లక్షల చదరపు అడుగులు (చ.అ.) లావాదేవీలు పూర్తయ్యాయి. హైదరాబాద్ తర్వాత బెంగళూరులో 23.8 లక్షల చ.అ. లీజులు జరిగాయి. 2023 క్యూ2తో పోలిస్తే నగరంలో ఆఫీసు స్పేస్ లావాదేవీలలో ఏకంగా 206 శాతం వృద్ధి నమోదయిందని జేఎల్ఎల్ ఇండియా నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది క్యూ2లో 8 లక్షల చ.అ. లీజులు మాత్రమే జరిగాయి. దేశంలోని మొత్తం ఆఫీసు స్పేస్ లావాదేవీలలో 26.1 శాతం వాటాతో హైదరాబాద్ తొలి స్థానంలో నిలిచింది. బెంగళూరు 22.9 శాతం, ఢిల్లీ–ఎన్‌సీఆర్ 16.4 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. 2023 క్యూ3లో 10.37 మిలియన్ చ.అ. లావాదేవీలు జరిగాయి. గత 18 నెలలతో పోలిస్తే గరిష్ట లావాదేవీలివే. 2023 క్యూ2లో 7.95 మిలియన్ చ.అ. లావాదేవీలు జరిగాయి. క్రితం త్రైమాసికంతో పోలిస్తే 30.4 శాతం వృద్ధి నమోదయింది.

రెడీ టు మూవ్ ప్రాజెక్టులకు డిమాండ్



నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల కంటే నిర్మాణం పూర్తయి గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న వాటిల్లో కొనేందుకు కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారు. స్థిరమైన వడ్డీ రేట్లు, అందుబాటు ధరలు గృహ విభాగంలో డిమాండ్‌కు ప్రధాన కారణాలు. – సీహెచ్ వెంకట సుబ్రహ్మణ్యం, సీఎండీ, భువన్‌తేజ ఇన్‌ఫ్రా

బల్దియాలో పనులకు బ్రేక్

- ఆర్నెల్లుగా బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో ఆందోళనలు
- జోనల్, సర్కిల్ కార్యాలయాల వద్ద కాంట్రాక్టర్ల నిరసనలు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో ప్రాజెక్టుల పరిధిలోని పనులు మినహా ఇంజినీరింగ్ పనుల్ని కాంట్రాక్టర్లు చాలా ప్రాంతాల్లో నిలిపివేశారు. ఇప్పటికే రూ.800 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పాటు మంజూరైన పనులు మరో రూ. 3వేల కోట్లున్నాయని కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఎంతోకాలంగా బిల్లులు చెల్లించాల్సిందిగా మంత్రి నుంచి చీఫ్ సెక్రటరీ, కమిషనర్‌దాకా అందరినీ కలిసి విన్నవించినా తమ బాధలు ఎవరూ పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పనులు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచే పనులు నిలిపివేయనున్నట్లు ఇప్పటికే ఎన్నో పర్యాయాలు తెలిపినా, అధికారుల నుంచి స్పందన రాలేదన్నారు. ఒకటి, రెండు తేదీల్లో జీహెచ్ఎంసీ కార్యాలయాలకు సెలవులు కావడంతో మంగళవారం జోనల్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించారు. తమ బిల్లుల్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. «నో పేమెంట్– నోవర్క్» స్లోగన్లు చేశారు. బ్యానర్లు ప్రదర్శించారు. వెయ్యికోట్లే చెల్లించలేకపోతున్న వారు రూ. 4వేల కోట్ల పనులు చేస్తే వాటిని చెల్లించేందుకు ఎన్నేళ్లు కావాలని ప్రశ్నించారు. వీటిని వివరిస్తూ తుది దశలో ఉన్న పనుల్ని మాత్రం పూర్తి చేసి, మిగతా పనుల్ని చేయవద్దని, కొత్త టెండర్ల జోలికి అసలే పోవద్దని కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు జీహెచ్ఎంసీలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లందరినీ కోరారు. ఐక్యత చూపించకపోతే అందరూ ఇబ్బందుల్లో పడతారని హెచ్చరించారు. గత కమిషనర్ లోకేశ్‌కుమార్ ఫిబ్రవరి వరకు బిల్లుల్ని మార్చి వరకు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ చెల్లింపులు జరగలేదని తెలిపారు. ఆర్నెల్లుగా కోరుతున్నా ఎవరూ తమ బాధలు పట్టించుకోవడం లేదని అసోసియేషన్ వేదన వ్యక్తం చేసింది. ఇంజినీరింగ్ పనులు నిలిపివేసి ప్రజలకు తెలిసేలా సైట్లలో బిల్లులు రానుందున పనులు నిలిపివేసినట్లు బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాల్సిందిగా అసోసియేషన్ సభ్యులు కాంట్రాక్టర్లను కోరారు. ఆమేరకు కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే బ్యానర్లు ఏర్పాటు చేశారు.

దేవర మనోజ్ ఖన్నాకు రాష్ట్రపతి అవార్డు

- సామాజిక సేవలకు గుర్తింపు
- పర్యావరణం కోసం పలు కార్యక్రమాలు


రాష్ట్రపతి నుంచి ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు అందుకుంటున్న దేవర మనోజ్ ఖన్నా

అబిడ్స్: గత కొన్ని సంవత్సరాలుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న దేవర మనోజ్ ఖన్నాకు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు లభించింది. గోషామహల్ నియోజకవర్గంలోని గాంధీభవన్ ప్రాంతానికి చెందిన దేవర మనోజ్ ఖన్నా ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా ఉంటూ పర్యావరణ కార్యక్రమాలపై 7 లక్షల మంది విద్యార్థులకు 650 కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించారు. 1300 మొక్కలు నాటడంతో పాటు 160 యూనిట్ల రక్తదాతలను సమీకరించడం, కోవిడ్-19 లాక్‌డౌన్ సమయంలో నిరుపేద పిల్లలు, గ్రామీణ కుటుంబాలకు నిత్యావసరాల వస్తువుల పంపిణీ, పలు విద్యాసంస్థల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించడం లాంటివి చేశారు. వీటికి గుర్తింపుగా దేవర మనోజ్ ఖన్నాకు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మనోజ్ ఖన్నా మాట్లాడుతూ..2016వ సంవత్సరం నుండి తాను నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జాతీయస్థాయిలో రాష్ట్రపతి అవార్డు పొందడం తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. పలు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించి 5 వేల కిట్స్‌లను పంపిణీ చేశానన్నారు. జీవితాంతం సామాజిక సేవా కార్యక్రమాలకే అంకితమవుతానన్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్, పటేల్‌నగర్‌తో పాటు గోషామహల్ నియోజకవర్గంలో పలువురు మనోజ్ ఖన్నాను అభినందించారు.

ఏసీబీ వలలో రెవెన్యూ అధికారులు


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్ఐ శోభను అదుపులో తీసుకుంటున్న ఏసీబీ అధికారులు

- ఆస్తి మార్పిడి వ్యవహారంలో లంచం డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రూ.1.50 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత

అంబర్‌పేట: లంచం తీసుకుంటూ ఇద్దరు రెవెన్యూ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం అంబర్‌పేట తహశీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం..మండల పరిధిలోని అంజంపూర ప్రాంతానికి చెందిన దూదువాయి వెంకటేశ్వరరావు తన తండ్రి మరణించడంతో ఉన్న ఆస్తిని తన తల్లి పేరుపై మార్చేందుకు అంబర్‌పేట తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ లలితను సంప్రదించారు. దీనిని ఆమె ఇదే కార్యాలయంలో పనిచేసే స్పెషల్ ఆర్ఐ శోభ దృష్టికి తీసుకువెళ్లింది. వీరిద్దరు కలిసి స్థలానికి మొత్తం ఖరీదు రూ.60 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనాకు వచ్చారు. ఈ స్థలంపై ఎలాంటి చిక్కులు లేవని పైఅధికారులకు రిపోర్టు పంపించేందుకు కనీసం రూ.20 లక్షలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ డ్రైవర్ ఏం.బాపుయాదవ్‌ను రంగంలోకి దింపారు. బాపుయాదవ్ మధ్యవర్తిగా వ్యవహరించి వెంకటేశ్వరరావుతో రూ.10 లక్షలు ఇస్తే పని అవుతుందని చెప్పారు. దీంతో వెంకటేశ్వరరావు ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఏసీబీ అధికారులు రంగు పూసిన రూ.1.50 లక్షలను వెంకటేశ్వరరావుకు అందించి బాపుయాదవ్‌కు ఇవ్వాల్సిందిగా సూచించారు. వారి ఆదేశాల మేరకు వెంకటేశ్వరరావు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ టీ కొట్టులోకి బాపుయాదవ్‌ను పిలిచి రూ.1.50 లక్షలు అందించారు. వెంటనే మఫ్టీలో ఉన్నా ఏసీబీ అధికారులు బాపుయాదవ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని చేతులు కడుగగా రంగు మారాయి. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా సర్వేయర్ లలిత, స్పెషల్ ఆర్ఐ శోభ ఆదేశాల మేరకు తీసుకున్నట్లు వెల్లడించారు. అక్కడే ఉన్న సర్వేయర్ లలిత , శోభ, బాపుయాదవ్‌లను అరెస్ట్ చేశారు. ఈ దాడులను ఏసీబీ జేడీ సుధేందర్ పర్యవేక్షించారు. దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు రఘునందన్, రాజేష్‌లు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు.

టీ వీవ్స్‌లో మంత్రి కేటీఆర్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.10లో తెలంగాణ రాష్ట్ర హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్మించిన టీ వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ భవనాన్ని మంగళవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. పెరుగుతున్న ఆదరణకు అనుగుణంగా ఇలాంటి భవనాలు మరిన్ని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాల్క సుమన్, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అలగు వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి సర్కారు బడుల్లో అల్పాహారం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని సర్కారు బడుల విద్యార్థులకు ఈ నెల 6 నుంచి అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, జోనల్ కమిషనర్‌లతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారుల సహకారంతో ఎంపిక చేసి అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. ముషీరాబాద్, అంబర్ పేట్, సికింద్రాబాద్, సనత్ నగర్, బేగంపేట, లాలాగూడ, బన్సీలాల్ పేట, బోయిగూడ, వెస్ట్ మారేడ్ పల్లి, కంటోన్మెంట్, కవాడిగూడ, వెంగళ్‌రావు నగర్, వెస్ట్ బోయిన్ పల్లి తదితర ప్రాంతాలలోని స్కూళ్లను ఎంపిక చేయాలని కమిషనర్ అధికారులను కోరారు.

ఈ నెల 9 నుంచి 13 వరకు ఏజీవర్సిటీ కోర్సులకు కౌన్సిలింగ్

ఏజీవర్సిటీ: వెటర్నరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ అండర్ గ్రాడ్యుయేట్ బైపీసీ స్ట్రీం రెండవ కౌన్సిలింగ్ ఈ నెల 9 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో కొత్త వ్యవసాయ కళాశాలను సిద్దిపేట జిల్లా తోర్నాలలో ఈ విద్యా సంవత్సరం ప్రారంభించడం జరిగిందని, దీంతో పాటు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోను కొత్త కళాశాలలను మహబూబాబాద్ జిల్లా మల్యాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అగ్రికల్చరల్ కళాశాల తోర్నాలలో 60 సీట్లు, మాల్యాలలో 30 సీట్లు కొత్తగా అందుబాటులోకి వచ్చాయని వీటిని కూడా రెండో కౌన్సిలింగ్‌లో భర్తీ చేస్తారని తెలిపారు.

ఉద్యోగులకు ఐఆర్ 40 శాతం పెంచాలి

బీసీ ఉద్యోగుల సంఘం డిమాండ్

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రకటించిన ఐదు శాతం మధ్యంతర భృతి (ఐఆర్)కు ఒప్పుకునే ప్రసక్తే లేదని తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం పేర్కొంది. 40 శాతం ఐఆర్ ఇవ్వాల్సిందే అని వారు డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని జలసౌధ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ మూడు డీఏలు కలిపితేనే 11 శాతం రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఐఆర్ జీవోను రద్దు చేసి 40 శాతం ఐఆర్‌తో కొత్త జీవో విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రమ తదితరులు పాల్గొన్నారు.

గాడియం స్కూల్‌లో ఐఎస్ఎస్ఓ గేమ్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గాడియం స్కూల్ వేదికగా ఐఎస్ఎస్ఓ (ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ స్కూల్ ఆర్గనైజేషన్) నేషనల్ గేమ్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. గాడియం స్టేడియం స్పోర్ట్రోపియా వేదికగా బ్యాడ్మింటన్ పోటీల ముగింపు వేడుకల్లో భాగంగా విజేతలకు మెడల్స్‌ను అందజేశారు. అండర్-14, 17, 19 విభాగాల్లో ఈ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ టోర్నీలో నగరంతో పాటు చెన్నై, బెంగుళూరు, పూణే, గౌహతి, కోయంబత్తూర్ తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే రైళ్లన్నీ ఫుల్!

- సంక్రాంతి వరకు రెగ్యులర్ రైళ్లలో భారీగా వెయిటింగ్
- ఇక అందుబాటులో ప్రత్యేక రైళ్లు మాత్రమే
- ప్రత్యేక రైళ్లలో చార్జీలు మోత



సాక్షి, సిటీబ్యూరో: ఇక రైలు ప్రయాణం 'ప్రత్యేకమే'. మరో నాలుగు నెలల వరకు రెగ్యులర్ రైళ్లలో ప్రయాణం చేయడం దాదాపు అసాధ్యంగా మారింది. దసరా, సంక్రాంతి పండుగల దృష్ట్యా ఇప్పటికే అన్ని ప్రధాన మార్గాల్లో రిజర్వేషన్‌లు భర్తీ అయ్యాయి. చాలా రైళ్లలో వెయిటింగ్ లిస్టు వందల్లో దర్శనమిస్తోంది. కొన్ని రైళ్లలో బుకింగ్‌లకు కూడా అవకాశం లేకుండా 'నో రూమ్' కనిపిస్తోంది. దీంతో హైదరాబాద్ నుంచి సొంత ఊళ్లకు వెళ్లేందుకు నగరవాసులకు ప్రత్యేక రైళ్లే ప్రత్యామ్నాయంగా మారాయి. రెగ్యులర్ రైళ్లలో సాధారణ చార్జీలపైన రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉండగా, ప్రత్యేక రైళ్ల అన్నింటిలోనూ 20 శాతం వరకు అదనపు చార్జీలను విధించారు. దీంతో ఈ సారి పండుగ ప్రయాణం మరింత 'ప్రియం'గా మారనుంది.

భారీగా వెయిటింగ్ ....

జంటనగరాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే అన్ని ప్రధాన రైళ్లల్లో వెయిటింగ్ జాబితా 150 నుంచి 250 వరకు చేరింది. వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకు చాలా రైళ్లల్లో వెయిటింగ్ లిస్ట్ చాంతాడంత ఉంది. సాధారణంగా ప్రయాణానికి మూడు నెలలు ముందుగానే బుకింగ్ చేసుకొనేందుకు అవకాశం ఉండడంతో దసరా, దీపావళి, సంక్రాంతి పండుగల కోసం సొంత ఊళ్లకు వెళ్లేవాళ్లు ఇప్పటికే రిజర్వేషన్‌లు నమోదు చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి విశాఖ, ఒడిశా, బెంగళూరు, తిరుపతి, కాకినాడ, నర్సాపూర్, నాగర్‌సోల్, పట్నా, దానాపూర్, జైపూర్, ముంబయి తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు భారీ డిమాండ్ నెలకొంది. గౌతమి, గోదావరి, విశాఖ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, తదితర రైళ్లకు రానున్న నాలుగు నెలల వరకు వెయిటింగ్ లిస్ట్ పైనే రిజర్వేషన్‌లు బుక్ చేసుకోవడం గమనార్హం. సెకెండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు స్లీపర్ క్లాస్ కోసం కూడా భారీ పోటీ ఉంది.

పండుగలప్పుడే కాదు.. సెలవులొచ్చినా రద్దీనే

సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి సుమారు 2.5 లక్షల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. పండుగలు, వరుస సెలవులు, వీకెండ్స్ వంటి ప్రత్యేక రోజుల్లో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరుగుతుంది. గతంలో సంక్రాంతికి మాత్రమే ఎక్కువ మంది సొంత ఊళ్లకు తరలి వెళ్లేవారు. కానీ ఇప్పుడు నాలుగు రోజులు వరుసగా సెలవులొస్తే ఎక్కడికైనా వెళ్లేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. సెలవు రోజుల్లో సుమారు 30 వేల మందికి పైగా అదనంగా ప్రయాణం చేస్తున్నట్లు అంచనా.

ఆర్టీసీలో అలా...రైల్వేలో ఇలా...

ఆర్టీసీల్లో ప్రత్యేక చార్జీలను ఉపసంహరించారు. గతంలో దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పర్వదినాల్లో 50 శాతం అదనపు చార్జీలు విధించేవారు. దీంతో ప్రయాణికులు రైళ్లకే ఎక్కువగా మొగ్గుచూపేవారు. బస్సు చార్జీల కంటే రైలు చార్జీలు చాలా తక్కువ కావడమే ఇందుకు కారణం. కానీ ప్రస్తుతం ఆర్టీసీల్లో ఎలాంటి అదనపు చార్జీలు విధించడం లేదు. పైగా హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లే గరుడ ప్లస్ బస్సుల్లో ప్రయాణించే వారికి 10శాతం వరకు రాయితీ లభిస్తోంది. ప్రయాణికులను ఆకట్టుకొనేందుకు వివిధ రకాల పథకాలను ప్రవేశపెడుతున్నారు. కానీ రైలు ప్రయాణం అందుకు భిన్నంగా మారింది. రెగ్యులర్ రైళ్లలో ప్రయాణం చేసేందుకు అవకాశం లేదు. దీంతో తత్కాల్ చార్జీలపైన ఏర్పాటు చేసే ప్రత్యేక రైళ్లు భారంగా మారాయి.

ప్యాసింజర్ రైళ్లు తగ్గుముఖం..

మరోవైపు సాధారణ ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా అందుబాటులో ఉండే ప్యాసింజర్ రైళ్లను చాలా వరకు తగ్గించారు. మౌలిక సదుపాయాల కల్పన పేరిట హైదరాబాద్ నుంచి వరంగల్, కాజీపేట్, భద్రాచలం, విజయవాడ, కర్నూలు, తదితర ప్రాంతాలకు నడిచే సుమారు 22 రైళ్లు గత 3 నెలలుగా నిలిచిపోయాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నకిలీ 'విదేశీ మద్యం' పట్టివేత



సాక్షి, సిటీబ్యూరో: విదేశీ మద్యం పేరిట కల్తీ సరుకును విక్రయిస్తున్న ముఠాను ఎక్సైజ్ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. 46 మద్యం బాటిళ్లతో పాటు, మరో 294 వివిధ రకాల విదేశీ మద్యం బ్రాండ్‌లకు చెందిన ఖాళీ బాటిళ్లను అధికారులు జప్తు చేశారు. నకిలీ మద్యాన్ని విక్రయిస్తున్న ముఠా సభ్యులు మహ్మద్ ఆజం, సుశాంత్ మాలిక్, సత్యసుందర్‌లను అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి నుంచి ఒక బైక్‌ను కూడా అధికారులు జప్తు చేశారు. శంషాబాద్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయమైన సమాచారం మేరకు శేరిలింగంపల్లి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలోని అధికారులు బృందం మాదాపూర్ మెట్రోపిల్లర్ నంబర్ 1724 వద్ద బార్ అటెండర్‌గా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన మహ్మద్ ఆజాం వద్ద మొదట రెండు విదేశీ బాటిళ్లను గుర్తించారు. అనంతరం అతని ఇంటి వద్ద సోదాలు చేయగా మరో 22 బాటిళ్ల మద్యం లభించింది. వీటిలో గ్లెన్ఫిడిక్, రాయల్ సెల్యూట్, క్లాస్ 21 వోడ్కా, తదితర బ్రాండ్‌లకు చెందిన బాటిళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే అతని వద్ద లభించిన సమాచారం ఆధారంగా కొత్తగూడకు చెందిన సుశాంత్ మాలిక్ అనే అతని స్నేహితుని వద్ద మరో 22 బాటిళ్ల మద్యం, 294 ఖాళీ బాటిళ్లు లభించాయి. ఇద్దరు కలిసి ఖాళీ విదేశీ మద్యం బాటిళ్లను, లేబుళ్లను సేకరించి వాటిలో నకిలీ, కల్తీ మద్యం నింపి తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు సత్యనారాయణ తెలిపారు. ఇలాంటి నకిలీ విక్రయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కల్తీ మద్యం వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లవచ్చునని చెప్పారు. వైన్ షాపుల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని సూచించారు.

ఇక ఎన్నికల సమరమే...

– డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



లాలాపేట: 'నాకు తెలిసిన సమాచారం ప్రకారం ఈ నెల 6న ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుంది. ఇక ఎన్నికల సమరానికి సిద్ధం కావాల్సిందే' అంటూ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తార్నాక డివిజన్‌లో పద్మారావు గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొన్న కార్యక్రమాలన్నీ ఎన్నికల ప్రచారాన్ని తలపించాయి. తార్నాక, లాలాపేటలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరైన పద్మారావు గౌడ్‌కు తెలంగాణ ఉద్యమ గీతాలతో, భారీ ఏర్పాట్లతో బీఆర్ఎస్ శ్రేణులు వెల్‌కం చెప్పాయి. తార్నాక సుదర్శన్‌రెడ్డి స్వీట్ హౌజ్ నుంచి నాగార్జున నగర్‌లోని బస్తీ దవాఖానా వరకు పాదయాత్రగా పెద్దఎత్తున కార్యకర్తలతో వెళ్లారు. బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాగిన పర్యటన పూర్తిగా ఎన్నికల వాతావరణాన్ని తలపించింది. స్థానికులంతా ఎన్నికల ప్రచారం ప్రారంభమైందని చర్చించుకోవడం కన్పించింది.

మహేష్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, ఎండీలపై చీటింగ్ కేసు

బంజారాహిల్స్: ఆర్‌బీఐ నిబంధనలు తుంగలో తొక్కుతూ రహస్యంగా బ్యాంకు కార్యకలాపాలలో పాల్గొనడంతో పాటు ఎన్‌పీఏగా ప్రకటించిన రుణాలను పొడిగిస్తున్నారన్న ఆరోపణలతో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఏపీ మహేష్ కో అపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్‌తో పాటు మేనేజింగ్ డైరెక్టర్ల మీద పలు సెక్షన్ల కింద కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్‌లోని ఏపీ మహేష్ కో అపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా ఉన్న రమేష్‌కుమార్ బంగ్, మేనేజింగ్‌డైరెక్టర్‌గా ఉన్న వీరేంద్ర ఖండేల్వాల్‌లపై నిధుల దుర్వినియోగం ఆరోపణలతో సుమారు మూడేళ్లుగా ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. డిపాజిటర్లను మోసం చేయడం, ఇతర అవకతవకల ఆరోపణతో పాటు వివిధ కోర్టులలో కేసులు ఉన్నాయి. దీంతో గత ఏడాది ఆర్‌బీఐ అధికారులు బ్యాంకు ఖాతాలను తనిఖీ చేయగా పలు ఉల్లంఘనలు బయటపడ్డాయి. ఈ క్రమంలో బ్యాంకు చైర్మన్ రమేష్‌కుమార్ బంగ్‌తో పాటు ఇతర డైరెక్టర్లు ఎవరూ రోజువారీ బ్యాంకు కార్యక్రమాల్లో పాల్గొనవద్దని, రుణాలను మంజూరు చేయవద్దని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆర్‌బీఐ ఆదేశాలను తుంగలో తొక్కిన చైర్మన్ రమేష్‌కుమార్ బంగ్‌తో పాటు మేనేజింగ్ డైరెక్టర్లు గత కొన్నినెలలుగా రోజువారీగా బ్యాంకుకు వస్తున్నారని, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల అనుమతి లేకుండా సుమారు రూ.90 కోట్ల మేర రుణాలను పొడిగించారని , తద్వారా పెద్ద ఎత్తున కమిషన్‌ను దండుకున్నారంటూ హిమాయత్‌నగర్‌కు చెందిన ప్రకాష్ అనే వ్యక్తి ఇటీవల కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో బంజారాహిల్స్ పోలీసులు మహేష్ బ్యాంక్ చైర్మన్ రమేష్‌కుమార్‌బంగ్, మేనేజింగ్ డైరెక్టర్ వీరేంద్ర ఖండేల్వాల్‌మీద ఐపీసీ 409,420, 468,471, 471-ఏ, రెడ్‌విత్ 120(బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరించాలి


డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేసిన టీజీపీఏ ప్రతినిధి బృందం

నల్లకుంట: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) హెల్త్ డైరెక్టర్‌ను కోరింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం హెల్త్ డైరెక్టర్(డీహెచ్) డాక్టర్ జి.శ్రీనివాస్‌ను కలిసిన టీజీపీఏ ప్రతినిధి బృందం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ.. తాము అందజేసిన వినతి పత్రానికి స్పందించిన డీహెచ్ సెక్షన్ అధికారుల నుంచి ఫైల్ తెప్పించి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న ఫార్మసిస్టులకు గ్రేడ్ వన్ పోస్టుల ప్రమోషన్‌లు ఇచ్చే విషయమై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అలాగే 38 జిల్లాల్లో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ఫార్మసీ సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీ చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో 750 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకై ఫైనాన్స్ విభాగం ఆమోదం కూడా ఉందని, వెంటనే ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్ జారీ చేయాలని ఈ సందర్భంగా డీహెచ్‌ను కోరామని చెప్పారు. డీహెచ్‌ను కలిసిన వారిలో టీజీపీఏ రాష్ట్ర కార్యదర్శి జె. సురేష్, అసోసియేటివ్ అధ్యక్షుడు జాలిగామ అశోక్, గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, కోశాధికారి యాదయ్య, ఉపాధ్యక్షులు చిలువేరి ఉదయ్ ప్రసాద్, ఎంఎల్ నాయక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సత్యం కొటం, ప్రధాన కార్యదర్శి నార్ల వేణుమాధవ్, ఎస్.సూరయ్య, ప్రియదర్శిని, సరిత, సంధ్య తదితరులున్నారు.

ఎల్లంపేట్‌లో చిన్నారులపై వీధి కుక్కల దాడి

– ఐదుగురికి గాయాలు



మేడ్చల్ రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో వీధి కుక్కలు మంగళవారం రెచ్చిపోయాయి. ఐదుగురు చిన్నారులపై దాడి చేయడంతో గాయాలపాలయ్యారు. మూడేళ్ల రుత్విక్, నాలుగేళ్ల కౌశిక్‌తో పాటు పలువురు చిన్నారులు ఇళ్ల ముందు ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారులు రుత్విక్, కౌశిక్‌లు తీవ్రంగా గాయపడగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా వీధి కుక్కల స్వైర విహారంపై గత మూడు నెలలుగా గ్రామ పంచాయతీ పాలకవర్గం అధికారులకు ఫిర్యాదు చేసినా, వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడం వల్లే నేడు చిన్నారులు ప్రమాదాల బారిన పడ్డారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

25 వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్
- ఇందిరాపార్కు వద్ద బీసీ సంఘం, నిరుద్యోగ జేఏసీ ధర్నా


ధర్నాలో అభివాదం చేస్తున్న నాయకులు

ముషీరాబాద్: తొమ్మిదేళ్లుగా టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించిన డీఎస్సీ వేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని పలువురు నేతలు విమర్శించారు. తెలంగాణ ఏర్పడితే బతుకులు బాగుపడతాయని ఆశించిన వారికి నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం, నిరుద్యోగ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా డీఎస్సీని ప్రకటించాలంటూ ఇందిరాపార్కు వద్ద మహాధర్నాను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్ కోదండరాంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.... 10 సంవత్సరాల పాలనలో కేసీఆర్ ఏ ఒక్కరోజుకూడా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను పలకరించిన సందర్భం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేలకు పైగా టీచర్‌పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 5 వేల పోస్టులను ప్రకటించి ప్రభుత్వంబాధ్యతల నుంచి తప్పుకుంటుందని విమర్శించారు. 5 వేల పోస్టుల నోటిఫికేషన్ రద్దు చేసి..25 వేల పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లడుతూ..ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం టీచర్‌పోస్టులను భర్తీ చేయడంలేదని ఆరోపించారు. నవంబర్‌లో జరగనున్న డీఎస్సీ పరీక్షను నాలుగు నెలలు వాయిదా వేసి అభ్యర్థుల ప్రిపరేషన్‌కు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల పాఠశాలల్లో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేరని, దీంతో ఆయా సబ్జెక్టులలో విద్యార్థులకు విషయ పరిజ్ఞానం లేక జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విఫలమవుతున్నారని చెప్పారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాధర్నాలో బీసీ నాయకులు రామ్మోహన్, నందగోపాల్, శివకృష్ణ, పి.వై.ఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

లిబర్టీ: విద్యార్థి మృతికి కారణమైన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ కోఆర్డినేటర్ ఇటికాల గణేష్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకుని కృష్ణవేణి స్కూల్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం సమాఖ్య కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో యూకేజీ విద్యార్థి హోమ్ వర్క్ చేయలేదని లావణ్య అనే స్కూల్ టీచర్ పలకతో కొట్టడంతో అతను మృతి చెందాడన్నారు. టీచర్, పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

శ్రీనగర్‌కాలనీ: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీనగర్ కాలనీలో రూ. 33లక్షలతో చేపట్టిన సీవరేజ్ పనులను, వాటర్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు అన్నుఖాన్, అప్పుఖాన్, చినబాబు, మధు, రవి, భిక్షపతి, ఫయాజ్, సోను, శ్రీనగర్‌కాలనీ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్యాపకేతర సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ

బంజారాహిల్స్: డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సి.ఎస్.టి.డీ) ఆధ్వర్యంలో అధ్యాపకేతర సిబ్బందికి ఆరు రోజుల పాటు జరగనున్న 'ట్యాలీ అకౌంటింగ్ ప్యాకేజీ' శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ప్రొ. ఘంటా చక్రపాణి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో పని చేసే సిబ్బంది ఎప్పటికప్పుడు ఆయా రంగాల్లో వస్తున్న ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఐ.సి.టి. పై పట్టు సాధించడం అంటే పని చేసే సంస్థపై పూర్తి అవగాహన కలిగి ఉండటమే అన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్ ఉపాధ్యక్షురాలు, డీన్ అకడమిక్స్ డా. సునీల కందూరి సాంకేతిక పరిజ్ఞానం ఉద్యోగులకు ఎంతగా అవసరం, నేర్చుకోవాల్సిన ఆవశ్యకతపై వివరించారు. సి.ఎస్.టి.డి డైరెక్టర్ ప్రొ. ఐ. ఆనంద్ పవార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సీ.ఎస్.టి.డి ఆధ్వర్యంలో అధ్యాపకేతర సిబ్బందికి వివిధ అంశాలపై మరిన్ని శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతుల్లో అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



బంజారాహిల్స్: సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజక వర్గ పరిధిలో 4500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు కేవలం 240 ఇళ్లు మాత్రమే నిర్మించారన్నారు. అంబేడ్కర్ నగర్ బస్తీలో 11 ఎకరాలు, దీన్‌దయాల్‌నగర్‌లో రెండెకరాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి భూమి కేటాయించడం జరిగిందని ఇంత వరకు వాటి ఊసే లేదన్నారు. పంజగుట్ట ప్రతాప్‌నగర్‌లో ఎమ్మెల్యే నిధుల కింద రూ. కోటి కేటాయించినా పనులు ప్రారంభం కాలేదన్నారు. పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీలో వంద గజాల స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా తాను కాపాడితే అందులో ఇప్పటి వదరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టలేదన్నారు. తాను గెలిచినా, గెలవకపోయినా ప్రజల్లోనే ఉన్నానని ఎమ్మెల్యే దానం మాత్రం ప్రజలకు పూర్తిగా దూరమయ్యారని ఈ ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెబుతారన్నారు.

'పాటొక్కటే మిగులుతుంది' పుస్తకావిష్కరణ

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో కాలం గుండెచప్పుడు బృందం ఆధ్వర్యంలో 'పాటొక్కటే మిగులుతుంది' పుస్తకాన్ని ఆవిష్కరించారు. తాడి ప్రకాశ్ సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో సినీ దర్శక నిర్మాత బి. నర్సింగరావు, ప్రొఫెసర్ చింతకింది కాశీం, అరుణోదయ రాష్ట్ర నాయకులు ఎస్.దాసు, అంబిక, యోచన, అరుణ భీంరెడ్డి, పి. మణి తదితరులు పాల్గొన్నారు.

ఓటుందా..! చెక్ చేసుకోండి..!

ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు

- కళాశాలల్లో చెక్ యువర్ ఓట్‌పై శిబిరాలు
- నేడు ఓటరు తుది జాబితా



ఖైరతాబాద్‌లో తాజా ఓటర్లు 2,82,080

గత నెల 21న విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం ఖైరతాబాద్ నియోజక వర్గ పరిధిలో మొత్తం ఓటర్లు 2,82,080గా తేలింది. 245 పోలింగ్ స్టేషన్లు ఉన్న నియోజక వర్గంలో పురుషులు 1,47,009 కాగా, మహిళలు 1,35,046, ఇతరులు 25 మంది ఉన్నారు. రెండు విడతలుగా నిర్వహించిన ఓటరు శిబిరాల్లో మొత్తం 29,390 మంది దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు ఈ ఏడాది జనవరి 5న విడుదల చేసిన మొదటి ముసాయిదా జాబితాలో ఓటర్ల సంఖ్య నియోజక వర్గంలో 2,79,497గా ఉంది. ఇందులో పురుషులు 1,45,951, మహిళలు 1,33,523, ఇతరులు 23 మంది ఉన్నారు. ఈ రెండు ముసాయిదా జాబితాల వ్యవధిలోనే కొత్త ఓటర్ల సంఖ్య 2583కు పెరిగింది. ఇప్పుడు తాజాగా ఈ నెల 4వ తేదీన విడుదల కానున్న తుది జాబితాలో ఎంత మంది ఓటర్లు ఉంటారన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.



కళాశాల విద్యార్థులకు చెక్ యువర్ ఓట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారులు

బంజారాహిల్స్: సార్వత్రిక ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటరు జాబితా రూపకల్పనపై అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు గత నెల రోజులుగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా జూలై 16 నుంచి అధికారులు అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. ముఖ్యంగా యువతపైనే దృష్టి కేంద్రీకరించి అర్హులందరిని కొత్తగా ఓటరుగా చేర్చేందుకు దరఖాస్తులు స్వీకరించారు. రెండు విడతలుగా ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించారు. ఫారం-6,7,8 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 19 వరకు కొనసాగింది. అనంతరం దరఖాస్తులను సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ నెల 4న తుది ఓటరు జాబితా ప్రకటించనున్న నేపథ్యంలో ఎన్నికల నిబంధనల మేరకు ఖైరతాబాద్ నియోజక వర్గ వ్యాప్తంగా సోమ, మంగళ వారాల్లో జీహెచ్ఎంసీ అధికారులు 'చెక్ యువర్ ఓట్' కార్యక్రమాన్ని చేపడుతున్నారు. తన ఓటు ఉందో లేదో పరిశీలించుకునేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నారు. ఓటు హక్కు ఉందా లేదా ఉంటే ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు దాటిన విద్యార్థులు తమ ఓటు ఉందో లేదో చూసుకునేలా వారిని సన్నద్ధం చేస్తున్నారు. దీనికి తోడు రెండు విడతలుగా నిర్వహించిన శిబిరాల్లో ఫారం-6,7,8 దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిశీలించేందుకు బీఎల్‌వోలు రంగంలోకి దిగారు. ఇప్పటికే ఈ ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చిందని అధికారులు తెలిపారు. మంగళవారం నాటికి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఓటు పరిశీలన శిబిరాల్లో ప్రత్యేక అధికారులను నియమించారు. ఓటు లేకున్నా ఇతర సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు చొరవ చూపిస్తున్నారు.

ఫారం-6కు 25 వేల దరఖాస్తులు...

ఓటర్లుగా పేరు నమోదు చేసుకునేందుకు ఖైరతాబాద్ నియోజక వర్గం నుంచి ఈ సారి పెద్ద సంఖ్యలో యువత ఆసక్తి చూపించారు. నియోజక వర్గంలో కొత్తగా ఓటు కోసం 29,390 దరఖాస్తులు రాగా ఇందులో 25 వేల దరఖాస్తులు యువత నుంచే అందాయి. చాలా మంది యువత సాంకేతికతను వినియోగించుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల అధికారులు కూడా అర్హులైన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి ఒక్కరు అర్హత ఉన్న వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా గత ఆరు నెలల నుంచి విస్తృతంగా కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు నిర్వహించారు.



దళిత పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్

పంజగుట్ట: దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు ప్రవేశపెట్టి దళితుల జీవితాల్లో వెలుగు నింపారని తెలంగాణ దళితబంధు వెలుగు వేదిక రాష్ట్ర అధ్యక్షులు పులిజాల గెల్వన్న అన్నారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం నాయకులు బి.దీపక్ కుమార్, బి.ఎస్.రమేష్ కుమార్, ఇటుక రాజు, మాల విజయ్ కుమార్‌తో కలిసి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లుగా దళితుల అభివృద్ధికి ఏ పార్టీ, నాయకుడు చిత్తశుద్ధితో కృషి చేయలేదన్నారు. కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా దళితబంధు ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలోని 118 నియోజకవర్గాల్లో మొదటి విడతగా ఒక్కో నియోజక వర్గానికి 100 కుటుంబాల చొప్పున 38,323 కుటుంబాలకు రూ. 4441.8 కోట్లు ఖర్చు చేసిందన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మూడు జిల్లాల లబ్ధిదారులకు మురుగు వ్యర్థాల రవాణా వాహనాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కనకరాజు, వెంకట్, కె.రవి, నిరంజన్, హరీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

పూర్తి వివరాలు తెలుసుకోవాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న ఏసీపీ మోహన్‌కుమార్

వెంగళరావునగర్ : రెంట్ ఎక్కువగా ఇస్తున్నారని అపరిచిత వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇవ్వకూడదని, పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాతే వారిని అనుమతించాలని పంజగుట్ట ఏసీపీ ఎస్.మోహన్ కుమార్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ 43వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలోని సీనియర్ సిటిజన్స్ డిగ్నిటీ హాల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మోహన్‌కుమార్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేవలం ఇళ్లకు వచ్చే వారే కాకుండా హాస్టల్స్‌లో ఉండాలన్నా తప్పనిసరిగా ఆధార్ తదితర వివరాలు తీసుకోవాలని సూచించారు. పోలీసు నిబంధనలను తప్పకుండా పాటించాలని వాటిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీలు, బస్తీల్లో నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇళ్లల్లో పనులు చేసే వారి నియామకంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మధురానగర్‌కాలనీ దినదినాభివృద్ధి చెందుతూ 43 వార్షికోత్సవాలు జరుపుకోవడం అభినందనీయమని, ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులను, కాలనీవాసులను ఆయన అభినందించారు. అనంతరం ఏసీపీని అసోసియేషన్ నేతలు సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, ఎం.కళ్యాణ చక్రవర్తి, ఉపాధ్యక్షులు సిహెచ్.సత్యనారాయణ రాజు, కోశాధికారి ఉప్పలయ్యలతో పాటుగా మాజీ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఓబీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

పంజగుట్ట: ఓబీసీ రిజర్వేషన్ల సాధనే ధ్యేయంగా భారతీయ ఓబీసీ సమాఖ్య పోరాటం చేస్తుందని సమాఖ్య జాతీయ అధ్యక్షులు కె.కోటేశ్వర్ రావు అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమాఖ్య సలహాదారులు, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యంతో కలిసి మాట్లాడుతూ .. ఇటీవల జరిగిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల సందర్భంగా సమాఖ్య ప్రతినిధుల ఢిల్లీలో వివిధ పార్టీల అధ్యక్షులు, కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసి ఓబీసీ రిజర్వేషన్, దేశవ్యాప్తంగా బీసీ కులగణనపై వినతి పత్రాలు అందజేసిందన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 10న ఖైరతాబాద్ లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించనున్న సమావేశంలో సమాఖ్య జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో షేక్ సత్తార్ సాహెబ్, వెంకట్రామ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్ రాములు

సీనియర్ పాత్రికేయుడు దత్తాత్రి ఆకస్మిక మృతి

హిమాయత్‌నగర్: సీనియర్ రిపోర్టర్ బి.దత్తాత్రి(53) ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున మెడ నొప్పికి గురైన ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. హిమాయత్‌నగర్‌లో స్ట్రీట్‌నెంబర్-8లోని దత్తాత్రి నివాసంలో ఆయన భౌతికాయాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబానికి అన్ని రకాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఐజేయూ జాతీయ అధ్యక్షులు కే.శ్రీనివాస్‌రెడ్డి, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈటీ నరసింహా, జిల్లా పార్టీ సెక్రటరీ ఛాయాదేవి, స్థానిక బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, పలువురు పాత్రికేయులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. దత్తాత్రికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లో దత్తాత్రి అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



దత్తాత్రి భౌతికాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి తలసాని

సెక్యూరిటీ గార్డు బలవన్మరణం

బంజారాహిల్స్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెంకు చెందిన దుబాసి రాజేంద్రప్రసాద్(36) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ భార్య నాగమ్మ, ఇద్దరు పిల్లలతో కలిసి యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్.నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గత కొన్నాళ్లుగా డ్యూటీకి వెళ్లకుండా మద్యం సేవిస్తూ ఆవారాగా తిరుగుతున్నాడు. భార్య నాగమ్మ వారం రోజుల క్రితం విధుల్లో భాగంగా ఒంగోలు వెళ్లింది. మంగళవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజేంద్రప్రసాద్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స

రెనోవా ఆస్పత్రి వైద్యుల ఘనత



బంజారాహిల్స్: ఓ బాలుని(07)కి అత్యంత క్లిష్టమైన లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి బంజారాహిల్స్‌లోని రెనోవా ఆస్పత్రి వైద్యులు ప్రాణాలు కాపాడారు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి , డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డా. ఆర్‌వీ రాఘవేందర్‌రావు వివరాలు వెల్లడించారు. షేక్ మహమ్మద్ అష్రాఫ్‌కు పుట్టుకతోనే జన్యుపరమైన కారణాలతో లివర్ డ్యామేజీ కావడం జరిగిందన్నారు. తమ ఆస్పత్రిలో అతడికి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించామని బాలుడు కోలుకున్నట్లు తెలిపారు.

16 నుంచి శ్రీవారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి 25 వరకు స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సీహెచ్. రామయ్య తెలిపారు. అలాగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15 నుంచి 23 వరకు ఆలయంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబా దేవీ అమ్మవారి నవవిధ అలంకారాలతో శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేడుకలకు సంబంధించిన బ్రోచర్‌ను ఈవో ఎన్. లావణ్యతో కలిసి ఆవిష్కరించారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయంలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. 16న శేషవాహన సేవతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ నెల 24న సాయంత్రం ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆధ్వర్యంలో శమీవృక్ష పూజ, రావణ దహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు శ్రీ మహాగణపతి పూజ, రుద్రాభిషేకం, శ్రీ చక్రార్చన, చండీహోమం జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు నర్సింగ్‌రావు, వెంకటేశ్వరరావు, ఎ. అరుణ, పి. నవీన్, వి. ఆదిలక్ష్మి, కే.ఎస్. సంతోష్‌కుమార్, వి. సుష్మ, కె. సాంబశివరావు, కె. లక్ష్మి, ప్రధాన అర్చకులు వి. మురళీధరశర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు అభినందనీయం



రహమత్‌నగర్ : నవరాత్రి ఉత్సవాలు,మీలాద్ ఉన్‌నబీ వేడుకలను విజయవంతం చేయడంలో పోలీసుల అందించిన సేవలు అభినందనీమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం బోరబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మీలాద్ ఉన్‌నబీ వేడుకలను శాంతియుతంగా జరిగేందుకు అహర్నిశలు శ్రమించిన పోలీసుల అభినందనీయులన్నారు. కార్యక్రమంలో నాయకులు జేపి జ్ఞానేశ్వర్, గ్యారనాగరాజు, రవీందర్‌రెడ్డి, సుందర్, కేశవులు, సాయి, రాంబాబు,, నయూం, యాదగిరి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు మద్దతు ఇవ్వడం అనైతికం

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజ్యాంగ సంస్థలపైనే కొందరు కేంద్రమంత్రులు ఒత్తిడి తీసుకువస్తున్నారని వీరు కేంద్ర మంత్రులుగా కాకుండా ఎమ్ఆర్‌పీఎస్ నాయకులుగా పనిచేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జీ.చెన్నయ్య అన్నారు. మంగళవారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ .. ఇటీవల జరిగిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకుండా అడ్డుకుని వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించామన్నారు. అన్ని పార్టీల ఎంపీలు, కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా పేర్కొందని అయితే కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి కేంద్ర సామాజిక సాధికారత సహాయ మంత్రి నారాయణ స్వామి రాజ్యాంగబద్ధ సంస్థలైన ఎస్సీ కమిషన్, సుప్రీంకోర్టు, సామాజిక సాధికారత శాఖలపైన ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. కేవలం ఒక వర్గం ఓట్లకోసం వీరు దళితులను చీల్చేందుకు, ఎమ్ఆర్‌పీఎస్ నాయకుల్లా పనిచేస్తున్నారని వీరిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ వర్గీకరణ చేపడితే కర్ణాటక ఫలితాలే దేశవ్యాప్తంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మన్నె శ్రీధర్‌రావు, రాజేష్, బైండ్ల శ్రీనివాస్, గోకుల కల్యాణ్, శ్రీకాంత్, శ్రీరామ్, మేకల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శ్రీకారం

బంజారాహిల్స్: మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి ప్రజలకు సమస్యలు లేకుండా చూడాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం ఆయన బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన మంచినీటి, సీవరేజి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇందిరానగర్, జవహర్‌నగర్‌లో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు తెలిపారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో ఒకే రోజు రూ. 2.2 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని పనులన్నీ బుధవారం నుంచే ప్రారంభం అవుతాయన్నారు.

తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఏర్పాటు

పంజగుట్ట: దేశంలో కొనసాగుతున్న రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకులా వాడుకుంటున్నాయని తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ పాండు యాదవ్ అన్నారు. సమాజ కాంగ్రెస్ పార్టీ కేవలం బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. మంగళవారం పంజగుట్టలో పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చైర్మన్‌గా డాక్టర్ పి.వినయ్ కుమార్, కన్వీనర్‌గా పాండు యాదవ్, వైస్ చైర్మన్‌గా డాక్టర్ అనుమల్ల సత్యనారాయణ, సభ్యులు మలిచేటి వెంకట్ రెడ్డి, కె.నరసింహారావు, కాశీనాథ్, నరసింహాచారి, అరుణ్ కుమార్, నాగరాజు యాదవ్, గౌతం, శ్రీహరి, సైఫుద్దీన్, విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, కో ఆర్డినెటర్ ఎల్.కె.అశోక్, ఆహ్వానితులు దోసపల్లి నరహరి, గుట్ట గంగాధర్, చంద్రశేఖర్ రెడ్డి, నవీన్ కుమార్, మేఘాజీ వేణు, ఆర్.విజయేంద్ర, ఓదెల సురేష్ బాబులను ఎన్నుకున్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రైతు సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించి, మద్దతు ధర ఇవ్వాలని, పండించిన పంట మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మహిళలకు అన్ని రంగాల్లో 33 శాతం రిజర్వేషన్లు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆడబిడ్డలకు అన్నలా తోడుంటా

రహమత్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా పక్షపాతి అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మహిళా సాధికారత సాధమన్నారు. మంగళవారం హైటెక్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మూడు వేల మంది మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా తన సొంత నిధులతో కుక్కర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని మహిళలకు తాను అన్నలాగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఏ కార్యక్రమం జరిగిన మహిళలను ఖాళీ చేతులతో పంపానని స్పష్టం చేశారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరోసారి గులాబీజెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కోఆర్డినేటర్ విజయసింహ, విజయ్‌కుమార్, షేక్ షరీఫ్, దేవమణి, ధర్మ, బాబానాయక్, బాబురావు, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో పైప్‌లైన్ పనులు ప్రారంభం...

రహమత్‌నగర్ డివిజన్‌లోని శ్రీరాంనగర్‌లో రూ 13.25 లక్షలతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రారంభించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నజీర్, మన్సూర్, ఫయాజ్, సింగారి శ్రీనివాస్, ధనూజ, రవిశంకర్ , సయ్యద్ బషీర్, జబ్బార్, వేములు జగన్, సమీనా, బల్వంత్ సింగ్, అహ్మద్, షరీఫ్‌లు పాల్గొన్నారు.



విద్యుత్ బకాయిల చెల్లింపుపై తీర్పు వాయిదా

రూ.6,756.92 కోట్లు ఇవ్వాల్సిందే అంటున్న ఏపీ

- చెల్లింపుపై గతంలో ఇచ్చిన స్టేను పొడిగించాలన్న తెలంగాణ
- వెంటనే సొమ్ము చెల్లించేలా చూడాలన్న ఏపీ
- సీజే ధర్మాసనం వద్ద వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ మధ్య నెలకొన్న విద్యుత్ బకాయిల వివాదంలో హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. బకాయిలు వెంటనే చెల్లించేలా చూడాలంటూ ఏపీ.. దీనిపై ఇప్పటికే ఇచ్చిన స్టేను పొడిగించాలంటూ తెలంగాణ వివిధ అంశాలను ప్రస్తావిస్తూ సుదీర్ఘంగా వాదనలు వినిపించగా.. హైకోర్టు మంగళవారం తన తీర్పును రిజర్వు చేసింది.

కేంద్రం ప్రకటన నేపథ్యంలో

రాష్ట్ర విభజన తర్వాత సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తమకు తెలంగాణ నుంచి రూ.6,756.92 కోట్లు (అసలు రూ.3,441.78 కోట్లు, వడ్డీ, సర్‌చార్జీలు కలిపి మరో రూ.3,315.14 కోట్లు) రావాల్సి ఉందని ఏపీ వాదిస్తోంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ఏపీకి 30రోజుల్లోగా రూ.6,756.92 కోట్లు చెల్లించాలంటూ 2022 ఆగస్టు 29న తెలంగాణకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు 2022 సెప్టెంబర్‌లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు వేశాయి. వాటిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. బకాయిల విషయంలో తెలంగాణ సర్కార్‌పై ఒత్తిడి తేవొద్దని స్టే ఇచ్చింది. ఈ వ్యవహారం ఇలా కోర్టులో ఉండగానే.. విద్యుత్ బకాయిలు తప్పకుండా చెల్లించాలని ఆదేశించినా తెలంగాణ ఇవ్వడం లేదని.. అందువల్ల రిజర్వు బ్యాంకులోని తెలంగాణ ఖాతా నుంచి సొమ్మును మినహాయించుకుని ఏపీకి చెల్లించే ప్రయత్నం చేస్తున్నట్లు కేంద్రం పార్లమెంటులో వెల్లడించింది. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్ సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చింది. దీనితో కేంద్రం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని, చెల్లింపులపై స్టేను పొడిగించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులోని ప్రధాన పిటిషన్‌లో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది.

ముందు విభజన సమస్యలు తేల్చాలంటూ..

తెలంగాణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యలపై పూర్తిగా చర్చించకపోవడంతో ఈ ఇబ్బంది మొదలైందని వివరించారు. వివిధ అంశాల్లో ఏపీ కేంద్రానికి సహకరిస్తోందని.. అందువల్ల ఆ రాష్ట్రానికి అనుకూలంగా కేంద్రం నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. పునర్వ్యవస్థీకరణ చట్టం నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉండగానే.. కేంద్రం కఠిన నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అసలు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 92 ప్రకారం ఈ వివాదంలో జోక్యం చేసుకునే అధికారం కేంద్రానికి లేదని వివరించారు.

బకాయిల వల్ల ఇబ్బందుల్లో ఏపీ డిస్కమ్‌లు

తెలంగాణ బకాయిలు చెల్లించకపోవడంతో ఏపీ విద్యుత్ డిస్కమ్‌లు ఆర్థిక ఇబ్బందుల్లో పడాల్సి వచ్చిందని ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పునర్విభజన తర్వాత విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు సంబంధించిన ఈ బకాయిలకు, పునర్విభజన చట్టానికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభజన తర్వాత 2017 వరకు కూడా ఏపీ డిస్కమ్‌లు తెలంగాణకు విద్యుత్ సరఫరా చేశాయన్నారు. బకాయిలు చెల్లించక బొగ్గు సరఫరా నిలిచిపోయిందని, తెలంగాణకు విద్యుత్ నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు. బకాయి ఉన్న విషయాన్ని తెలంగాణ కూడా అంగీకరిస్తోందని గుర్తు చేశారు. ఇక.. కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ సూర్యకిరణ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేంద్రం జోక్యంతోనే తెలంగాణకు ఏపీ విద్యుత్ సరఫరా చేసిందని, బకాయిల చెల్లింపుపై ఉత్తర్వులు ఇచ్చే అధికారం కేంద్రానికి ఉందని కోర్టుకు వివరించారు. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్‌ల ధర్మాసనం మంగళవారం తీర్పు రిజర్వు చేసింది.

కాంగ్రెస్, బీజేపీలను పాతర పెట్టాలి

- గజ్వేల్‌లో మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు
- పీసీసీ అంటే పేమెంట్ కలెక్షన్ సెంటర్
- బీజేపీని నమ్ముకుంటే అధోగతే



సిద్దిపేట జిల్లా కొండపాకలో మంగళవారం ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్స్‌ను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: 'పీసీసీ అంటేనే పేమెంట్ కలెక్షన్ సెంటర్. బీజేపీని నమ్ముకుంటే అధోగతే. ఈ రెండు పార్టీలను పాతాళంలో పాతర పెట్టాలి. ఉచిత కరెంటు, మూడు పంటలు, ధాన్యపు రాశులు కావాలంటే కేసీఆర్ వెంటే నడవాలి..' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో రూ.540 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల తీరుపై మండిపడ్డారు. గత కాంగ్రెస్ హయాంలో ఎరువులు, విత్తనాల కోసం చెప్పులతో క్యూలు కట్టిన రోజులు రైతులు నేటికీ మరిచిపోలేదన్నారు. కరెంట్ సక్రమంగా రాక పంటలు ఎండిపోయి అన్నదాతలు అప్పుల పాలయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. తప్పుదారి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉచిత కరెంట్ ఆగమైతదని రైతులు గుర్తించారని చెప్పారు. బీజేపీ వల్ల కూడా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. కేసీఆర్ రైతే రాజు అనే సిద్ధాంతాన్ని నమ్ముకొని ముందుకు సాగటం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని, ఆయన గజ్వేల్‌లోనే ఉండాలనుకుంటే రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ కానుకగా అందించే బాధ్యత ఇక్కడి ప్రజలపై ఉందని చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు కేసీఆర్ గృహలక్ష్మి పథకం కింద 10 వేల ఇళ్లను మంజూరు చేశారని ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు పలు సంఘాల మద్దతు

గజ్వేల్ నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పలు సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాయి. గజ్వేల్ ఆర్యవైశ్య సంఘం, కుమ్మరి సంఘం, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, పద్మశాలి సంఘాలు ఈ మేరకు చేసిన తీర్మానాలను మంత్రి హరీశ్‌రావుకు అందించాయి.

కాంగ్రెస్‌ది గతం.. ఇప్పుడు ఖతం!

- వారంటీ ముగిసిన పార్టీ గ్యారంటీ ఎలా ఇస్తుంది?
- మోదీని కేసీఆర్ విమర్శించినంతగా వేరే ఎవరూ విమర్శించలేరు
- బీజేపీతో ఎలాంటి మిలాఖత్ లేదనడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలి
- జగిత్యాల సభలో మంత్రి కేటీఆర్



జగిత్యాల జిల్లా నూకపల్లిలో కేటీఆర్‌కు స్వీట్ అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుని కుమారుడు

జగిత్యాల, జగిత్యాల క్రైం, ధర్మపురి, సిరిసిల్ల, సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీది గతమని, ఇప్పుడా పార్టీ ఖతమైందని, వారంటీ ముగిసిన పార్టీ గ్యారంటీ ఎలా ఇస్తుందని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. 150 ఏళ్ల కాంగ్రెస్ వారంటీ అయిపోయిందని, ఆరు గ్యారంటీలు ఇస్తే ప్రజలు నమ్ముతారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు 24 గంటల కరెంట్‌పై అనుమానం ఉందని, జగిత్యాల నియోజకవర్గానికి వచ్చి కరెంట్ తీగలు పట్టుకుంటే తెలుస్తుందని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ దరిద్రం పోతుందని వ్యాఖ్యానించారు.

రేవంత్ ఆర్ఎస్ఎస్ ఏజెంట్

రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ ఏజెంట్ అని, ఆ పార్టీ నేత పంజాబ్ ముఖ్యమంత్రి అమరేందర్ సోనియాకు సైతం లేఖ రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. బీజేపీ మతపిచ్చి పార్టీ అని, జనాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకోవడమే ఆ పార్టీకి తెలుసని ధ్వజమెత్తారు. పీఎం మోదీని సీఎం కేసీఆర్ విమర్శించినంతగా వేరే ఎవరూ విమర్శించలేరని, మాకు ఆ పార్టీతో, మోదీతో ఎలాంటి మిలాఖత్ లేదనడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. మోదీది గాడ్సే వారసత్వమని ఆరోపించారు.

బీఆర్ఎస్ అంటే కాళేశ్వరం.. కాంగ్రెస్ అంటే శనీశ్వరం

బీఆర్ఎస్ అంటే కాళేశ్వరమని, కాంగ్రెస్ అంటే శనీశ్వరమని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మాతాశిశు ఆస్పత్రితోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. నరేంద్రమోదీ అంటే నమ్మించి మోసం చేసేవాడని విమర్శించారు. కాగా జగిత్యాల జిల్లాకేంద్రంలో నిర్మించిన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్‌తో కలిసి హోం మంత్రి మహమూద్‌అలీ ప్రారంభించారు.

ఒక్క రూపాయి లంచం లేకుండా..

రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంత్రి కేటీఆర్ 577 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు, 1,747 మందికి గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా ప్రజలకు లబ్ధి కలిగే విధంగా కేసీఆర్ పాలన వర్ధిల్లుతోందన్నారు.

మోదీ అబద్ధాల జాతర

ఎక్స్(ట్విట్టర్)లో మంత్రి కేటీఆర్ ధ్వజం

పీఎం నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలనే కాకుండా 140 కోట్ల మంది భారతీయులను మోసం చేశారని మంత్రి కేటీ రామారావు సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో ధ్వజమెత్తారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి విభజన హామీలకు దిక్కులేకుండా పోయిందని ఆరోపించారు. మూడు రోజుల వ్యవధిలో రెండోసారి రాష్ట్రానికి వస్తున్న మోదీ విభజన హామీలకు పదేళ్లుగా పాతరేసి అబద్ధాల జాతర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వంద స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్‌కు వీడ్కోలు

- ముగిసిన పదవీకాలం
- పొడిగింపులేక తప్పుకున్న బాజిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ చైర్మన్‌గా పదవీకాలం ముగియటంతో ఆ పదవి నుంచి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తప్పుకున్నారు. మరికొద్ది నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల వరకు బాజిరెడ్డి ఆ పదవిలో కొనసాగుతారని ఆర్టీసీ వర్గాలు భావించాయి. కానీ, పదవీకాలం ముగిసినా ప్రభుత్వం నుంచి పొడగింపు ఆదేశాలు వెలువడలేదు. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో ఆశాభంగం కలిగిన సిట్టింగ్‌లను బుజ్జగించేందుకు ఆర్టీసీ చైర్మన్ పదవి లాంటి వాటిని వారికి అప్పగించవచ్చని, అందుకే బాజిరెడ్డికి కొనసాగింపు అవకాశం ఇవ్వలేదన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇక్కడి బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆధ్వర్యంలో బాజిరెడ్డికి వీడ్కోలు సమావేశం జరిగింది. బాజిరెడ్డి దంపతులను ఆర్టీసీ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. రెండేళ్ల పదవీకాలంలో, ఆర్టీసీ అభ్యున్నతికి బాజిరెడ్డి ఎంతో కృషి చేశారంటూ అధికారులు కితాబిచ్చారు. ''రెండేళ్లపాటు ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేయటం, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆర్టీసీని బాగు చేసేందుకు ఎండీ సజ్జనార్‌తో కలిసి కృషి చేయడం జీవితంలో మరవలేను. నేను చైర్మన్‌గా ఉన్న సమయంలోనే, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం నాకు ఎంతో సంతోషం కలిగించింది''అని బాజిరెడ్డి పేర్కొన్నారు.

6న ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6 నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాష్ట్రంలోని మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ, యువతలో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడా పరికరాల కిట్లను అందచేసే కార్యక్రమాలను ముమ్మరంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి కలెక్టర్లతో మంగళవారం రాత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి అల్పా హార పథకాన్ని సీఎం కేసీఆర్ రంగారెడ్డి జిల్లాలో లాంఛనంగా ప్రారంభిస్తారని, ఈ నెల 14 నాటికి బతుకమ్మ చీరెల పంపిణీని పూర్తి చేయాలని చెప్పారు.

నగర వార్తలు

యువజన కాంగ్రెస్ మీడియా సెల్ కో-కన్వీనర్‌గా మధుకర్



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ యువజన కాంగ్రెస్ మీడియా సెల్ కో-కన్వీనర్‌గా అమ్ముల మధుకర్ యాదవ్‌ను నియమిస్తూ జాతీయ యువజన కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ వరుణ్ పాండే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధుకర్ యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మీడియా సెల్ కో-కన్వీనర్‌గా నియమించినందుకు, అందుకు సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్టీపీ పనులు పరిశీలించిన జలమండలి ఎండీ



సాక్షి, సిటీబ్యూరో: తుది దశ నిర్మాణంలో ఉన్న ఎస్టీపీల పనుల్ని ఏకకాలంలో చేయాలని ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. ఫతేనగర్, మియాపూర్-పటేల్ చెరువు మురుగు నీటి శుద్ధి కేంద్రాల్ని మంగళవారం ఆయన సందర్శించారు. మొదట గా ఫతేనగర్ (133 ఎంఎల్డీ సామర్థ్యం) ఎస్టీపీని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించారు. ఎస్టీపీ నిర్మాణం తుది దశలో ఉన్నందున.. ప్రధాన పనులతో పాటు చిన్న పనులపైనా దృష్టి సారించాలని అన్నారు. పనులు నిరాటంకంగా జరిగేందుకు అదనపు కార్మికుల బృందాలను సమకూర్చుకోవాలన్నారు. వీరంతా 3 షిఫ్టుల్లో పని చేసేలా చూడాలని సూచించారు. రాత్రి వేళల్లో పనులు సజావుగా సాగేందుకు లైటింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇటు సివిల్ పనులు, అటు యంత్రాల బిగింపు పనులు సమాంతరంగా చేపట్టాలని సూచించారు. ఆ తర్వాత మియాపూర్ పటేల్ చెరువు (10 ఎంఎల్డీల సామర్థ్యం) ఎస్టీపీ పనులు పరిశీలించి రెండు ఎస్టీపీల ప్రాంగణాల్లో అంతర్గత రహదారులు, సుందరీకరణ, పెయింటింగ్ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఎస్టీపీ సీజీఎంలు రఘు, సుజాత, జీఎంలు, ఇతర అధికారులు నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సదరం పరీక్షల తిప్పలకు చెక్!

- నగరంలో మరో రెండు కేంద్రాలు
- గోల్కొండ ఆసుపత్రిలో కేంద్రం ప్రారంభం
- నేడు నాంపల్లి ఆసుపత్రిలో మరో కేంద్రం

సాక్షి, సిటీబ్యూరో: ఇక హైదరాబాద్‌లో సదరం 'పరీక్షల' తిప్పలకు చెక్ పడనుంది. అదనంగా మరో రెండు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. తాజాగా మంగళవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ప్రారంభించగా, బుధవారం మరో కేంద్రం నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో ప్రారంభం కానుంది. వైకల్యం నిర్ధారణ పరీక్షలకు వారం వారం నిర్వహించే సదరం శిబిరాలు తక్కువగా ఉండటంతో నిరీక్షణ తప్పడంలేదు. ఫలితంగా ఆన్‌లైన్ స్లాట్లు సైతం అందని ద్రాక్షగా మారాయి. పక్షం రోజులకు ఒకసారి విడుదల చేస్తున్న స్లాట్లు ఏ మూలకు సరిపోని పరిస్థితి నెలకొంది. వాస్తవంగా నగరంలో ఆరు సదరం శిబిరాల కేంద్రాలు ఉన్నాయి. శారీరక వైకల్యం, మానసిక రుగ్మత, వినికిడి లోపం, కంటి రుగ్మతలు లాంటి నాలుగు వైకల్య నిర్ధారణ పరీక్షలు ప్రత్యేక శిబిరాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఒక్కో వైకల్యానికి ఒక్కొక కేంద్రాన్ని ప్రత్యేకంగా కేటాయించి ప్రతి వారం శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

రెండు కేంద్రాల్లో మానసిక వైకల్య పరీక్షలు

మానసిక వైకల్య నిర్థాణ పరీక్షలకు రెండు కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. నిలోఫర్ అసుపత్రిలో 18 సంవత్సరాల లోపు, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో 18 సంవత్సరాల పైబడిన వారికి వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సరోజినీదేవి కంటి, ఈఎన్‌టీ ఆసుపత్రుల్లో వినికిడి లోపం పరీక్షలు, మరో రెండు ఆసుపత్రుల్లో శారీరక వైకల్య పరీక్షల కోసం ప్రతి వారం క్యాంపులు నిర్వహిస్తున్నారు.

స్లాట్ బుకింగ్ ఇలా...

కొత్తగా వైకల్య నిర్ధారణ పరీక్షలు కోసం మీ సేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సదరం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఆధార్ నెంబర్, వివరాలు నమోదుతో దరఖాస్తు చేసుకుంటే తేదీ, సమయం, కేంద్రం కూడిన స్లాట్ లభిస్తోంది. స్లాట్ ప్రకారం దరఖాస్తుదారులైన దివ్యాంగులు మీ సేవ కేంద్రం రసీదు, ఆధార్ జిరాక్స్, ఒక పాస్ పోర్టు సైజ్ ఫొటో, మెడికల్ రిపోర్ట్స్‌తో సదరం కేంద్రానికి హాజరు కావాల్సి ఉంటుంది. స్లాట్ ప్రకారం సదరం క్యాంపునకు హాజరు కాకపోతే రెండు రోజుల తర్వాత తిరిగి మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. సదరం కేంద్రంలో సంబంధిత వైద్య బృందం పరీక్షలు నిర్వహించి వైకల్యాన్ని నమోదు చేస్తోంది.



గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంపును ప్రారంభించి ప్రసంగిస్తున్న కలెక్టర్ అనుదీప్

వైకల్యంపైనే..

మెడికల్ బోర్డు ఆన్‌లైన్ వివరాలను పరిశీలించి వైకల్యాన్ని నిర్ధారించిన తర్వాతే తాత్కాలిక, శాశ్వత ధ్రువీకరణ పత్రాల జారీపై నిర్ణయం తీసుకుంటారు. తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలను ఒకటి, రెండు, మూడు, నాలుగు సంవత్సరాల వరకు వర్తించేలా జారీ చేస్తారు. తాత్కాలిక సదరం సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం కూడా తిరిగి స్లాట్ బుకింగ్ చేసుకొని వైకల్య నిర్ధారణ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది.

గోల్కొండ ఆసుపత్రిలో..

గోల్కొండ: గోల్కొండ ప్రాంతీయ ఆసుపత్రిలో సదరం క్యాంపును హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. ప్రతి మంగళవారం క్యాంపు జరగనుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగవైకల్యం ఉన్న వారిని పరీక్షించి 40 శాతం కంటే ఎక్కువ ఉన్న వారికి సదరం సర్టిఫికెట్లను జారీ చేస్తారని చెప్పారు. వికలాంగుల కేటగిరీల పెన్షన్ల కోసం సదరం ధ్రువీకరణ తప్పని సరన్నారు. సదరం క్యాంపునకు వచ్చేవారు ముందుగా మీ సేవ కేంద్రంలో నమోదు చేసుకొని, దాని ప్రకారం వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ క్యాంపు విజయవంతంగా నడవడానికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజాహరుల్లా, ఆర్ఎంఓ శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాములు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టును వెల్లడించాలి

ముషీరాబాద్: బిహార్‌లో కుల జనగణన చేయడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా 2015లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బహిర్గతం చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు, డివిజన్ , మండల, మున్సిపల్, కార్పొరేషన్, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో ఈ కులగణన వివరాలను ప్రకటించినట్లైతే దాని ద్వారా ఎవరి జనాభా ఎంత ఉందో తెలుస్తుందని ఆ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కూడా ప్రకటించవచ్చన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. గత 73 ఏళ్లుగా బీసీ జనగణన అంశంలో అన్ని కేంద్ర ప్రభుత్వాలు దాటవేత నేపథ్యంలో బిహార్‌లోని బీసీ జనాభా 63 శాతంగా తెలినందున అదే ప్రామాణికంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు మల్లేష్‌యాదవ్, సుధాకర్‌ముదిరాజ్, అడ్వకేట్ శ్రీనివాస్, శేఖర్, మురళీధర్ దేశ్‌పాండే, చంద్రశేఖర్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

7న తలసేమియా అవగాహన జాతీయ సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: సామాజికంగా తలసేమియా వ్యాధి తీవ్రత, సంరక్షణ విధానాలపైన అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతగానో ఉందని నగరంలోని తలసేమియా-సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్)హైదరాబాద్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 7న భారీస్థాయితో అవగాహన కల్పించడానికి 2వ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. శివరాంపల్లిలోని టీఎస్‌సీఎస్ హైదరాబాద్ వేదికగా ఉదయం 9 గంటల నుంచి కొనసాగనున్న ఈ సదస్సులో అంతర్జాతీయ వక్తలు గ్రీస్‌లోని సైప్రస్ మెడికల్ స్కూల్ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డిమిత్రియోస్ ఫార్మాకిస్, ఇటలీలోని క్యూర్ టూ చిల్డ్రన్ ఫౌండేషన్ బీఎంటీ స్పెషలిస్టు డాక్టర్ లారెన్స్ ఫాల్క్‌నర్‌లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని వివరించారు. 'అవేర్, షేర్, కేర్ అండ్ క్యూర్ ఫర్ తలసేమియా'(అవగాహన, భాగస్వామ్యం, సంరక్షణ, నివారణ) అనే నినాదంతో జరగనున్న ఈ సదస్సులో టీఎస్‌సీఎస్ నిర్వహణ బృందంతో పాటు ప్రముఖ నిపుణులచే పలు సెషన్లు నిర్వహించనున్నారు. అంతేకాకుండా ఇదే వేదికపై ఏర్పాటు చేస్తున్న ప్యానెల్ చర్చలో వైద్య పరిశోధనలో సాధిస్తున్న పురోగతి, రోగి సంరక్షణ, సహాయక వ్యవస్థలకు చికిత్స వంటి కీలక అంశాలపై ముఖ్య అతిథులు చర్చించనున్నారు.

పార్కు చేసిన వాహనాలే టార్గెట్

- బైకు దొంగల అరెస్టు
- ఆరు వాహనాల స్వాధీనం



సీఐ జదీశ్వర్ రావుతో కలిసి వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ సైదయ్య

నల్లకుంట: జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలు చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు యువకులతో పాటు ఓ మైనర్‌ని అదుపులోకి తీసుకున్న నల్లకుంట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఓయూ ఏసీపీ ఎస్.సైదయ్య, నల్లకుంట ఎస్‌హెచ్‌ఓ బి.జగదీశ్వర్‌రావు, డీఐ డి.రవి కుమార్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. మంచిర్యాల, బెల్లంపల్లికి చెందిన ఆకిరెడ్డి కొమురయ్య కుమారుడు ఆకిరెడ్డి ప్రవీణ్ (20) ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ చదువుకుంటూ రాంనగర్ ఆర్ఎస్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడిన ప్రవీణ్ సులువుగా డబ్బులు సంపాదించేందుకై వాహనాలు చోరీ చేయాలని పథకం రచించారు. ఇదే విషయాన్ని అదే గ్రామానికి చెందిన బోయిన శంకరయ్య కుమారుడు బోయిని రాజమ్ (20) దినసరి కూలీ, మరో మైనర్ బాలుడికి తన పథకాన్ని చెప్పాడు. ముగ్గురు కలిసి పథకం ప్రకారం నల్లకుంట, ఎస్ఆర్ నగర్, సిద్దిపేట, చిన్న కోడూరు, బెల్లంపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో పార్కింగ్ చేసిన వాహనాలు చోరీ చేయడం మొదలు పెట్టారు. ఇటీవల నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు పీఎస్ పరిధిలోని 50 సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. విశ్వసనీయ సమాచారంతో పాటు ఉన్నతాధికారుల సూచనలతో నల్లకుంట డీఐ రవి కుమార్ నేతృత్వంలో క్రైం ఎస్ఐ కృష్ణ తన బృందం సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ప్రవీణ్ నివాసముంటున్న ఇంటిపై దాడిచేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ప్రవీణ్‌తో పాటు మరో యువకుడిని, మైనర్‌ను కూడా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకు వచ్చారు. పోలీసుల విచారణలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆరు ద్విచక్రవాహనాలు చోరీచేసినట్టు నిందితులు అంగీకరించారు. ఆకిరెడ్డి ప్రవీణ్ ఏ1, బోయిని రాజమ్ ఏ2గా, మైనర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు వారి నుంచి రూ.11,49,795 విలువైన ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం నాల్గో మెట్రోపాలిటిన్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి నిందితులకు రిమాండ్ విధించారు. నిందితుల్లో మైనర్‌ను జువైనల్ హోమ్‌కు తరలించారు.

15 నుంచి నవకర్ నవరాత్రి ఉత్సవ్

- బేగంపేట పోలీస్ హాకీ గ్రౌండ్ వేదిక
- ఉచిత గార్బా వర్క్‌షాప్ ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: బేగంపేటలోని పోలీస్ హాకీ గ్రౌండ్ వేదికగా ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు సీజన్-6 నవకర్ నవరాత్రి ఉత్సవ్-2023 ను నిర్వహిస్తామని నిర్వాహకులు కవితా జైన్ తెలిపారు. ఈ ఉత్సవ్‌కు సంబంధించిన నవకర్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్రాండ్ పాస్ లాంచ్ కార్యక్రమాన్ని మంగళవారం సోమాజిగూడలోని జల్సాన్ వేదికగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్సవ్‌లో పాల్గొనే వంద మంది కోసం ప్రఖ్యాత సామాజికవేత్త బీనా మెహతా, గుజరాతీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జిగ్నేష్ దోషి ఆధ్వర్యంలో ఉచిత గార్బా వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కవితా జైన్ మాట్లాడుతూ ... గత సీజన్ల కన్నా మరింత ఘనంగా ఈ ఉత్సవ్‌ను జరుపుతున్నామన్నారు. అష్టమి రోజున పాల్గొనే వారందరికీ 25 లక్షల విలువైన ప్రత్యేక బహుమతులు అందిస్తున్నామని అన్నారు. ఈ ఉత్సవ్‌లో ప్రముఖ బాలీవుడ్ సెలబ్రిటీ గౌరవ్ కన్నా సందడి చేస్తారన్నారు. ఉత్సవ్‌లో భారీ ఫుడ్‌కోర్ట్‌తో పాటు అద్భుత ఏఆర్‌టీ అనుభవాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సులేమాంజీ (దర్పన్), పాయల్ సరాఫ్, విజయ్ సురానా, పవన్ పాండ్యా, సురేష్, మీనా నవీందర్, అనన్య సిమిలై, మమతా జైన్, పాయల్ లైన్, మంజు అగర్వాల్, రియా, రీనా అగర్వాల్, శృతి, కోమల్, ప్రీతి, ఝలక్ తదితరులు పాల్గొన్నారు.



నవకర్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్రాండ్ పాస్ ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 4-10-2023

ఆమె ముగ్గురు పిల్లలకు కన్నతల్లి.
మరో ఐదుగురికి దత్తత తల్లి.
కుగ్రామాల మహిళలకు వైద్య నారాయణి.
వీటికి తోడు తాజా విజయం 'మిసెస్ తెలంగాణ'


డాక్టర్ స్రవంతి

ఓ మంచి డాక్టరమ్మ @ మిసెస్ తెలంగాణ

డాక్టర్ స్రవంతి గాదిరాజు... తెలంగాణ, నిజామాబాద్‌లో డాక్టర్. యూఎస్‌లో గైనిక్ ఆంకాలజీ చేసి తెలుగు రాష్ట్రాల్లోని ఆదివాసీ మహిళల్లో ఎదురవుతున్న సర్వైకల్ క్యాన్సర్ నిర్మూలన కోసం పని చేస్తున్నారు. 'డాక్టర్ తన ఉద్యోగం హాస్పిటల్‌లోనే అనుకుంటే సమాజం సంపూర్ణ ఆరోగ్యవంతం కాలేదు. పేషెంట్‌లను వెతుక్కుంటూ వైద్యులు వెళ్లగలగాలి. అప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలం. అందుకోసమే ఆదివాసీలు ఎక్కువగా నివసించే, ఆరోగ్యం పట్ల కనీస అవగాహన లేని వారి ఇళ్ల ముందుకు వెళ్తున్నాను. ఆరోగ్య పరిరక్షణ అవసరాన్ని తెలియచేస్తున్నాను. నాలోని ఈ గుణమే నన్ను మిసెస్ తెలంగాణ పోటీల్లో విజేతగా నిలిపింది. నేను బ్యూటీ కాంటెస్ట్‌ల వైపు అడుగులు వేయడం సెలబ్రిటీ గుర్తింపు కోసం కాదు. ఒకవేళ సెలబ్రిటీ గుర్తింపు వస్తే... ఆ గుర్తింపుతో సమాజంలో నేను కోరుకున్న మార్పు కోసం పని చేయడం సులువవుతుంది. బ్యూటీ పజంట్‌గా ఇప్పుడు నేను సమాజానికి చేస్తున్న వైద్యసేవలను మరింత త్వరగా విస్తరించగలుగుతాను' అన్నారు 'సాక్షి'తో డాక్టర్ స్రవంతి.

పేషెంట్‌ల దగ్గరకు వెళ్లాలి!

ఈ రోజు మీకు కనిపిస్తున్న ఈ విజేత గుర్తింపు అన్నది నేను సాధించిన ఘనత అని అనుకోను. మా అమ్మానాన్నలు తీర్చిదిద్దిన కూతుర్ని. అమ్మ గవర్నమెంట్ హాస్పిటల్ స్టాఫ్ నర్స్. నాన్న విజయ డైరీలో మేనేజర్. అమ్మ తన డ్యూటీ విషయంలో ఎంత కచ్చితంగా ఉండేదో, తన సలహా సూచనల కోసం వచ్చిన వారిని ఎంత ఆప్యాయంగా చూసుకునేదో దగ్గరగా చూశాను. ప్రభావతక్క అని అందరూ ఆమెని సొంత అక్కలా అభిమానించేవారు. అమ్మతోపాటు హాస్పిటల్‌కి వెళ్లినప్పుడు డాక్టర్ కనిపించగానే పేషెంట్‌లు సంతోషంగా కృతజ్ఞత వ్యక్తం చేయడం చూసి అమ్మను అడిగితే, డాక్టర్‌ను దేవుడిలా చూస్తారని చెప్పింది. అంతే! ఇది అత్యుత్తమమైన వృత్తి అనే అభిప్రాయం స్థిరపడిపోయింది. అమ్మకు నైట్ షిఫ్టులుండేవి. అప్పుడు నాకు జడలు వేయడం నుంచి బాక్స్‌లు పెట్టడం వరకు మా నాన్నే చేశారు. మా అన్నయ్యను, నన్ను పెంచడం, చక్కగా తీర్చిదిద్దడం కోసమే వాళ్ల జీవితాలను అంకితం చేశారు. నేను సిక్స్ క్లాస్ వరకు విజయవాడలో చదివాను. ఉద్యోగాల్లో బదిలీలతో గుంటూరు, రాజమండ్రి, వైజాగ్ అన్నీ చూశాం. నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాలయం నాకు బాగా గుర్తున్న స్కూలు. ఎమ్‌సెట్ తొలి ప్రయత్నంలో మంచి ర్యాంకు రాలేదు. అప్పుడు అమ్మ 'మనది మధ్యతరగతి కుటుంబం. డొనేషన్ సీట్లతో చదివించలేం. బీఎస్సీలో చేరి మళ్లీ ప్రయత్నం చెయ్యి. అప్పుడూ రాకపోతే డిగ్రీ పూర్తి చెయ్యి' అని కరాకండిగా చెప్పి డిగ్రీలో చేర్పించింది. ఆ ఉక్రోషంతో చేసిన రెండవ ప్రయత్నంలో తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజ్‌లో ఫ్రీ సీటు వచ్చింది. తొలి పోస్టింగ్ అనంతపురం జిల్లా రాకట్ల డిస్పెన్సరీలో. అప్పుడు కూడా మార్గదర్శనం చేసింది అమ్మే. ప్రైవేట్ డాక్టర్ క్రేజ్ ఉండేది నాకు. గవర్నమెంట్ ఉద్యోగం విలువ తెలుసుకోమని గట్టిగా చెప్పింది. గవర్నమెంట్ ఉద్యోగం కాబట్టే ఉద్యోగం చేస్తూ మధ్యలో సెలవు పెట్టుకుని యూఎస్‌లో కోర్సులు చేయడం సాధ్యమైంది. అంతేకాదు. గవర్నమెంట్ ఉద్యోగం వల్ల మారుమూల ప్రదేశాలను దగ్గరగా చూడడం, అక్కడి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడం వల్ల, ఉద్యోగ పరిధి దాటి బయటకు వచ్చి మరింత ఎక్కువగా సర్వీస్ చేయాల్సిన అవసరం తెలిసి వచ్చింది. కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని ఆదివాసీ గ్రామాలకు వెళ్లి మహిళలకు మెన్స్ట్రువల్ హైజీన్, సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలను గుర్తించడానికి పాప్‌స్మియర్ పరీక్షలు చేయడం, బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడంలో బిజీ అయిపోయాను. నేను రోబోటిక్ గైనిక్ ఆంకాలజిస్టుని. సర్వైకల్ క్యాన్సర్‌ను రూపుమాపాలనేది నా లక్ష్యం. ఈ నెల బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్ సందర్భంగా శిల్పకళావేదికలో బ్యూటీ పజంట్స్ అందరం అవేర్‌నెస్ ర్యాంప్ వాక్ చేస్తున్నాం.


మిసెస్ తెలంగాణ విజేతగా...

సేవకు అందమైన మాధ్యమం

మిసెస్ తెలంగాణ తెచ్చిన సెలబ్రిటీ గుర్తింపుతో ఒక డాక్టర్‌గా, ఒక మహిళగా నా వంతు సామాజిక బాధ్యత అని నేను చేపట్టిన అనేక కార్యక్రమాలను ఇంకా వేగంగా తీసుకువెళ్లగలుగుతాను. వయలెన్స్ అగైనెస్ట్ ఉమెన్, జెండర్ ఈక్వాలిటీ కోసం పని చేస్తున్నాను. భ్రూణ హత్యలకు కారణం అమ్మాయంటే ఇష్టం లేక కాదు. సమాజంలో అఘాయిత్యాలు పెచ్చుమీరిన ఈ రోజుల్లో అమ్మాయిని భద్రంగా పెంచగలమా లేదా అనే భయమే ప్రధాన కారణమని అనేక మంది మహిళల మాటల ద్వారా తెలిసింది. కొన్ని ఎన్‌జీవోలతో కలిసి తొమ్మిదవ తరగతి నుంచి పన్నెండవ తరగతి చదివే ఆడపిల్లల్లో అవేర్‌నెస్ తీసుకురావడం, అబ్బాయిలను సెన్సిటైజ్ చేస్తున్నాను. ఇక ఇలాంటి కార్యక్రమాలను వేగవంతం చేయగలుగుతాను.

- డాక్టర్ స్రవంతి గాదిరాజు,
అసోసియేట్ ప్రొఫెసర్,
లాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జన్, గైనిక్ ఆంకాలజిస్ట్


ఆదివాసీ మహిళకు వైద్యం చేస్తున్న డాక్టర్ స్రవంతి

సావిత్రినయ్యాను!

ఇక బ్యూటీ పజంట్ విషయానికి వస్తే... నాకు చిన్నప్పటి నుంచి స్కూలు, కాలేజ్ పోటీల్లో అన్నింటిలో పార్టిసిపేట్ చేయడం ఇష్టం. డాన్స్, పెయింటింగ్‌తోపాటు కాలేజీలో ర్యాంప్ వాక్ కూడా చేశాను. మిసెస్ ఇండియా పోటీల గురించి చాలా ఏళ్లుగా పేపర్‌లో చూడడమే కానీ పెద్దగా ఆసక్తి కలగలేదు. కానీ మమతా త్రివేది నిర్వహిస్తున్న కాంటెస్ట్ గురించి తెలిసి గత ఏడాది నవంబర్‌లో నా ఎంట్రీ పంపించాను. కొత్తతరం పిల్లలు చాలా స్మార్ట్‌గా ఉంటున్నారు. మా పెద్దమ్మాయి ఫ్యాషన్ డిజైనింగ్ చేస్తోంది. తను నన్ను ఈ పోటీలకు సిద్ధం చేసింది. మా హజ్బెండ్ నా క్లాస్‌మేట్, దూరపు బంధువు కూడా. ఎమ్ఎన్‌జేలో డాక్టర్. నాకు మంచి సపోర్ట్ ఇస్తారు. మొత్తం ఇరవై రౌండ్‌లు కొన్ని ఆన్‌లైన్, కొన్ని ఆఫ్‌లైన్‌లో జరిగాయి. ఆహార్యం రౌండ్‌లో మహానటి సావిత్రిని తలపించాలని టాస్క్ ఇచ్చారు. సావిత్రి పాత్రలో మెప్పించడమే నన్ను విజేతను చేసింది. మా తోటి పీజంట్‌లు నన్ను సావిత్రి అనే పిలుస్తున్నారిప్పుడు. నా స్మైల్‌కి కూడా ఈ పోటీల్లో మంచి గుర్తింపు వచ్చింది. విజేతలను ప్రకటించేటప్పుడు మాత్రం నర్వస్ అయ్యాను. నా ముఖంలో నవ్వు విరిసే తీర్పు వచ్చింది'' అని చక్కగా నవ్వారు సోషల్ హెల్త్ యాక్టివిస్ట్, మిసెస్ తెలంగాణ విజేత డాక్టర్ స్రవంతి. రాబోయే డిసెంబర్‌లో జరిగే 'మిసెస్ ఇండియా' పోటీల్లో ఆమె తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తారు. 'మిసెస్ ఇండియా' కిరీటం ఆమె కోసం ఎదురు చూస్తోందేమో!.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : మోహనాచారి

ఘనత

మౌన వాదన

భారతదేశ తొలి బధిర మహిళా అడ్వకేట్ సారా సన్నీ తాజాగా సుప్రీం కోర్టులో సైన్ లాంగ్వేజ్‌లో వాదన వినిపించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎదుట ఇంటర్‌ప్రెటర్ సహాయంతో ఆమె తన వాదనలు వినిపించి ప్రశంసలు పొందింది. 'ఇలాంటిది చాలా మునుపే జరగాలి. ఆలస్యం చేశాం' అని జస్టిస్ చంద్రచూడ్ సారా సన్నీని ఉద్దేశించి అన్నారు. సారా పరిచయం.

సెప్టెంబర్ 22. సుప్రీం కోర్టు.

కేసు నంబర్ పిలువగానే నల్లగౌనులో అడ్వకేట్ సారా సన్ని తన ఇంట్రప్రేటర్ సౌరవ్ రాయ్ చౌదరితో కోర్టు హాల్లోకి ప్రవేశించింది. ధర్మాసనంలో సాక్షాత్తు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఉన్నారు. దివ్యాంగుల హక్కుల కోసం జావేద్ ఆబిది ఫౌండేషన్ వారు వేసిన ఆ కేసులో ఫౌండేషన్ తరఫున సారా వాదనలు మొదలెట్టింది. వెంటనే కోర్టు హాలు సైలెంట్ అయ్యింది. ఎందుకంటే సారా సైన్ లాంగ్వేజ్ ద్వారా తన వాదనలు వినిపిస్తుంటే వాటిని అంతే వేగంగా ఇంట్రప్రేటర్ కోర్టుకు విన్నవిస్తున్నాడు. అలాగే కోర్టులో జరుగుతున్న ప్రొసీడింగ్స్‌ను సైన్ లాంగ్వేజ్ ద్వారా సారాకు తెలియచేసి బదులుగా సారా సమాధానాన్ని కోర్టుకు చెబుతున్నాడు. సుప్రీంకోర్టులో మొదటిసారిగా ఇలా ఒక ఒక బధిర అడ్వకేట్ మౌనవాదన వినిపించింది. దీనిని చూసిన జస్టిస్ చంద్రచూడ్ 'ఇప్పటికైనా ఇది సాధ్యమైంది.. ఎప్పుడో జరగాల్సింది' అన్నారు. కోర్టులో ఉన్న అడ్వకేట్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సారాను, ఇంట్రప్రెటర్‌ను మెచ్చుకున్నారు. కేసు తదుపరి విచారణకు వాయిదా పడింది. ఒక గొప్ప అనుభూతితో సారా సన్ని కోర్టు బయటకు నడిచింది. ఇలాంటి ఘనతను సాధించిన మొదటి మహిళా బధిర అడ్వకేట్ కదా మరి.


సారా సన్నీ

కేరళ అమ్మాయి

సారా సన్ని స్వస్థలం కొట్టాయం. ఆమె తండ్రి సన్ని కురువిల్లా చార్టర్డ్ అకౌంటెంట్. తల్లి బెట్టి గృహిణి. ఈ దంపతులకు పుట్టిన అబ్బాయి ప్రతీక్ బధిరుడు. ఆ తర్వాత ఎనిమిదేళ్లకు కవల ఆడపిల్లలు పుట్టారు. ఇద్దరూ మళ్లీ బధిరులే. వారిలో ఒకరు సారా మరొకరు మారియా. ముగ్గురు సంతానం బధిరులే అయినా తల్లిదండ్రులు ఆ లోటు వారికి తెలియనివ్వకుండా పెంచారు. కొడుకు అమెరికాలో బధిరుల స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా, మారియా చార్టర్డ్ అకౌంటెంట్‌గా స్థిరపడ్డారు. సారా మన దేశంలో మొదటి బధిర అడ్వకేట్ అయ్యింది.

వాదనలు చేస్తూ...

సారా బాల్యం నుంచి అందరితో తెగ వాదించేది. ఆమెకు చెవుడు ఉండటం వల్ల మాటలు రాలేదు. కాని సైన్ లాంగ్వేజ్‌తో అందరితో తెగ వాదనలు చేసేది. 'పెద్దయ్యి లాయర్ అవుతుందేమో' అని సరదాగా తల్లిదండ్రులు అనుకునేవారు. అన్నట్టుగానే జరిగింది. సారా, మారియా ఇద్దరూ బెంగళూరులో చదువుకున్నారు. అక్కడే బి.కాం. చేసి ఒకరు లా వైపు మరొకరు చార్టెర్డ్ అకౌంటెన్సీ వైపు వెళ్లారు. రెండేళ్ల క్రితం సారా లా పట్టా తీసుకుంది. అయితే కర్నాటక కోర్టుల్లో కేసులు వాదించాలంటే ఇంట్రప్రెటర్‌లకు అనుమతి ఇవ్వలేదు. దానికి కారణం– కోర్టు పరిభాష ఇంట్రప్రెటర్‌లకు తెలియదని కోర్టు భావించడమే. అయితే సారా తన వాదనలను కాగితం మీద రాసి జడ్జికి ఇచ్చేది. ఈ విధానాన్ని జడ్జి ఆశ్చర్యంగా చూసేవారు. మెచ్చుకునేవారు కూడా.

సుప్రీం కల

'ఏ రోజైనా నేను సుప్రీం కోర్టులో వాదించాలని అనుకున్నాను' అంటుంది సారా. ఆమె కల ఎట్టకేలకు నెరవేరింది. ప్రతిభావంతంగా వాదనలు చేయగలిగింది. 'దివ్యాంగులు దేనినీ వెలితిగా భావించకూడదు. సాధించాలి. నేను వారికి స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను. బధిరులు అడ్వకేట్‌లుగా రాణించగలరు. కాకపోతే వారి కోసం ఇంట్రప్రెటర్‌ల వ్యవస్థను ప్రభుత్వం తయారు చేయాలి. అంతేకాదు ఇంట్రప్రెటర్‌ల ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తే బాగుంటుంది' అని కోరుతోంది సారా.

సినిమా


● ఎన్టీఆర్

టైగర్‌లో యంగ్ టైగర్?

యంగ్ టైగర్.. హీరో ఎన్టీఆర్‌ని ఫ్యాన్స్ అలానే పిలుచుకుంటారు. ఈ యంగ్ టైగర్ సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న 'టైగర్ 3' సినిమాలో నటించనున్నారా? అంటే అవుననంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. హృతిక్ రోషన్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించనున్న 'వార్ 2' సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు ఎన్టీఆర్. ఈ చిత్రం షూటింగ్ నవంబర్‌లో ప్రారంభం కానుంది. అయితే 'వార్ 2' కంటే ముందే ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నట్లు సమాచారం. బాలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకరైన సల్మాన్ ఖాన్ నటిస్తున్న 'టైగర్ 3'లో ఎన్టీఆర్ అతిథి పాత్రలో కనిపించనున్నారని టాక్. 'టైగర్ జిందా హై' చిత్రానికి సీక్వెల్‌గా మనీష్ శర్మ దర్శకత్వంలో 'టైగర్ 3' తెరకెక్కుతోంది. ఈ సినిమాలో క్లయిమాక్స్‌లో ఎన్టీఆర్ కనిపిస్తారని భోగట్టా. కాగా 'టైగర్ 3', 'వార్ 2' రెండు చిత్రాలను యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండటం విశేషం.


● అమితాబ్ బచ్చన్
● ఫాహద్ ఫాజిల్

రజనీ సినిమాలో...

దాదాపు మూడు దశాబ్దాల తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు మంగళవారం చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. హిందీలో 'అంధా కానూన్' (1983), 'గిరఫ్తార్' (1985), 'హమ్' (1991) వంటి సినిమాల్లో అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. 'హమ్' తర్వాత రజనీ, అమితాబ్ మళ్లీ 32 సంవత్సరాలకు స్క్రీన్ షేర్ చేసుకోనుండటం విశేషం. ఇక రజనీ 170వ సినిమాలో అమితాబ్ కీలక పాత్ర చేయనున్నట్లు ప్రకటించిన యూనిట్ రానా, ఫాహద్ ఫాజిల్ కూడా ముఖ్య పాత్రలు చేయనున్నట్లు తెలియజేసింది. ఇంకా మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రల్లో నటించనున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ స్వరకర్త.


● రవితేజ

దేవుడి పాట నాదే

'గుంటూరు రైల్వే స్టేషన్.. దేవుడి పాట పాతికవేలు' అంటూ వేలం పాటతో మొదలైంది 'టైగర్ నాగేశ్వర రావు' సినిమా ట్రైలర్. రవితేజ హీరోగా వంశీ దర్శకత్వం వహించిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముంబైలో 'టైగర్ నాగేశ్వర రావు' ట్రైలర్‌ని విడుదల చేశారు. 'పోలీసులకు విజ్ఞప్తి.. కాకినాడ నుంచి మదరాసు వెళ్లు సర్కార్ ఎక్స్‌ప్రెస్ దారిలో దోపిడీకి గురి కాబోతోంది', 'కొట్టే ముందు.. కొట్టేసే ముందు వార్నింగ్ ఇవ్వడం నాకు అలవాటు', 'రేపటి నుంచి స్టూవర్టుపురంలో దేవుడి పాట నాదే.. చెప్పు.. వాడికి' అంటూ రవితేజ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ముంబైలో జరిగిన ట్రైలర్ లాంచ్ వేడుకలో పాల్గొన్న రవితేజ మాట్లాడుతూ– ''ఈ చిత్రంతో హిందీ పరిశ్రమలోకి రావడం హ్యాపీగా ఉంది. హిందీలో నేనే డబ్బింగ్ చెప్పాను. ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ వేడుకలో అభిషేక్ అగర్వాల్, వంశీ, నటీనటులు రేణూ దేశాయ్, గాయత్రీ భరద్వాజ్, అనుపమ్ ఖేర్, జిషు సేన్ మాట్లాడారు.

అలా చేయాలంటే చాలా ధైర్యం కావాలి - శర్వానంద్

''మేం ఒక్క పాత్ర చేయడానికి చాలా కష్టపడుతున్నాం. అలాంటిది 'మామా మశ్చీంద్ర'లో సుధీర్ ఏకంగా మూడు పాత్రలు చేశారు.. ఇలా చేయాలంటే చాలా ధైర్యం కావాలి'' అన్నారు శర్వానంద్. సుధీర్‌బాబు హీరోగా హర్షవర్ధన్ దర్శకత్వం వహించిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. ఈషా రెబ్బా, మృణాళినీ రవి హీరోయిన్లు. సోనాలి నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి హీరోలు శర్వానంద్, విశ్వక్ సేన్, శ్రీ విష్ణు, డైరెక్టర్ శేఖర్ కమ్ముల అతిథులుగా హాజరయ్యారు. ''సుధీర్ మూడు పాత్రలు చేశారంటే కథ ఎంత విలక్షణంగా ఉండి ఉంటుందో అర్థమవుతోంది'' అన్నారు విశ్వక్ సేన్. ''సుధీర్ కొత్త రకం కథలు ప్రయత్నిస్తుంటారు'' అన్నారు శ్రీ విష్ణు. ''మామా మశ్చీంద్ర'లో మంచి కథ, పాటలు, వినోదం.. అన్నీ ఉంటాయి'' అన్నారు సుధీర్‌బాబు. ''ఇది ఒక అమ్మ, తండ్రీకూతుళ్ల కథ'' అన్నారు హర్షవర్ధన్. ''రచయితల నుంచి డైరెక్టర్స్‌గా మారిన త్రివిక్రమ్, కొరటాల శివల్లా హర్షవర్ధన్ కూడా పెద్ద డైరెక్టర్ కావాలి'' అన్నారు పుస్కూర్ రామ్మోహన్ రావు.


● శ్రీ విష్ణు, శర్వానంద్, సుధీర్‌బాబు

ఆ ప్రశ్నలకు సమాధానమే చిన్నా - సిద్ధార్థ్

''నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'చిన్నా'. ఈ సినిమా కోసం 22 ఏళ్లు కష్టపడ్డాను. ఈ సినిమాను నాలుగు భాషల్లో ఏకకాలంలో గత నెల 28న విడుదల చేయాలనుకున్నాను. అదే రోజున ప్రభాస్‌గారి 'సలార్' రిలీజ్ ఉంది. అయితే 'సలార్' చూసినవారు ఆ తర్వాత నా సినిమా 'చిన్నా' చూస్తారనుకున్నాను. కానీ 'సలార్' రిలీజ్ వాయిదా పడటంతో ఆ డేట్‌కు తెలుగులోనూ వద్దామనుకున్నాను. అయితే నాకు థియేటర్స్ దొరకలేదు. తెలుగులో సిద్ధార్థ్ సినిమానా? ఎవరు చూస్తారు? అని అడిగారు. మంచి సినిమా చేస్తే ప్రేక్షకులు చూస్తారని చెప్పాను. ఆ టైమ్‌లో ఏషియన్ సునీల్‌గారు నాకు అండగా నిలిచారు. సినిమా లంటే ఇష్టం ఉంటే 'చిన్నా' సినిమాను థియేటర్స్‌లో చూడండి. ఈ సినిమా చూశాక సిద్ధార్థ్ సినిమాలు మేం చూడము అని ఆడియన్స్‌కు అనిపిస్తే నేను మీడియా ముందుకు రాను'' అని సిద్ధార్థ్ అన్నారు. సిద్ధార్థ్ టైటిల్ రోల్‌లో నటించి, నిర్మించిన ఎమోషనల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'చిన్నా'. ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను తెలుగులో ఏషియన్ సినిమాస్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సిద్ధార్థ్ మాట్లాడుతూ– ''ఈశ్వర్ అనే వ్యక్తికి, అతని అన్న కూతురికీ మధ్య ఉన్న అనుబంధమే 'చిన్నా' చిత్రం. నా కెరీర్‌లో బెస్ట్ మూవీ ఇది. సిద్ధార్థ్ ఇంకా ఎందుకు నటిస్తున్నాడు? నటుడిగా ఎందుకు కొనసాగాలి? అనే ప్రశ్నలకు ఈ సినిమా సమాధానంగా నిలుస్తుంది. ఇక కర్ణాటకలో ప్రెస్‌మీట్ పెడితే నువ్వు తమిళోడివి వెళ్లు అన్నారు. మీ భాషను నేర్చుకుని మీవాడిగా మీ ముందుకొస్తుంటే బయటవాడినని ఆపేస్తున్నారేంటని అర్థం కాలేదు. నవ్వుకుని బయటకు వచ్చేశాను'' అన్నారు.


● కృష్ణకాంత్, అరుణ్‌కుమార్, సిద్ధార్థ్, జాన్వీ


● రాకేష్ వర్రే

యువ పోలీస్

రాకేష్ వర్రే హీరోగా నటిస్తున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'. విరించి వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుబ్బరాజు, శ్రియా శరణ్ ముఖ్య పాత్రధారులు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంలో జితేందర్ రెడ్డి అనే యువ పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు రాకేష్. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: వీఎస్ జ్ఞాన శేఖర్, సహనిర్మాత: ఉమా రవీందర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వాణిశ్రీ పొడుగు.

నవ్వుల మ్యాడ్

నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యాన్ నటించిన చిత్రం 'మ్యాడ్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానున్న సందర్భంగా థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో ఎన్టీఆర్ రిలీజ్ చేశారు. నార్నే నితిన్ మాట్లాడుతూ – ''ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లను ఎంజాయ్ చేసే ట్రెండ్ ఉన్న ఈ తరం కాలేజీ యూత్‌ఫుల్ సినిమా ఇది. ఫన్ ఎక్కువగా ఉంటుంది'' అన్నారు. ''ఎవరికైనా వెండితెరపై హీరోగా చూసుకోవాలనే ఉంటుంది. నాకూ అంతే. అయితే మా అన్నయ్య (సంతోష్ శోభన్) అంత స్ట్రగుల్‌ను నేను ఫేస్ చేయలేదు'' అన్నారు సంగీత్ శోభన్. ''హలో వరల్డ్' సిరీస్ చూసి నాగవంశీగారు ఈ సినిమాకి చాన్స్ ఇచ్చారు'' అన్నారు రామ్ నితిన్.


● రామ్ నితిన్, సంగీత్ శోభన్, గోపికా

సరికొత్త ప్రేమ

అభిదేవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ప్రేమలో...'. పాపలు బాబులు అనేది ట్యాగ్‌లైన్. శ్రీరాజ్ బల్లా దర్శకత్వంలో విజయ మాధవి బల్లా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని నటుడు, నిర్మాత మురళీ మోహన్ రిలీజ్ చేశారు. శ్రీరాజ్ బల్లా మాట్లాడుతూ– ''సరికొత్త కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'ప్రేమలో''' అన్నారు. ''నా భర్త (శ్రీరాజ్) కోసమే నిర్మాతగా మారాను. ప్రేక్షకుల ఆశీర్వాదంతో మరెన్నో మంచి చిత్రాలు తీయాలనుకుంటున్నాను'' అన్నారు మాధవి బల్లా.


● శ్రీరాజ్, మాధవి

హీరోగా ఆరు.. విలన్‌గా మూడు... - నవీన్ చంద్ర

నవీన్ చంద్ర, స్వాతీ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో యశ్వంత్ ములుకుట్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో నవీన్ చంద్ర మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నాది సహజత్వానికి దగ్గరగా ఉండే పాత్ర. పేరు మధుసూధన రావు. చదువుకునే రోజుల్లో మధుసూధనరావును అతని స్నేహితులు, శ్రేయోభిలాషులు ఓ హీరోలా ట్రీట్ చేస్తుంటారు. కొంతకాలం గడిచాక అతని ఫ్రెండ్స్ ఎవరికి వారు వారి జీవితాల్లో బిజీ అవుతారు. కానీ మధుసూధనరావు మాత్రం తానొక ఇమేజ్ ఉన్న వ్యక్తిని అనే స్టేట్ ఆఫ్ మైండ్‌లో ఉండిపోతాడు. అతనికి ఏ లక్ష్యం ఉండదు.. బాధ్యతలు తీసుకోడు. డబ్బుపై ఆశ లేదు. ఇలాంటి వ్యక్తి లేఖ (స్వాతి) అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాక వారి జీవితం ఎలా సాగుతుంది? ఎన్నారై అమ్మాయి మధుమతి (శ్రేయా) వీరి జీవితాల్లోకి వచ్చి, ఓ నెల రోజులు ఏం చేసింది? అన్నదే ఈ చిత్ర కథాంశం. ప్రస్తుతం హీరోగా ఆరు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఐదు, విలన్‌గా మూడు సినిమాలు చేస్తున్నాను. వెబ్ సిరీస్‌ల కమిట్‌మెంట్స్ కూడా ఉన్నాయి. నటుడిగా ఎప్పుడూ కెమెరా ముందుండాలన్నదే నా తపన'' అన్నారు.







చైనా గడ్డపై భారత మహిళా అథ్లెట్లు పారుల్ చౌధరీ, అన్ను రాణి అద్భుతం చేశారు. ఆసియా క్రీడల చరిత్రలో తొలిసారి భారత్‌కు 5000 మీటర్ల విభాగంలో పారుల్... జావెలిన్ త్రోలో అన్ను రాణి పసిడి పతకాలు అందించారు. ఈ ఇద్దరితోపాటు మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విత్యా రామ్‌రాజ్ కాంస్యం... పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రావెల్ కాంస్యం... పురుషుల 800 మీటర్ల విభాగంలో మొహమ్మద్ అఫ్జల్ రజతం... పది క్రీడాంశాల సమాహారమైన డెకాథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ రజతం గెల్చుకున్నారు. అథ్లెటిక్స్ కాకుండా బాక్సింగ్‌లో రెండు కాంస్యాలు... కనోయింగ్‌లో ఒక కాంస్యం లభించాయి. ఓవరాల్‌గా ఆసియా క్రీడల పదో రోజు భారత్ ఖాతాలో తొమ్మిది పతకాలు చేరాయి. మరో ఐదు రోజులపాటు కొనసాగే ఈ క్రీడల్లో ప్రస్తుతం భారత్ 69 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఆర్చరీలో మూడు పతకాలు... బాక్సింగ్‌లో మరో పతకం... క్రికెట్‌లో ఒక పతకం కూడా ఖరారయ్యాయి. ఫలితంగా ఆసియా క్రీడల చరిత్రలోనే భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేయడం లాంఛనం కానుంది. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో భారత్ అత్యధికంగా 70 పతకాలు సాధించింది.

- 5000 మీటర్లలో, జావెలిన్ త్రోలో భారత్‌కు తొలిసారి స్వర్ణ పతకాలు అందించిన మహిళా అథ్లెట్లు
- పదో రోజు భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఐదు కాంస్యాలు


అన్ను రాణి


పారుల్ చౌధరీ

పసిడి పారుల్ అన్ను బంగారం

హాంగ్జౌ: బరిలోకి దిగితే పతకం సాధించాలనే లక్ష్యంతో తమ ఈవెంట్లలో పోటీపడుతున్న భారత అథ్లెట్లు ఈ ఆసియా క్రీడల్లో మెరిపిస్తున్నారు. నిలకడగా రాణిస్తూ... తమపై పెట్టుకున్న అంచనాలకు మించి ప్రతిభ కనబరుస్తూ... 1951 తర్వాత ఈ క్రీడల చరిత్రలో పతకాలపరంగా తమ అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేశారు. పోటీల పదో రోజు భారత్‌కు తొమ్మిది పతకాలు రాగా... అందులో ఆరు అథ్లెటిక్స్ ఈవెంట్ల నుంచి వచ్చాయి. ప్రస్తుతం ఈ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు ఇప్పటికే 22 పతకాలు (4 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంస్యాలు) గెలిచారు. తద్వారా 2018లో 20 పతకాల ప్రదర్శనను సవరించారు.


విత్యా


ప్రవీణ్


అఫ్జల్

1951లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన తొలి ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు అత్యధికంగా 34 పతకాలు గెలిచారు.

మంగళవారం భారత మహిళా అథ్లెట్లు పారుల్ చౌధరీ, అన్ను రాణి పసిడి కాంతులు విరజిమ్మారు. 5000 మీటర్ల రేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పారుల్ విజేతగా అవతరించింది. ఆమె అందరికంటే వేగంగా 15 నిమిషాల 14.75 సెకన్లలో గమ్యానికి చేరి స్వర్ణ పతకాన్ని గెలిచింది. తద్వారా ఈ క్రీడల చరిత్రలో 5000 మీటర్లలో బంగారు పతకం గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా పారుల్ గుర్తింపు పొందింది. తాజా క్రీడల్లో పారుల్‌కిది రెండో పతకం. ఆమె 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో రజతం గెలిచింది. గతంలో మహిళల 5000 మీటర్ల విభాగంలో భారత్ తరఫున సునీతా రాణి (1998–రజతం; 2002–కాంస్యం), ఓపీ జైషా (2006–కాంస్యం), ప్రీజా శ్రీధరన్ (2010–రజతం), కవితా రౌత్ (2010–కాంస్యం) పతకాలు నెగ్గారు. తాజా స్వర్ణ పతకంతో ఉత్తరప్రదేశ్ పోలీసు విభాగంలో తనను డీఎస్పీగా నియమిస్తారని పారుల్ ఆశిస్తోంది. యూపీ ప్రభుత్వ క్రీడా పాలసీ ప్రకారం ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన వారికి డీఎస్పీ ఉద్యోగం ఇస్తారు.

మూడో ప్రయత్నంలో...

వరుసగా మూడోసారి ఆసియా క్రీడల్లో పోటీపడ్డ జావెలిన్ త్రోయర్ అన్ను రాణి తొలిసారి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. 2014 ఇంచియోన్ ఏషియాడ్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్ను రాణి కాంస్యం సాధించింది. 2018 జకార్తా క్రీడల్లో ఆరో స్థానంతో నిరాశపరిచింది. మూడో ప్రయత్నంలో 31 ఏళ్ల అన్ను రాణి ఏకంగా బంగారు పతకాన్ని మెడలో వేసుకుంది. 11 మంది పోటీపడ్డ ఫైనల్లో అన్ను రాణి జావెలిన్‌ను తన నాలుగో ప్రయత్నంలో గరిష్ఠంగా 62.92 మీటర్ల దూరం విసిరి పసిడి పతకాన్ని ఖరారు చేసుకుంది. నదీషా దిల్హాన్ (శ్రీలంక; 61.57 మీటర్లు) రజతం, హుయ్‌హుయ్ లియు (చైనా; 61.29 మీటర్లు) కాంస్యం గెలిచారు. 'ఏడాది మొత్తం ఎంతో ప్రయత్నించినా నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వలేకపోయా. ప్రభుత్వం నాపై ఎంతో డబ్బు వెచ్చించి విదేశాల్లో శిక్షణకు పంపించింది. ఫలితాలు రాకపోవడంతో కాస్త నిరాశకు గురయ్యా. అయితే ఆసియా క్రీడల్లో ఈ సీజన్‌లోనే ఉత్తమ ప్రదర్శనతో స్వర్ణం సాధించడంతో చాలా ఆనందంగా ఉంది' అని అన్ను రాణి వ్యాఖ్యానించింది. ఆసియా క్రీడల మహిళల జావెలిన్ త్రోలో గతంలో బార్బరా వెబ్‌స్టర్ (1951; కాంస్యం), ఎలిజబెత్ డావెన్‌పోర్ట్ (1958; రజతం... 1962; కాంస్యం), గుర్మీత్ కౌర్ (1998; కాంస్యం) పతకాలు గెలిచారు. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విత్యా రామ్‌రాజ్ కాంస్య పతకాన్ని సాధించింది. హీట్స్‌లో 55.42 సెకన్ల సమయం నమోదు చేసి పీటీ ఉష జాతీయ రికార్డును సమం చేసిన విత్యా ఫైనల్లో దానిని పునరావృతం చేయలేకపోయింది. తమిళనాడుకు చెందిన 25 ఏళ్ల విత్యా 55.68 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది.

పురుషుల 800 మీటర్ల విభాగంలో మొహమ్మద్ అఫ్జల్ రజత పతకం గెలిచాడు. తొలిసారి ఆసియా క్రీడల్లో పోటీపడ్డ ఈ కేరళ అథ్లెట్ ఒక నిమిషం 48.43 సెకన్లలో రేసును ముగించి రెండో స్థానంలో నిలిచాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రావెల్ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల ప్రవీణ్ 16.68 మీటర్ల దూరం దూకి మూడో స్థానంలో నిలిచాడు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	161	90	46	297
జపాన్	33	47	50	130
దక్షిణ కొరియా	32	42	65	139
భారత్	15	26	28	69
ఉజ్బెకిస్తాన్	14	15	21	50
చైనీస్ తైపీ	12	10	18	40
థాయ్‌లాండ్	10	11	19	40
ఉత్తర కొరియా	7	10	6	23
బహ్రెయిన్	7	1	4	12
హాంకాంగ్	6	15	24	45

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

49 ఏళ్ల తర్వాత...


తేజస్విన్

పది క్రీడాంశాల (100 మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్, 400 మీటర్లు, 110 మీటర్ల హర్డిల్స్, డిస్కస్ త్రో, పోల్‌వాల్ట్, జావెలిన్ త్రో, 1500 మీటర్లు) సమాహారమైన డెకాథ్లాన్‌లో 49 ఏళ్ల తర్వాత భారత్‌కు పతకం లభించింది. ఢిల్లీకి చెందిన తేజస్విన్ శంకర్ 7666 పాయింట్లతో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పడంతోపాటు రజత పతకాన్ని సాధించాడు. 2011 నుంచి భారతీందర్ సింగ్ (7658 పాయింట్లు) పేరిట ఉన్న డెకాథ్లాన్ జాతీయ రికార్డును తేజస్విన్ సవరించాడు. 1974 టెహ్రాన్ ఆసియా క్రీడల్లో విజయ్ సింగ్ చౌహాన్ స్వర్ణం, సురేశ్ బాబు కాంస్యం గెలిచాక ఈ క్రీడల్లో మళ్లీ భారత్‌కు పతకం అందించిన డెకాథ్లెట్‌గా తేజస్విన్ గుర్తింపు పొందాడు.

సెమీఫైనల్లో భారత్

యశస్వి జైస్వాల్ మెరుపు సెంచరీ



హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో పాల్గొన్న తొలిసారే భారత పురుషుల క్రికెట్ జట్టు పతకాన్ని ఖాయం చేసుకుంది. ర్యాంకింగ్ ద్వారా నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు చేరిన జట్టు ఈ దశలో విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వార్టర్స్‌లో భారత్ 23 పరుగుల తేడాతో నేపాల్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. శతకంతో చెలరేగిన యశస్వి జైస్వాల్ (49 బంతుల్లో 100; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) భారత్ తరఫున టి20ల్లో సెంచరీ సాధించిన పిన్న వయస్కుడిగా నిలిచాడు. జైస్వాల్, కెప్టెన్ రుతురాజ్ (25) తొలి వికెట్‌కు 59 బంతుల్లో 103 పరుగులు జోడించారు. చివర్లో శివమ్ దూబే (25 నాటౌట్), రింకూ సింగ్ (15 బంతుల్లో 37 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. అనంతరం నేపాల్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 179 పరుగులే చేయగలిగింది. దీపేంద్ర సింగ్ (15 బంతుల్లో 32; 4 సిక్స్‌లు), సందీప్ జోరా (12 బంతుల్లో 29; 1 ఫోర్, 3 సిక్స్‌లు), కుశాల్ మల్లా (29), కుశాల్ భుర్టెల్ (28) పోరాడారు. రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్ చెరో 3 వికెట్లు తీయగా, అర్ష్‌దీప్‌కు 2 వికెట్లు దక్కాయి.

29 ఏళ్ల తర్వాత కనోయింగ్‌లో పతకం



సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ భారత క్రీడాకారులు అర్జున్ సింగ్–సునీల్ సింగ్ ఆసియా క్రీడల కనోయింగ్ ఈవెంట్‌లో భారత్‌కు కాంస్య పతకం అందించారు. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ కనోయ్ 1000 మీటర్ల స్ప్రింట్‌లో అర్జున్–సునీల్ 3ని:53.329 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచారు. 1994 హిరోషిమా ఆసియా క్రీడల్లో ఇదే విభాగంలో సిజీ సదానందన్–జానీ రోమెల్ భారత్‌కు కాంస్యం అందించారు.

సెమీస్‌లో భారత మహిళల హాకీ జట్టు


వందన కటారియా

తమ లీగ్ దశను అజేయంగా ముగించిన భారత మహిళల హాకీ జట్టు ఆసియా క్రీడల్లో సెమీఫైనల్ చేరి పతకం రేసులో నిలిచింది. మంగళవారం జరిగిన పూల్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 13–0 గోల్స్ తేడాతో హాంకాంగ్‌ను చిత్తు చేసింది. భారత్ తరఫున వందన కటారియా (2వ, 16వ, 48వ ని.లో), దీప్ గ్రేస్ ఎక్కా (11వ, 34వ, 42వ ని.లో), దీపిక (4వ, 54వ, 58వ ని.లో) మూడు చొప్పున గోల్స్ సాధించారు. సంగీత కుమారి (27వ, 55వ ని.లో) రెండు గోల్స్, మోనిక (7వ ని.లో), నవ్‌నీత్ కౌర్ (58వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. లీగ్ దశ తర్వాత భారత్, దక్షిణ కొరియా జట్లు 10 పాయింట్లతో సమంగా నిలిచినా... మెరుగైన గోల్స్ అంతరం కారణంగా భారత్‌కు అగ్రస్థానం, కొరియాకు రెండో స్థానం దక్కాయి. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో చైనాతో భారత్; జపాన్‌తో కొరియా తలపడతాయి.

పసిడి 'పంచ్'కు లవ్లీనా

కాంస్యాలు గెలిచిన ప్రీతి, నరేందర్

ఆసియా క్రీడల బాక్సింగ్ ఈవెంట్‌లో మంగళవారం భారత్‌కు రెండు కాంస్య పతకాలు లభించాయి. మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్... పురుషుల ప్లస్ 92 కేజీల విభాగంలో నరేందర్ సెమీఫైనల్ బౌట్‌లలో ఓడిపోయి కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. ప్రీతి 0–5తో చాంగ్ యువాన్ (చైనా) చేతిలో... నరేందర్ 0–5తో కుస్‌కబయేవ్ (కజకిస్తాన్) చేతిలో ఓటమి చవిచూశారు. మహిళల 75 కేజీల విభాగంలో భారత బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ ఫైనల్లోకి దూసుకెళ్లి స్వర్ణ, రజత పతకం రేసులో నిలిచింది. అంతే కాకుండా పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించింది. సెమీఫైనల్లో లవ్లీనా 5–0తో బైసన్ మనికోన్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. పురుషుల 57 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో భారత బాక్సర్ సచిన్ సివాచ్ 1–4తో లియు పింగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు.


లవ్లీనా

మన బాణం మెరిసింది

ఆర్చరీలో భారత్‌కు మూడు పతకాలు ఖరారు • ఫైనల్లో సురేఖ, అభిషేక్, ప్రవీణ్


అభిషేక్
జ్యోతి సురేఖ
ప్రవీణ్

ఆసియా క్రీడల ఆర్చరీలో భారత క్రీడాకారులు మూడు పతకాలను ఖరారు చేసుకున్నారు. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ... పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కే చెందిన ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే, అభిషేక్ వర్మ ఫైనల్లోకి దూసుకెళ్లారు. సెమీఫైనల్లో జ్యోతి సురేఖ 149–146తో భారత్‌కే చెందిన ప్రపంచ చాంపియన్ అదితి స్వామిని ఓడించింది. సెమీస్‌లో ఓడిన అదితి కాంస్యం కోసం పోటీపడుతుంది. పురుషుల కాంపౌండ్ సెమీఫైనల్స్‌లో ప్రపంచ చాంపియన్ ఓజస్ ప్రవీణ్ 150–146తో యాంగ్ జేవన్ (దక్షిణ కొరియా)పై, అభిషేక్ వర్మ 147–145తో జేహూన్ జూ (దక్షిణ కొరియా)పై గెలిచి స్వర్ణ, రజత పతకాల కోసం తలపడనున్నారు. పురుషుల రికర్వ్ విభాగంలో భారత ఆర్చర్లు అతాను దాస్, బొమ్మదేవర ధీరజ్ నిరాశపరిచారు. క్వార్టర్ ఫైనల్లో అతాను దాస్ 5–6తో జింగ్షువో కి (చైనా) చేతిలో, ధీరజ్ 5–6తో ఇల్ఫాత్ అబ్దులిన్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు



ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో భారత స్టార్స్ పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సింధు 21–10, 21–15తో వి చి సు (చైనీస్ తైపీ)పై, శ్రీకాంత్ 21–16, 21–11తో లీ యున్ జియు (కొరియా)పై, ప్రణయ్ 21–9, 21–12తో బత్‌దవా ముంఖ్‌బత్ (మంగోలియా)పై గెలిచారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి–ట్రిసా జాలీ జోడీ 21–14, 21–12తో నబీహా–ఫాతిమత్ (మాల్దీవులు) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

స్క్వాష్ 'మిక్స్‌డ్'లో పతకం ఖాయం

స్క్వాష్ 'మిక్స్‌డ్ డబుల్స్' విభాగంలో దీపిక పల్లికల్–హరీందర్ పాల్ సింగ్ జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. దాంతో ఈ ఈవెంట్‌లో భారత్‌కు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. క్వార్టర్ ఫైనల్లో దీపిక–హరీందర్ 7–11, 11–5, 11–4 స్కోరుతో ఫిలిప్పీన్స్‌కు చెందిన అరిబాడో–ఆండ్రూ గారికాపై గెలిచారు.

ఆసీస్‌దే విజయం

రెండో 'వామప్'లోనూ ఓడిన పాకిస్తాన్


మ్యాక్స్‌వెల్

సాక్షి, హైదరాబాద్: వరల్డ్ కప్‌లో తొలి రెండు మ్యాచ్‌లు ఆడాల్సిన వేదికపై పాకిస్తాన్ తమ రెండు 'వామప్' మ్యాచ్‌లనూ కోల్పోయింది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో గత శుక్రవారం కివీస్ చేతిలో ఓడిన పాక్ మంగళవారం ఆసీస్ చేతిలోనూ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 14 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. అయితే ఫలితంతో సంబంధం లేకుండా ఇరు జట్లకూ మంచి బ్యాటింగ్ ప్రాక్టీస్ లభించింది. తొలి 'వామప్' లాగే ఈసారీ భారీ స్కోర్లు నమోదయ్యాయి. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. మ్యాక్స్‌వెల్ (71 బంతుల్లో 77; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), కామెరాన్ గ్రీన్ (40 బంతుల్లో 50 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), ఇన్‌గ్లిస్ (48), వార్నర్ (48), లబుషేన్ (40), మిచెల్ మార్ష్ (31) జట్టు భారీ స్కోరులో తలా ఓ చేయి వేశారు. అనంతరం పాకిస్తాన్ 47.4 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (59 బంతుల్లో 90 రిటైర్డ్ అవుట్; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇఫ్తికార్ అహ్మద్ (85 బంతుల్లో 83; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), మొహమ్మద్ నవాజ్ (42 బంతుల్లో 50; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. పాక్ ఇన్నింగ్స్ చాలా చాలా ముందుగా ముగిసేదే కానీ ఆసీస్ పార్ట్‌టైమ్ బౌలర్లకు కూడా 'వామప్' అవకాశం కల్పించింది. లబుషేన్, స్మిత్, వార్నర్ కలిపి 14.4 ఓవర్లు వేసి ఏకంగా 159 పరుగులిచ్చారు. పాక్ తమ తొలి మ్యాచ్‌ను హైదరాబాద్‌లోనే శుక్రవారం నెదర్లాండ్స్‌తో, ఆస్ట్రేలియా తమ తొలి మ్యాచ్‌ను ఆదివారం భారత్‌తో చెన్నైలో ఆడుతుంది.

అఫ్గానిస్తాన్ ఘన విజయం

గువహటిలో జరిగిన మరో 'వామప్' మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. శ్రీలంక 46.2 ఓవర్లలో 294 పరుగులకు ఆలౌట్ కాగా... వర్షంతో అఫ్గానిస్తాన్ లక్ష్యాన్ని 42 ఓవర్లలో 257 పరుగులుగా నిర్దేశించారు. అఫ్గాన్ 38.1 ఓవర్లలో 4 వికెట్లకు 261 పరుగులు చేసి విజయాన్నందుకుంది. దీంతో ప్రధాన పోరుకు ముందు అన్ని వామప్ మ్యాచ్‌లు ముగిశాయి.

'వామప్' లేకుండానే...

- భారత్ రెండో మ్యాచ్ కూడా వర్షంతో రద్దు
- ఒక్క బంతి కూడా ఆడేందుకు దక్కని అవకాశం



తిరువనంతపురం: శ్రీలంక గడ్డపై ఆసియా కప్ నుంచి భారత్‌ను వెంటాడుతున్న వర్షం స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ సమయంలోనూ వీడలేదు. ప్రధాన పోరుకు ముందు టీమిండియా రెండు వామప్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా... రెండూ వర్షంలో కొట్టుకుపోయాయి! గువహటిలో శనివారం ఇంగ్లండ్‌తో జరగాల్సిన తొలి మ్యాచ్ రద్దు కాగా, ఇప్పుడు తిరువనంతపురంలో అదే పునరావృతమైంది. మంగళవారం భారత్, నెదర్లాండ్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా పూర్తిగా రద్దయింది. తిరువనంతపురంలో నిరంతరాయంగా కురిసిన వర్షంతో గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం మొత్తం నీటితో నిండిపోయింది. మధ్యలో కొద్దిసేపు వాన తెరిపినిచ్చినా... మైదానాన్ని చక్కదిద్ది మ్యాచ్‌ను నిర్వహించే పరిస్థితి లేకపోయింది. దాంతో అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పశ్చిమ దిశ రాజ్‌కోట్‌లో ఆస్ట్రేలియాతో చివరి వన్డే ఆడిన తర్వాత టీమిండియా ఈశాన్య ప్రాంతమైన గువహటి చేరింది. ఆపై నైరుతి దిశన తిరువనంతపురానికి ప్రయాణించింది. దాదాపు 6 వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసిన తర్వాత భారత్‌కు ఒక్క బంతి కూడా బౌలింగ్ కానీ బ్యాటింగ్ కానీ చేసే అవకాశం రాలేదు. వరల్డ్ కప్‌లో పాల్గొంటున్న పది జట్లలో ఒక్క భారత్‌కు మాత్రం ఇలాంటి స్థితి ఎదురైంది. ప్రపంచకప్‌లో తమ తొలి మ్యాచ్‌లో ఈ ఆదివారం జరిగే చెన్నైలో ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	316	65,512
నిఫ్టీ ▼	110	19,529

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్డాక్	13,102	▼	206
డోజోన్స్	33,072	▼	361
ఎఫ్టీఎస్ఈ 100	7,470	▼	41
డాక్స్	15,085	▼	162
హాంకాంగ్ (గురువారం ముగింపు)	3,110	▲	3
నికాయ్	31,238	▼	522

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	56,675
బంగారం (22 క్యారట్)	56,448
వెండి (కిలో)	67,037

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.46	84.13
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	85.67	88.74
€	యూరో	ఒకటి	98.94	102.28
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.74	56.44
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.78	54.07
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.66	61.58
SAR	సౌదీ రియాల్	ఖాయమనీక	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయమనీక	21.76	23.55
¥	చైనా యువాన్	ఖాయమనీక	10.27	12.35

నేటి నుంచి ఆర్‌బీఐ పాలసీ సమీక్ష

శుక్రవారం కీలక నిర్ణయాల వెల్లడి



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) మూడురోజుల కీలక ద్వైమాసిక సమావేశాలు నేటి నుంచి (4వ తేదీన) ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు ఈ సమావేశాలు జరుగుతాయి. అక్టోబర్ 6వ తేదీన (శుక్రవారం) ఈ భేటీ కీలక నిర్ణయాలను గవర్నర్ మీడియాకు వెల్లడిస్తారు. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు రెపోను ఆర్‌బీఐ ఈ సమావేశాల్లో కూడా యథాతథంగా 6.5 శాతం వద్దే కొనసాగించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. ఇదే జరిగితే వరుసగా నాలుగు ద్వైమాసిక సమావేశాల నుంచి యథాతథ రేటును కొనసాగించినట్లు అవుతుంది. ధరల స్పీడ్‌ను కట్టడి చేసే విషయంలో రాజీ పడేదే లేదని ఆర్‌బీఐ గవర్నర్ ఉద్ఘాటిస్తున్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, క్రూడ్ ధరల తీవ్రత, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ధరలు, దీనితో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఈ సవాలును అధిగమించడానికి ఆర్‌బీఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి నాటికి రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. అయితే ద్రవ్యోల్బణం కొద్దిగా అదుపులోనికి వస్తుందన్న సంకేతాల నేపథ్యంలో తాజా సమీక్షసహా గడచిన మూడు సమావేశాల్లో యథాతథ రేటు కొనసాగింపునకే ఆర్‌బీఐ పెద్దపీట వేసింది. జూలైలో నమోదయిన 15 నెలల గరిష్ట స్థాయి (7.44 శాతం) రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో 6.83 శాతానికి తగ్గినప్పటికీ ఈ స్థాయి సైతం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న స్థాయికన్నా 83 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) అధికంగా ఉండడం గమనార్హం.


ఇక అన్ని హ్యుందాయ్ కార్లలో 6 ఎయిర్‌బ్యాగ్‌లు

న్యూఢిల్లీ: ఇకపై తమ అన్ని కార్లలోనూ ఆరు ఎయిర్‌బ్యాగ్స్ తప్పనిసరిగా ఉంటాయని హ్యుందాయ్ మోటార్ ఇండియా తెలిపింది. ముందుగా 3 మోడల్స్‌తో దీన్ని ప్రారంభించనున్నామని, తర్వాత మిగతా మోడల్స్‌కూ వర్తింపచేస్తామని సంస్థ ఎండీ ఉన్సూ కిమ్ తెలిపారు. వాహన భద్రతా ప్రమాణాలపరమైన దేశీ క్రాష్ టెస్టులకు సంబంధించి ఇటీవల ప్రవేశపెట్టిన భారత్ ఎన్‌క్యాప్ ప్రోగ్రామ్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని కూడా నిర్ణయించుకున్నట్లు వివరించారు.



టెస్టుల ఆధారంగా వాహనానికి 0–5 వరకు స్టార్ రేటింగ్స్ లభిస్తాయి. కొనుగోలుదారులు ఈ రేటింగ్ ప్రాతిపదికన వివిధ కార్లలో భద్రతా ప్రమాణాలను పోల్చి చూసుకుని తగు నిర్ణయం తీసుకోవచ్చు. తమ మధ్య స్థాయి సెడాన్ కారు వెర్నాకు గ్లోబల్ ఎన్‌క్యాప్ టెస్టులో 5 స్టార్ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

భారత్ వృద్ధి 6.3 శాతం



- 2023–24పై ప్రపంచ బ్యాంక్ అంచనా
- సేవల రంగం దన్నుగా ఉంటుందని భరోసా..

న్యూఢిల్లీ: భారత్ ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24) 6.3 శాతం వృద్ధిని నమోదుచేసుకుంటుందన్న తన అంచనాలను ప్రపంచ బ్యాంక్ పునరుద్ఘాటించింది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పరిస్థితి నెలకొన్నప్పటికీ, భారత్ సేవల రంగం పటిష్టంగా ఉంటుందని ఇండియా డెవలప్‌మెంట్ తాజా అక్టోబర్ అవుట్‌లుక్‌లో స్పష్టం చేసింది. భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో సేవల రంగం మెజారిటీ వాటాను కలిగి ఉన్న సంగతి తెలిసిందే. 2022–23 భారత్ వృద్ధి రేటు 7.2 శాతం. కాగా, దక్షిణాసియా వృద్ధి రేటు 5.8 శాతంగా ఉంటుందని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది. ఇతర వర్ధమాన మార్కెట్, అభివృద్ధి చెందుతున్న దేశాల ఎకానమీ (ఈఎండీఈ)ల వృద్ధి రేటు 2023–24లో 6.3 శాతం, 2024–25లో 6.4 శాతం నమోదుకావచ్చని అంచనా వేస్తోంది. ప్రపంచ బ్యాంక్ తాజా అంచనాల ప్రకారం...

- 2023–24లో వ్యవసాయ రంగం 3.5 శాతం పురోగమిస్తుంది. పరిశ్రమల రంగం 5.7 శాతం, సేవల రంగం 7.4 శాతం వృద్ధిని నమోదుచేసుకుంటాయి.
- పెట్టుబడుల్లో వృద్ధి 8.9 శాతంగా ఉంటుంది.
- ప్రభుత్వ చర్యల వల్ల ద్రవ్యోల్బణం నెమ్మదిగా దిగివస్తుంది. ఆర్థిక సంవత్సరంలో సగటును రిటైల్ ద్రవ్యోల్బణం 5.9 శాతం ఉంటుందని అంచనా.
- ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు జీడీపీలో లక్ష్యాల మేరకు 6.4 శాతం నుంచి (2022–23లో జీడీపీతో పోల్చి) 5.9 శాతానికి దిగివస్తుంది.
- ప్రభుత్వ రుణ భారం జీడీపీలో 83 శాతం వద్ద స్థిరంగా ఉంటుంది. ప్రభుత్వ స్థూల రుణం జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.159.54 లక్షల కోట్లుగా నమోదయ్యింది. మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోల్చితే (రూ.156.08 లక్షల కోట్లు) ఈ పరిమాణం 2.2 శాతం పెరిగింది. మొత్తం రుణాల్లో పబ్లిక్ డెట్ 89.5 శాతంగా ఉంది. భారత్ విదేశీ రుణ భారం జూన్ ముగిసే నాటికి 629.1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.52 లక్షల కోట్లు) చేరింది.
- దేశంలోకి వచ్చీ–పోయే విదేశీ కరెన్సీ అకౌంట్‌కు సంబంధించిన కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) జీడీపీలో దేశం భరించగలిగిన స్థాయిలోనే 1.4 శాతంగా ఉంటుంది.
- షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకుల రుణ నాణ్యత మెరుగుపడుతుంది. అధిక రుణ వృద్ధి, మొండిబకాయిలు తగ్గడం, చక్కటి రికవరీలు, మొండి బకాయిల రైటాఫ్స్ దీనికి కారణం. 2022 మార్చిలో 5.9 శాతంగా ఉన్న షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకుల స్థూల మొండిబకాయిల నిష్పత్తి, 2023 మార్చి నాటికి 3.9 శాతానికి తగ్గడం గమనార్హం.

కొన్ని సంస్థల అంచనా ఇలా.. (వృద్ధి శాతాల్లో)

సంస్థ	2023-24
ఆర్‌బీఐ	6.5
ఎస్అండ్‌పీ	6.0
ఫిచ్	6.3
మూడీస్	6.1
ఏడీబీ	6.3
ఇండియా రేటింగ్స్	6.2
ఓఈసీడీ	6.3

సెప్టెంబర్‌లో 'తయారీ' నిరాశ

- ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ 57.5కు డౌన్
- ఐదు నెలల కనిష్ట స్థాయి

న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం సెప్టెంబర్‌లో నెమ్మదించింది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఆగస్టులో 58.6 వద్ద ఉంటే, సెప్టెంబర్‌లో 57.5కు పడింది. అంతక్రితం ఐదు నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో ఇండెక్స్ నమోదు కావడం ఇదే తొలిసారి. అయితే సూచీ 50పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణిస్తారు. ఆ స్థాయి దిగువకు పడిపోతేనే దానిని క్షీణతగా పేర్కొంటారు. ఈ ప్రాతిపదికన సూచీ 27 నెలల నుంచి వృద్ధి బాటనే పయనిస్తోంది. తాజా సమీక్షా నెల సెప్టెంబర్‌లో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి నెమ్మదించినట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనమిక్స్ విభాగం అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు.



ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే...



- ఆసియా మార్కెట్ల బలహీనతలు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం
- సెన్సెక్స్‌కు 316 పాయింట్ల నష్టం

ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, ఆసియా మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల ప్రభావంతో స్టాక్ మార్కెట్ మంగళవారం అరశాతం పతనమైంది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఒకశాతానికి పైగా క్షీణించి సూచీలను నష్టాల వైపు నడిపించాయి. సెన్సెక్స్ 316 పాయింట్లు క్షీణించి 65,512 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109 పాయింట్లు నష్టపోయి 19,529 వద్ద నిలిచింది. 3 రోజుల వరుస సెలవుల తర్వాత స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 484 పాయింట్లు పతనమై 65,345 వద్ద, నిఫ్టీ 158 పాయింట్లు క్షీణించి 19,480 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. ప్రైవేట్ బ్యాంకింగ్, ఆటో, ఐటీ స్టాకులు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, మీడియా, రియల్టీ, కన్స్యూమర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,034 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,361 కోట్ల షేర్లను కొన్నారు. వడ్డీరేట్ల పెంపు ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఆర్‌బీఐ పాలసీ, కార్పొరేట్ క్యూ2 ఫలితాల ప్రకటనకు ముందు ప్రభుత్వ రంగ బ్యాంకు షేర్లకు భారీ డిమాండ్ లభించింది. యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, మహారాష్ట్ర బ్యాంక్, పీఎన్‌బీ, పీఎస్‌బీ, ఐఓబీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు 5–3% ర్యాలీ చేశాయి. యుకో బ్యాంక్, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు 2% లాభపడ్డాయి. ఎస్‌బీఐ బ్యాంక్ షేరు ఒక శాతం పెరిగింది. ఎన్ఎస్ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంకు ఇండెక్స్ రెండున్నర శాతం ర్యాలీ చేసింది
- కేంద్ర పెట్రోలియం శాఖ దేశీయ సహజ వాయువు ధరలు 7% పెంచడంతో ఓఎన్‌జీసీ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల అనూహ్య రికవరీ సైతం ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా ఈ షేరు బీఎస్ఈలో 4% నష్టపోయి రూ.185 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4.50% క్షీణించి రూ.184 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఇండెక్సుల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.
- ఐషర్ మోటార్స్ షేరు 3% నష్టపోయి రూ.3351 వద్ద స్థిరపడింది. మోటార్ సైకిళ్ల అమ్మకాలు సెప్టెంబర్లో తగ్గిపోవడం షేరు పతనానికి కారణమైంది.

హిట్... ఫ్లాట్

నష్టాల మార్కెట్లోనూ జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిస్టింగ్ బంపర్ హిట్ కొట్టింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.119)తో పోలిస్తే 20% ప్రీమియంతో రూ.143 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ ఆద్యంతం కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా షేరు 32.18% ర్యాలీ చేసి ఇంట్రాడే గరిష్ట స్థాయి రూ.157 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.33,033 కోట్లుగా స్థిరపడింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 57.99 లక్షల ఈక్విటీ షేర్లను చేతులు మారాయి.

- మనోజ్ వైభవ్ జెమ్స్ ఎన్ జ్యువెలర్స్ షేరు ఫ్లాటుగా లిస్టయింది. ఇష్యూ ధర (రూ.215)తో పోలిస్తే బీఎస్ఈలో లాభ, నష్టాలు లేకుండా రూ.215 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో రూ.210–222 మధ్య ట్రేడైంది. చివరికి 0.30% స్వల్ప లాభంతో రూ.216 వద్ద క్లోజైంది. మార్కెట్ విలువ రూ.1,053 కోట్లుగా నమోదైంది.

వీ గార్డ్ నుంచి ప్రీమియం బీఎల్‌డీసీ ఫ్యాన్లు



ముంబై: ప్రముఖ కన్జూమర్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ సంస్థ వీ–గార్డ్ 'ఇన్‌సైట్ –జీ' పేరుతో ప్రీమియం బీఎల్‌డీసీ ఫ్యాన్లు ఆవిష్కరించింది. వీటిలో ఆర్ఎంపీ 370 హై స్పీడ్ మోటార్ ఉంది. 5 స్టార్ రేటింగ్‌తో ఐదేళ్ల వారెంటీ కలిగి ఉన్నాయి. కనీసం 35 వాట్ల కంటే తక్కువ విద్యుత్‌ను వినియోగించుకుంటూ వార్షికంగా రూ.1518 ఆదా చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. డస్ట్ రిప్లెంట్ కోటింగ్, రివర్స్ మోడ్ ఆపరేషన్, వినియోగానికి అనుకూలమైన రిమోట్ కంట్రోల్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. బూస్ట్ మోడ్, బ్రీజ్ మోడ్, స్లీప్ మోడ్, స్టాండర్ మోడ్, కస్టమ్ మోడ్‌తో సహా పలు ఆపరేషన్ మోడ్‌లను కూడా అందిస్తుంది. భారతీయ గృహాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఫ్యాన్లు తయారు చేశామని కంపెనీ ఎండీ రామచంద్రన్ తెలిపారు.

భవిత

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆధ్వర్యంలో.. Quiz, Drawing, Essay పోటీలు. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే ఈ క్యూఆర్ స్కాన్ చేయండి.. మీ తెలివికి పదును పెట్టి.. ఈ పోటీల్లో పాల్గొనండి.. విజేతలుగా నిలవండి. –ఆల్ ది బెస్ట్..

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

తెలంగాణ ఈఎస్ఐసీ ఆసుపత్రుల్లో 70 పారా మెడికల్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం ఈఎస్ఐసీ ఆసుపత్రుల్లో పారామెడికల్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 70
» పోస్టుల వివరాలు: ఈసీజీ టెక్నీషియన్–08, జూనియర్ రేడియోగ్రాఫర్–27, జూనియర్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్–13, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్–01, ఓటీ అసిస్టెంట్–15, ఫార్మసిస్ట్(ఆయుర్వేద)–01, రేడియోగ్రాఫర్–02, సోషల్ గైడ్/సోషల్ వర్కర్–03.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో 10+2, డిప్లొమా, సర్టిఫికేట్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, టైపింగ్/డేటా ఎంట్రీ టెస్ట్(పోస్టుకు అవసరమైతే), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» పరీక్ష విధానం: టెక్నికల్/ప్రొఫెషనల్ నాలెడ్జ్(50 ప్రశ్నలు–100 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(10 ప్రశ్నలు–10 మార్కులు), జనరల్ ఇంటెలిజెన్స్(20 ప్రశ్నలు–20 మార్కులు), అర్థమెటిక్ ఎబిలిటీ(20 ప్రశ్నలు–20 మార్కులు) సబ్జెక్టుల్లో ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 100 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయి. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.10.2023
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:30.10.2023
» వెబ్‌సైట్: esic.gov.in

నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌లో 43 డిప్యూటీ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ హౌసింగ్ బ్యాంక్(ఎన్‌హెచ్‌బీ).. కాంట్రాక్టు/రెగ్యులర్ ప్రాతిపదికన అసిస్టెంట్/డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 43
» పోస్టుల వివరాలు: జనరల్ మేనేజర్(స్కేల్ 7)–01, డిప్యూటీ జనరల్ మేనేజర్(స్కేల్4)–01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(స్కేల్ 5)–01, డిప్యూటీ మేనేజర్(స్కేల్ 2)–04, అసిస్టెంట్ మేనేజర్(స్కేల్ 1)–17, కాంట్రాక్టు పోస్టులు(చీఫ్ ఎకనామిస్ట్/ఎస్‌పీడీ/ఎస్‌పీఎఫ్‌వో/పీఎఫ్‌వో)–19.
» అర్హత: పోస్టును అనుసరించి సీఏ, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:18.10.2023
» వెబ్‌సైట్: https://nhb.org.in

విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో 40 అప్రెంటిస్‌లు

విశాఖపట్నంలోని విశాఖపట్నం పోర్ట్ అథారిటీ.. వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 40
» ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–16, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌లు–24.
» విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
» అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా 2020/2021/2022 సంవత్సరాలలో ఉత్తీర్ణులై ఉండాలి.
» స్టైపెండ్: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు నెలకు రూ.9000, టెక్నీషియన్ అప్రెంటిస్‌కు నెలకు రూ.8000. శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం.
» ఎంపిక విధానం: గ్రాడ్యుయేట్/డిప్లొమా మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:24.10.2023
» వెబ్‌సైట్: https://vizagport.com

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 04
» విభాగాలు: టెస్టింగ్/మెయింటెనెన్స్/రిపేర్ ఆఫ్ కంట్రోల్–ఇన్‌స్ట్రుమెంటేషన్ సిస్టమ్స్/ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్ సిస్టమ్స్ తదితరాలు.
» అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 30 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.25,000 నుంచి రూ.31,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఇంటర్వ్యూ వేదిక: సుభద్ర హోటల్, కైగా రోడ్.కుర్నిపేటి, కైగా, మల్లాపూర్, ఉత్తర కన్నడ (జిల్లా), కర్ణాటక–581400.
» ఇంటర్వ్యూ తేది: 05.10.2023.
» ఇంటర్వ్యూ సమయం: ఉదయం 9.30 నుంచి 11.30 వరకు.
» వెబ్‌సైట్: www.ecil.co.in

అవుతారా.. సర్కారీ టీచర్

» టీఎస్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయ పోస్టుల దరఖాస్తు ప్రక్రియ
» ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు.. 11 జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) ప్రకటన విడుదల చేసింది. మొత్తం 5,089 టీచర్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. విద్యాశాఖ ఆధ్వర్యంలో నియామకాలు నిర్వహిస్తుంది. టీఆర్‌టీ సిలబస్‌లో స్వల్పమార్పులు జరిగాయి. ఈ నేపథ్యంలో.. టీఆర్‌టీ నోటిఫికేషన్ వివరాలు, పోస్టులు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ తదితర వివరాలు..

- మొత్తం పోస్టులు: 5089 (ఎస్జీటీ–2,575, స్కూల్ అసిస్టెంట్–1739, లాంగ్వేజ్ పండిట్–611, పీఈటీ–164)

అర్హతలు

- పోస్టులను అనుసరించి ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అయిదేళ్ల వయోసడలింపు లభిస్తుంది. దివ్యాంగులకు పదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

ఆన్‌లైన్ పరీక్షలు

టీఆర్‌టీ పరీక్షలను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్–సీబీటీ) విధానంలో మొత్తం 11 రోజులపాటు (నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు) నిర్వహిస్తారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) పోస్టులకు ఆరు రోజులపాటు పరీక్షలు ఉంటాయి. అలాగే ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠాలు చెప్పేందుకు అవసరమైన స్కూలు అసిస్టెంట్ (ఎస్ఏ) కొలువులకు మూడు రోజుల పాటు పరీక్షలు జరుపుతారు. పీఈటీలు, భాషా పండితులకు ఒక్కో రోజు చొప్పున పరీక్షను నిర్వహిస్తారు. రోజుకు రెండు విడతల చొప్పున ఈ పరీక్షలుంటాయి. మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు; అలాగే రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారు.

పరీక్ష విధానం

స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, భాషా పండితులకు నిర్వహించే పరీక్ష 160 ప్రశ్నలకు ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు అర మార్కు చొప్పున 80 మార్కులకు పరీక్ష జరుగుతుంది. దీంతోపాటు టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. అంటే.. మొత్తం 100 మార్కులకు పరిగణలోకి తీసుకుని తుది ర్యాంకు కేటాయిస్తారు. ఇక పీఈటీ, పీఈడీలకు టెట్ అవసరం లేదు. కాబట్టి వారికి 100 మార్కులకు టీఆర్‌టీ నిర్వహిస్తారు.

ఎస్జీటీ

ఈ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలో జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు–10 మార్కులు, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 20 ప్రశ్నలు–10 మార్కులు, లాంగ్వేజ్–1(ఇండియన్ లాంగ్వేజెస్) 18 ప్రశ్నలు–9 మార్కులు, లాంగ్వేజ్–2(ఇంగ్లిష్) 18 ప్రశ్నలు–9 మార్కులు, మ్యాథమేటిక్స్ 18 ప్రశ్నలు–9 మార్కులు, సైన్స్ 18 ప్రశ్నలు–9 మార్కులు, సోషల్ స్టడీస్18 ప్రశ్నలు–9 మార్కులు, టీచింగ్ మెథడాలజీ(స్ట్రాటజీ పేపర్స్) 30 ప్రశ్నలు–15 మార్కులుంటాయి.

స్కూల్ అసిస్టెంట్

ఈ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. అవి..జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు–10 మార్కులు, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 20ప్రశ్నలు–10 మార్కులు, సంబంధిత సబ్జెక్టు 88 ప్రశ్నలు–44 మార్కులు, టీచింగ్ మెథడాలజీ 32 ప్రశ్నలు–16 మార్కులకు పరీక్ష ఉంటుంది.

మారిన సిలబస్

ఎస్జీటీ పోస్టులకు పరీక్ష రాసే వారికి 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు; స్కూల్ అసిస్టెంట్ పరీక్ష రాసేవారికి 1వ తరగతి నుంచి 10వ తరగతితోపాటు ప్లస్ టూ నుంచి ప్రశ్నలు ఇస్తామని విద్యాశాఖ పేర్కొంది. ఎస్జీటీలకు ఇచ్చే ప్రశ్నలు నిర్ణీత తరగతులను దాటి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ప్రతి ప్రశ్నకు అర మార్కు కేటాయిస్తారు. కాబట్టి ప్రతి ప్రశ్నను కీలకంగానే భావించాలి.

పరీక్ష కేంద్రాలు

మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 21.10. 2023
- పరీక్ష తేదీలు: 2023నవంబర్ 20నుంచి 30వరకు
- వెబ్‌సైట్ : www.schooledu.telangana.gov.in

కోల్ ఇండియాలో.. మేనేజ్‌మెంట్ ట్రెయినీ

560 ఉద్యోగాలకు ప్రకటన విడుదల



భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వశాఖకు చెందిన మహారత్న సంస్థ.. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్). కోల్‌కతా ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ సంస్థ 560 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. సంబంధిత పోస్టులను అనుసరించి డిగ్రీ, ఎమ్మెస్సీ, ఎంఈ, ఎంటెక్ అభ్యర్థులు ఈ పోస్టులకు పోటీ పడవచ్చు. గేట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.

- మొత్తం పోస్టుల సంఖ్య: 560 (మైనింగ్ ఇంజనీరింగ్–351, సివిల్ ఇంజనీరింగ్–172, జియాలజీ–37)

అర్హతలు

- మైనింగ్ ఇంజనీరింగ్: కనీసం 60 శాతం మార్కులతో మైనింగ్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి.
- సివిల్ ఇంజనీరింగ్: కనీసం 60 శాతం మార్కులతో సివిల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- జియాలజీ: జియాలజీలో ఎమ్మెస్సీ/ఎంటెక్ పూర్తి చేసి ఉండాలి. లేదా అప్లయిడ్ జియాలజీ/జియోఫిజిక్స్ లేదా 60 శాతం మార్కులతో అప్లయిడ్ జియోఫిజిక్స్ విద్యార్హత ఉండాలి.
- వయసు: 31.08.2023 నాటికి 18–30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. కోల్ ఇండియా నిబంధనల ప్రకారం–వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనాలు

ఎంపికైన అభ్యర్థులు ఇ–2 గ్రేడ్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరికి ఇ–2 గ్రేడ్‌కు అందించే పే స్కేల్ ప్రకారం –రూ.50,000–1,60,000 వేతనంగా చెల్లిస్తారు.

ఎంపిక ప్రక్రియ

గేట్–2023 స్కోర్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పోస్టింగ్

ఎంపికైన అభ్యర్థులు దేశంలోని కోల్‌ఫీల్డ్ ప్రాంతాల్లో ఎక్కడైనా విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉండాలి. మేనేజ్‌మెంట్ నిర్ణయం ప్రకారం–ఖాళీల లభ్యతను బట్టి మూడు పోస్టింగ్ చాయిస్ ఆప్షన్ కూడా ఇస్తారు. అభ్యర్థులు ఈ మూడింటిలో తమ ఎంపికను తెలియజేయాల్సి ఉంటుంది.

సర్వీస్ బాండ్

ఎంపికైన అభ్యర్థులు 60 నెలల పాటు సంస్థలోనే పనిచేస్తామనే హామీతో సర్వీస్ అగ్రిమెంట్ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. రూ.3లక్షల విలువైన ఈ బాండ్ జాయినింగ్ సమయం నుంచి అమలులోకి వస్తుంది. ఇందుకోసం అభ్యర్థుల వేతనం నుంచి ప్రతి నెల రూ.5000 తీసుకుంటారు. 60 నెలల సమయం పూర్తైన తర్వాత వడ్డీ లేకుండా సంబంధిత మొత్తాన్ని చెల్లిస్తారు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 12.10.2023
- వెబ్‌సైట్: https://www.coalindia.in

క్లుప్తంగా...

9 వరకు ఇంటర్ అడ్మిషన్లకు గడువు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో చేరేందుకు గడువును పొడిగిస్తున్నట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. రూ.వేయి ఆలస్య రుసుముతో ఈనెల 9వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని వెల్లడించింది. ఇంటర్ బోర్డు గుర్తింపు ఉన్న కాలేజీల్లో మాత్రమే విద్యార్థులను చేర్చాలని సూచించింది. గుర్తింపు కాలేజీల వివరాలను తమ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపింది.

బ్యాంకు ఉద్యోగాలకు ఎస్టీ సంక్షేమ శాఖ ఉచిత కోచింగ్

సాక్షి, హైదరాబాద్: బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపు ఎస్టీ స్టడీ సర్కిల్ ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అభ్యర్థులకు కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలలోపు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాల్లో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. మరిన్ని వివరాలకు 040-27540104 ఫోన్‌నంబర్‌లో కార్యాలయ పనివేళ్లలో ఫోన్ చేసి సంప్రదించాలని సూచించింది.

డెంగీతో చిన్నారి మృతి



తాండూరు టౌన్ (వికారాబాద్ జిల్లా) : డెంగీ జ్వరంతో వికారాబాద్ జిల్లాలో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తాండూరులోని మార్కండేయ కాలనీకి చెందిన మల్లికార్జునస్వామి పురోహితుడు. ఈయన పెద్ద కూతురు భవాని(10) స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. నాలుగు రోజులుగా బాలిక తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా.. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. సోమవారం రాత్రి బాలిక పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.


అమృత్‌నోని బ్రాండ్ అంబాసిడర్‌గా క్రికెటర్ సూర్యకుమార్



సాక్షి, హైదరాబాద్: అమృత్‌నోని బ్రాండ్ అంబాసిడర్‌గా క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్ నియమితులయ్యారు. 'అమృత్ నోని కుటుంబంలో నేను భాగమైనందుకు సంతోషంగా ఉంది' అంటూ ఆయన తన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. 'అమృత్ నోని భారతదేశంలోని ప్రముఖ ఆయుర్వేద సంస్థ. దశాబ్దాలుగా ఆయుర్వేద ఉత్పత్తులను తయారు చేస్తోంది. అమృత్‌నోని ఫ్లాగ్‌షిప్ ఆయుర్వేద ఉత్పత్తి పెయిన్ రిలీఫ్ స్ప్రే అందరి దృష్టిని ఆకర్షించింది.అమృత్ నోని ఆయుర్వేద ఉత్పత్తుల్లో అమృత్ నోని పవర్ ప్లస్, అమృత్ నోని డి-ప్లస్, అమృత్ నోని ఆర్థోప్లస్, అమృత్ నోని గ్యాస్ట్రిన్, అమృత్ నోని పెయిన్ ఆయిల్, అమృత్ నోని క్యాన్సి కేర్ వంటివి ఉన్నాయి. పెయిన్ రిలీఫ్ స్ప్రే అన్ని ఆయుర్వేద, మెడికల్ స్టోర్లలో అందుబాటులో ఉంటుంది' అని తెలిపారు.

ఎస్ఆర్ఎంఐఎస్‌టీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

సాక్షి, హైదరాబాద్: ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. 8,500 మంది విద్యార్థులు తమ డిగ్రీలను అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డబ్ల్యూఎఫ్ఎంఈ) అధ్యక్షుడు ప్రొఫెసర్ రికార్డో లియాన్ బోర్వెజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన డిగ్రీలను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ 'గ్రాడ్యుయేషన్ డే అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమైనది. ఇది జీవితంలో ఒక దశకు ముగింపు కాగా, మరో దశకు ఆరంభం లాంటింది'అని పేర్కొన్నారు. వైద్య విద్య గురించి మాట్లాడుతూ దీన్ని చదివే అవకాశం దొరకడం గొప్ప విషయం అన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ సెక్రటరీ వైద్య రాజేశ్ కటేచ, చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ వీర ముత్తువేల్‌లను ఎస్ఆర్ఎంఐఎస్‌టీ వ్యవస్థాపక అధ్యక్షుడు టీఆర్ పారివేందర్ డిగ్రీ ఆఫ్ డాక్టర్ ఆఫ్ సైన్స్‌తో సత్కరించారు.



ఏషియన్ గేమ్స్‌లో షూటింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థిని ఈషా సింగ్ నేటి యువతకు ఆదర్శమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఇషా సింగ్‌కు తన వంతు సహకారంగా రూ.10 లక్షల చెక్కును అందజేశారు. – మేడ్చల్ రూరల్

జ్వరం.. వణుకుతున్న జనం!

రాష్ట్రంలో ఏ ఇంటి తలుపు తట్టినా జ్వర బాధితులే.. • కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు

ఈ సీజన్‌లో ఇప్పటివరకు 5,315 డెంగీ కేసులు • మరణాలు కూడా నమోదవుతున్నాయంటున్న క్షేత్రస్థాయి సిబ్బంది

వైద్యారోగ్యశాఖ అధికారికంగా వెల్లడించడం లేదనే విమర్శలు • ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబాలు

ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం ఒడిశా కాలనీకి చెందిన బోయ అజయ్, బోయ మరియమ్మల కుమార్తె అక్షర (3) విషజ్వరంతో ఆదివారం మృతి చెందింది. చిన్నారికి తీవ్ర జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే ఏటూరునాగారంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ సరిగా వైద్యం అందక.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలోనే కన్నుమూసింది.





ములుగు జిల్లా మంగపేట మండలం ఒరిస్సా కాలనీలో వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతున్న బాలింతలు

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని పోచమ్మవాడకు చెందిన గోస్కుల శ్రీజ (4) అనే చిన్నారి డెంగీ లక్షణాలతో మరణించింది. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆమెకు తొలుత సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స అందించారు. తర్వాత హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ప్రాణాలు వదిలిసింది.

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం కొత్మీర్ గ్రామానికి చెందిన యువకుడు మిట్టె నాగరాజు (24) ఆదివారం రాత్రి విష జ్వరానికి బలయ్యాడు. అప్పటికే నాలుగైదు రోజులుగా జ్వరంతో కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందినా పరిస్థితి మెరుగుకాలేదు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

డెంగీ కేసులు, మరణాల తీరు.. (ఎన్‌సీవీబీడీసీ నివేదిక)	ఏడాది	కేసులు	మరణాలు	ఏడాది	కేసులు	మరణాలు
	2018	4,592	02	2021	7,135	00
	2019	13,331	07	2022	8,972	00
	2020	2,173	00	2023	5,315	00

సాక్షి ప్రతినిధి, వరంగల్

రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల ఇలాంటి ఘటనలు నమోదవుతున్నాయి. డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభించి జనం అల్లాడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 5,315 డెంగీ కేసులు నమోదయ్యాయి. కేసుల సంఖ్య సంగతేమోగానీ పెరుగుతున్న మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పట్టణాలు, నగరాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఏ ఇంటి తలుపు తట్టినా ఒక్కరిద్దరు జ్వరంతో మంచాన పట్టి కనిపిస్తున్నారు. గత ఇరవై రోజులుగా విష జ్వరాల తీవ్రత మరింతగా పెరిగింది. డెంగీ, మలేరియాలతో గత ఐదారు రోజుల్లోనే ఉమ్మడి వరంగల్‌లో నలుగురు మృత్యువాత పడటం ఆందోళనకరం. గోదావరి పరీవాహక ఏజెన్సీ ప్రాంతాల్లో.. ముఖ్యంగా కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జేఎస్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం ఏజెన్సీ పల్లెల్లో జ్వరాలు హడలెత్తిస్తున్నాయి.

గంటల వ్యవధిలోనే ప్రాణం పోయింది



చలాకీగా నవ్వుతూ, నవ్విస్తూ కళ్లముందు తిరిగిన నాబిడ్డ గంటల వ్యవధిలోనే దూరమైపోయింది. గత నెల 28న ఆమెకు జ్వరం వస్తే.. స్థానిక ప్రైవేటు వైద్యుడి వద్దకు తీసుకెళ్లాం. పరీక్షించి ఇంజక్షన్ ఇచ్చి, సిరప్ రాసిచ్చాడు. ఇంటికి తీసుకొచ్చి సిరప్ తాగిస్తే తెల్లవారే సరికి జ్వరం తగ్గింది. రెండు రోజులు బాగానే ఉంది. కానీ 30న మధ్యాహ్నం కడుపులో నొప్పి అంటూ వాంతులు చేసుకుంది. వెంటనే ఏటూరునాగారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాం. రూ.10వేలు అడ్వాన్సుగా తీసుకుని ఆస్పత్రిలో చేర్చుకున్నారు. కానీ పరిస్థితి సీరియస్‌గా ఉందని, తమ వల్ల కాదంటూ 65 కిలోమీటర్ల దూరంలోని మణుగూరుకు వెళ్లాలని చెప్పారు. అక్కడికి తీసుకెళ్తుండగానే నా బిడ్డ ప్రాణాలు విడిచింది. – బోయి అజయ్, (అక్షర తండ్రి)

ఆందోళన వద్దు..

మలేరియా, డెంగీ జ్వరాల పట్ల ఆందోళన వద్దు. అప్రమత్తంగా ఉంటే చాలు. ఇటీవల జ్వరాలు విజృంభిస్తుండటంతో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారుల సూచన మేరకు డెంగీ, మలేరియాలను నియంత్రించేందుకు గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నాం. జ్వరం లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సహాయం పొందాలి. రక్త పరీక్షలు చేయించుకోవాలి. తగిన జాగ్రత్తలు పాటించాలి. డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులకు తగినన్ని మందులు అన్ని ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ సాంబశివరావు, డీఎంహెచ్ఓ, హనుమకొండ

రావిర్యాల మెగా డెయిరీ రెడీ!

- రూ.250 కోట్ల వ్యయంతో నిర్మాణం
- రేపు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- రోజుకు 5లక్షల నుంచి 8 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్‌తో ప్యాకేజీ.. 30 టన్నుల వెన్న... 10 టన్నుల నెయ్యి ఉత్పత్తి చేసే సామర్థ్యం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల గ్రామంలో 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్ల వ్యయంతో నిర్మించిన తెలంగాణ విజయ ఫెడరేషన్‌కు చెందిన మెగా డెయిరీ గురువారం ప్రారంభం కానుంది. రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి, మున్సిపల్, ఐటీ మంత్రి కేటీఆర్ ఈ డెయిరీని ప్రారంభించనున్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) సహకారంతో దేశంలోనే అత్యాధునిక ఆటో మిషన్ ప్రాసెసింగ్ టెక్నాలజీతో ఈ మెగా డెయిరీని ఏర్పాటు చేశారు. సోలార్‌తో పాటు వ్యర్థాల వినియోగంతో తయారైన విద్యుత్‌ను ఈ డెయిరీ నిర్వహణకు వినియోగించనున్నారు.

మెగా డెయిరీ ఓ మైలురాయి: తలసాని

డెయిరీ ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డిలతో పాటు రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. తెలంగాణ డెయిరీ చరిత్రలోనే మెగా డెయిరీ ఓ మైలురాయిగా నిలుస్తుందని, నష్టాల్లో ఉన్న తెలంగాణ డెయిరీ రంగం సీఎం కేసీఆర్ చొరవతో లాభాల బాట పట్టిందని తెలిపారు.



మెగా డెయిరీ ప్రత్యేకతలివే:
- రోజుకు 5 లక్షల నుంచి 8లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్‌తో పాటు ప్యాకేజింగ్ సామర్థ్యం
- లక్ష లీటర్ల టెట్రాబ్రిక్ పాల ఉత్పత్తి
- 30 టన్నుల వెన్న, రోజుకు 10 టన్నుల నెయ్యి ఉత్పత్తి
- 5–10 వేల లీటర్ల ఐస్‌క్రీం తయారీ.. 20 టన్నుల పెరుగు, 12 వేల లీటర్ల మజ్జిగ, లస్సీ తయారీ సామర్థ్యం
- సుమారు లక్ష మందికి పైగా పాడి రైతులకు ప్రయోజనం

'బీఎస్సీ అగ్రికల్చర్' ప్రవేశాలకు 6,7 తేదీల్లో కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: వనపర్తి, కరీంనగర్‌లో ఉన్న ఉమెన్ రెసిడెన్షియల్ కాలేజీల్లో బీఎస్సీ (ఆనర్స్)అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశానికి ఈనెల 6,7 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసెట్- 2023 బైపీసీ స్ట్రీమ్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు వెంటనే మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లో వివరాలను పరిశీలించాలన్నారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం క్యాంపస్‌లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈనెల 6న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి రెండు విడతలుగా కౌన్సెలింగ్ జరుగుతుందని, 7వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులంతా తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

'గృహలక్ష్మి' ఇవ్వండి.. సర్పంచ్ వేడుకోలు

- పదేళ్ల నుంచి గుడిసెలోనే నివాసం
- గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేస్తే జాబితా నుంచి తొలగించిన బీఆర్ఎస్ నేతలు

పెద్దవూర (నల్లగొండ) : గుడిసెలో జీవనం సాగిస్తున్నానని తనకు గృహలక్ష్మి పథకం కింద ఇల్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పోతునూరు సర్పంచ్ తుమ్మ దుర్గమ్మ కోరారు. మంగళవారం సర్పంచ్ తుమ్మ దుర్గమ్మ శ్రీను దంపతులు తాము నివాసం ఉండే గుడిసెలో నిల్చుని ఫొటోలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీలో ఉంటున్నామని, గుడిసెలోనే ఉంటూ ప్రజాసేవ చేస్తున్నామని, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో పోతునూరు సర్పంచ్‌గా గెలుపొందానని పేర్కొన్నారు. తనకు పక్కా ఇల్లు లేనందున గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకున్నానని, కానీ కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కక్షపూరితంగా వ్యవహరించి తన పేరును జాబితా నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అర్హులను గుర్తించి గృహలక్ష్మి పథకం ఇవ్వాలని వేడుకుంటున్నట్లు పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎవరినోట విన్నా సర్పంచ్ పేరే జాబితా నుంచి తొలగించారంటే గృహలక్ష్మి జాబితాలో తమ పేర్లు వస్తాయో రావోనని... అర్హులను కాదని ఏమైనా అవినీతి జరిగిందా అని చర్చించుకుంటున్నారు.



గుడిసెలో సర్పంచ్ దంపతులు

దశాబ్దాల స్వప్నం సాకారమైంది!

- సిద్దిపేట-సికింద్రాబాద్ రైలును వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని.. సిద్దిపేటలో జెండా ఊపి ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు
- రైలు తమ వల్లే వచ్చిందంటూ బీఆర్ఎస్, బీజేపీ పోటాపోటీగా నినాదాలు.. కుర్చీలు, జెండా కర్రలను విసిరేసుకున్న కార్యకర్తలు

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. సిద్దిపేట- సికింద్రాబాద్ రైలును నిజామాబాద్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా మంగళవారం సాయంత్రం 4:20 గంటలకు ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించి.. అనంతరం రైలులో ప్రయాణించారు. కొండపాక మండలం దుద్దెడ స్టేషన్‌లో దిగి కొండపాక మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదే రైలులో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు గజ్వేల్ వరకు ప్రయాణించారు.

బీఆర్ఎస్, బీజేపీ పోటా పోటీ నినాదాలు..

రైలు ప్రారంభోత్సవం సందర్భంగా సిద్దిపేట రైల్వే స్టేషన్‌కు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు వల్లే సిద్దిపేటకు రైలు వచ్చిందని, బీజేపీ కార్యకర్తలు మోదీ వలనే సిద్దిపేటకు రైలు వచ్చిందని పోటాపోటీగా నినాదాలు చేశారు. ఫ్ల కార్డులు, తమ పార్టీకి చెందిన జెండాలు పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలోనే మంత్రి హరీశ్‌రావు రైలు ప్రారంభించేందుకు అక్కడకు చేరుకున్నారు. ఫ్లెక్సీలో సీఎం కేసీఆర్, స్థానిక ఎంపీ ఫొటోలను ఏర్పాటు చేయకపోవడంతో రైల్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అహసనం వ్యక్తం చేస్తూ మోదీ చిత్రాలను ప్రదర్శిస్తున్న ఎల్ఈడీ టీవీని పక్కన పెట్టించారు. అప్పటికే బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల పోటాపోటీ నినాదాలతో ఉద్రిక్తత నెలకొంది. స్టేజీ పైన మోదీ చిత్రంతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపేశారు. దీంతో కార్యకర్తలు పరస్పరం బాహాబాహీకి దిగారు. కుర్చీలు, పార్టీల జెండాలను విసురుకోవడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులకు స్వల్పంగా గాయాలయ్యాయి. రైల్వే పోలీసు చంద్రశేఖర్‌కు తలకు కూడా గాయమైంది.

సొమ్ము ఒకడిది...సోకు ఒకడిది: హరీశ్

సిద్దిపేటకు రైల్వే లైన్ కోసం రూ. 310 కోట్ల వ్యయంతో 2,508 ఎకరాల భూమిని సేకరించి రైల్వే శాఖకు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.330 కోట్లను చెల్లించామని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఇంత కష్టపడితే కనీసం సీఎం ఫొటోను పెట్టకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుద్దెడ రైల్వే స్టేషన్‌లో దిగిన తర్వాత కొండపాక ఐవోసీ బిల్డింగ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీజేపీ వాళ్లు రైలు వాళ్ల వల్లే వచ్చిందని చెప్పుకోవడం సిగ్గు చేటని విమర్శించారు.




సిద్దిపేట రైలులో ప్రయాణిస్తున్న మంత్రి హరీశ్ రావు



స్టేషన్‌లో బాహాబాహీకి దిగిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు

టుడేస్ గ్రాఫిక్



నోట్: ఉన్నత విద్యావంతుల శాతం అంటే.. యూనివర్సిటీ స్థాయి విద్య పూర్తిచేసిన 25 నుంచి 34 ఏళ్ల వయసు వారు

భార్య కొట్టిందని నడి రోడ్డు మీద ఉరేసుకోబోయాడు..

- సిరిసిల్ల గాంధీ విగ్రహం వద్ద ఘటన



ఆత్మహత్యకు యత్నించిన మల్లేశం

సిరిసిల్లక్రైం: ఇంట్లో భార్య కొట్టిందని భర్త ఆత్మహత్యకు యత్నించిన ఘటన సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్లలోని శాంతినగర్‌కు చెందిన గాడిపెల్లి మల్లేశం(55) పవర్‌లూం వర్కర్. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో మల్లేశంతో భార్య గొడవ పడి తన కుటుంబసభ్యులతో కలిసి ఆయనను కొట్టింది. మనస్తాపానికి గురైన మల్లేశం ఇంటిలోని రంగుబట్టను తీసుకుని సిరిసిల్ల గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నాడు. విగ్రహం వద్ద మెట్ల రెయిలింగ్‌కు ఉరివేసుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు పద్మారెడ్డి దీన్ని గమనించి మల్లేశంను రక్షించాడు. మల్లేశం మద్యంమత్తులో ఉన్నాడని, పూర్తి దర్యాప్తు కోసం స్టేషన్‌కు తరలించామని హోంగార్డు తెలిపారు.



60 పైసల చెక్కు..



నంగునూరు (సిద్దిపేట): 'చారాణా కోడికి బారాణా మసాల' అనే సామెత నిజం చేస్తూ 60 పైసల బ్యాంక్ చెక్కును చూసి ముక్కున వేలు వేసుకున్నారు ప్రజలు. సిద్దిపేట జిల్లా నర్మేటకు చెందిన దాచవరం రాజశేఖర్‌కు రెండు రోజుల కిందట స్పీడ్‌పోస్ట్ ద్వారా కవర్ వచ్చింది. అందులో కేరళలోని సౌత్ ఇండియా బ్యాంక్ త్రిసూర్ బ్రాంచ్ నుంచి అకౌంట్‌పే ద్వారా 60 పైసల చెక్కు రావడంతో రాజశేఖర్ అవాక్కయ్యాడు. చెక్కు ఎవరు పంపారు.. తనకు డబ్బులు ఎందుకు వచ్చాయో.. తెలియక జుట్టు పీక్కున్నాడు. రెండు రోజులపాటు కష్టపడి విచారిస్తే గతంలో క్రెడిట్ కార్డు ద్వారా తీసుకున్న లోన్ క్లియరెన్స్ చేయగా 60 పైసలు ఎక్కువ కట్టినట్లు తేలగా చెక్కు పంపారని తెలుసుకున్నాడు. రాజశేఖర్‌కు చెల్లించే డబ్బులకంటే చెక్కు ఓచర్, స్పీడ్ పోస్టుకు అయ్యే ఖర్చులు ఎక్కువైనా న్యాయబద్ధంగా చెక్కు పంపినందుకు లోన్ ఇచ్చిన కంపెనీ వారిని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఇంతకీ 60 పైసల చెక్కు తన అకౌంట్‌లో వేసుకోవాలా.. వద్దా అని రాజశేఖర్ డైలమాలో పడిపోయారు.

రూ .50 కోట్ల విస్కీ బాటిల్ !

ఇది ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన మద్యం సీసా! కొన్ని లక్షలు ఉండొచ్చనుకుంటున్నారా? అయితే మీరు పొరబడ్డట్లే..!! ఎందుకంటే దీని ధర ఏకంగా రూ .50 కోట్లపైనే!! ఈ సీసాను 8,500 వజ్రాలు, 300 కెంపులతో పొదగడంతోపాటు వైట్ గోల్డ్‌తో మెరుగులు దిద్దారు. యూకేకు చెందిన ద లగ్జరీ బెవరేజ్ కంపెనీ... ఇసబెల్లా ఐలా ఒరిజినల్ విస్కీ పేరుతో ప్రీమియం సింగిల్ మాల్ట్ విస్కీని ఈ సీసాలో విక్రయిస్తోంది. పైగా దీన్ని ఓ అందమైన చిన్న పెట్టిలో భద్రపరిచి కొనుగోలుదారులకు అందిస్తోంది.



రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం పీఎంఓకు బెదిరింపు కాల్

గద్వాల క్రైం: త్వరలోనే ప్రధాని మోదీని హతమారుస్తానంటూ పీఎంఓకు చేసిన బెదిరింపు కాల్‌పై ఎన్ఐఏ విచారణ జరిపింది. ఆ కాల్ చేసింది జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన ఎస్పీజీ మాజీ ఉద్యోగి అని, ఇతడు రెండేళ్ల క్రితం రిటైర్ అయినట్లుగా గుర్తించింది. దీంతో ఇతడిని మంగళవారం అదుపులోకి తీసుకుని ఎన్ఐఏ అధికారులు లోతుగా విచారిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పటికీ అందకపోవడంతో తాగిన మైకంలోనే పీఎంఓకు బెదిరింపు కాల్ చేసినట్లు విచారణలో చెప్పినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్పీ సృజనను 'సాక్షి' సంప్రదించగా.. అలంపూర్ పీఎస్‌లో కేసు నమోదు చేశామని, సదరు వ్యక్తికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతోనే ఇలా చేసినట్లు విచారణ తేలిందన్నారు.



విధుల్లోకి 235 మంది అగ్నివీరులు

సాక్షి, హైదరాబాద్: విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 235 మంది రెండో బ్యాచ్ అగ్నివీరులు విధుల్లో చేరారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని వన్ ఈఎంఈ(ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్) సెంటర్‌లో జరిగిన రెండో బ్యాచ్ పాసింగ్‌అవుట్ పరేడ్‌లో వన్ ఈఎంఈ సెంటర్ కమాండెంట్, బ్రిగేడియర్ సురేశ్ పాల్గొని అగ్నివీరుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. వీరందరికీ వన్ ఈఎంఈ సెంటర్‌లో సాంకేతిక అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ...దేశ సమగ్రతను కాపాడేందుకు, సరిహద్దుల రక్షణకు అగ్నివీరులు తమ జీవితాలను అంకితం చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయి విధుల్లో వినియోగించడంతోపాటు విధి నిర్వహణలో అంకితభావంతో ఉండాలని సూచించారు. శిక్షణలో భాగంగా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన అగ్నివీరులకు బ్రిగేడియర్ పతకాలను అందించారు. అగ్నివీరులను క్షేత్రస్థాయి విధుల కోసం దేశవ్యాప్తంగా ఉన్న మిలిటరీ యూనిట్లకు పంపనున్నట్టు అధికారులు తెలిపారు. కాగా, ఆగస్టు 5న మొదటి బ్యాచ్‌లో 177 మంది అగ్నివీరులు విధుల్లోకి చేరిన విషయం తెలిసిందే.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.